
అక్టోబర్ '64

ఇంకా 60 పైసలే!




గౌరి ప్రొడక్షన్స్ సమర్పించు
తోటలో పిల్ల
కోటలో రాణి
దర్శకత్వం: జి.విశ్వనాధం నిర్వహణ: క.భావనారాయణ
రచన:
వేటూరి
సంగీతం:
కోదండపాణి
కెమెరా: నృత్యం:
వేణు . చోప్రా

సచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

విడిప్రతి వెల: 60 పైసలు — ఏడాది చందా: ఏడు రూపాయలే

సంపుటి **2**　　అక్టోబరు **1964**　　సంచిక **10**

ఇదో వరస....!

ముఖచిత్రం:

భరణీవారి "వివాహబంధం"లో "వీణావాణి" భానుమతి.

మేనేజింగ్ ఎడిటరు: వి. వి. రాఘవయ్య

సంపాదక వర్గం:

నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,

బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications and Printed by him at Thrinadh Art Printers, Vijayawada-2.

జ్యోతి దీపావళి సంచిక

దీపావళి సాధారణ పర్వం కాదు.

ఉజ్జ్వలమైన, ఉత్సాహకరమైన నేత్రపర్వం.

జ్యోతి దీపావళి సంచికకూడా

ఉజ్జ్వలమే, ఉత్సాహకరమే !

సహృదయ హృదయ పర్వమే !

రాచకొండ విశ్వనాథశాస్త్రి,

అవసరాల రామకృష్ణరావు,

హితశ్రీ మొదలైన ప్రసిద్ధుల

రచనలతో, మరెన్నో ప్రత్యేకాకర్షణలతో

నవంబర్ 1 వ తేదీకే వెలువడనున్న

జ్యోతి దీపావళి సంచిక

మరొక ఏడాది వరకు మీకు

మరపురాని మధురానుభూతి !

సాధారణ సంచికకు రెట్టింపు సైజులో

120 పేజీలు - వెల రు. 1-50

ఇవాళే మా ఏజంటువద్ద మీ కాపీ రిజర్వుచేసుకోండి.



మట్టినుంచి మానవులను మలచిన మహాత్ముడు

(95 వ జయంతి - అక్టోబర్ 2 వ తేదీ, 1964)

ఉత్తరాయణం

సెప్టెంబరునెల 'జ్యోతి', ముఖపత్ర చిత్రం జిందాబాద్!

— హావిస్.

అట్టమీద నాగేశ్వర, రామారావుల బొమ్మను చూశాను. ఆంధ్రరాజధానిలో ఒకేవేదికమీద అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో తెలుగు కళాకారులందరు కలిసి తమ కళావైభవాన్ని ఏకకంఠంతో ఇతరులకు తెలియజేస్తే ఎంత అందంగా ఉంటుందో నన్న ఊహ నాలో మెదిలింది. మన చలన చిత్రపరిశ్రమ హైదరాబాద్‌కి మారితే రాజధానికి అందాన్ని చేకూర్చటంతోబాటు, ప్రస్తుతపు తెలుగు చిత్రాలు మంచిని పెంచుకోవచ్చు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించవలసిందిగా పర రాష్ట్రీయులను ఆహ్వానిస్తున్న ఈసమయంలో మన చిత్రపారిశ్రామికులు మద్రాసులో వుండడం ఆశ్చర్యంగా ఉంది. మద్రాసులోని తెలుగు చిత్ర కళాకారులందరూ సాధకబాధకాలెన్నున్నా రాష్ట్రీయాభిమానంతో హైదరాబాద్ వెడితే ఎంతో మంచిని చేసినవారవుతారు.

గొడవర్తి రామ్‌ప్రసాద్, మద్రాసు.

సుమారు సంవత్సరంనుండీ విడవకుండా ప్రతి నెల "జ్యోతి" సంచిక వచ్చిననాడే కొని చదివి ఆనందిస్తున్నా. కాని యీ నెల ముఖచిత్రం చూచి, పుస్తకం సాంతం చదివి నంత ఆనందమయింది. తెలుగు వెలుగుల వీద్దరిని ఒకే అట్టపై ముద్రించి, వారిద్దమధ్యా ఏ విభేదములు లేవని ఆంధ్రప్రజలకు ప్రత్యక్షముగా నిరూపించిన మీకు నా అభినందనలు కాని చిన్న మనవి: లోపలి కొన్ని జోక్సు చాలా పాతవి - గమనించ ప్రార్థితులు.

ఎ. రమణారావు, వేలుపాలెం,
(తూ. గో. జిల్లా)

అక్కినేని నాగేశ్వరరావు, నందమూరి తారక రామారావుగార్లు "ఇద్దరు మిత్రులు" మాత్రమేకాదు ఆప్తమిత్రులని గూడా స్టిల్ సత్యంగారి ఇంటివద్ద తీసిన 'స్టిల్' 'సత్యం' చెప్పుచున్నది.

జంటి, మద్రాసు.

ఇద్దరు మిత్రుల ముఖచిత్రం ఈ నెల "జ్యోతి"కి కొత్త అందాన్ని చేకూర్చినది. ఆ ముఖచిత్రాన్ని వెంటనే చింపేసి (పారేశాననుకోగలరు!) బజారుకెళ్ళి ఫ్రేంకట్టించేశానంటే నమ్మండి!

గుండుమళ్ళ వెంకటరామారావు,
శ్రీకాకుళం.

సెప్టెంబరు సంచిక ముఖచిత్రం, నాగేశ్వరరావు, రామారావుచిత్రం చాలాబాగుంది. కొంతమందికి వీరిద్దరిపై వున్న అభిప్రాయాలు ఈ ఫొటో చూచియైనా నశించి పోగలవనుకుంటాను. అయితే లోపలిపేజీల కూర్పులో కొన్ని పొరపాట్లు జరిగినందుకు చింతిస్తున్నాము. ఇకమీదట ఇటువంటి పొరపాట్లు జరుగకుండా ఎడిటరుగారు తగు శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాము.

వి. బాలవేణవులు, కుమారి కమల,
కర్నూలు.

"ఇద్దరు మిత్రులు"ముఖచిత్రం నన్నెంతో కర్షించింది అంటే నమ్మండి! మంచిమంచి కథలన్నీ కలిసి "స్వరలహరి" శీర్షిక లోపాన్ని కప్పివేశాయి. "సెక్రటరీ" సీరియల్ పతికల్ని ఆకర్షిస్తోంది అనడంలో సందేహంలేదనుకుంటా! రాజకీయ వార్తావరణం బాగానేఉంది. పతాళి పన్చాంగం, చైత్రయాత్ర, జోక్సు పర్వాలేదు. "జ్యోతి" జ్యోతే!

సత్యా, గుమ్మలూరు.

మీ సెప్టెంబరు సంచిక చాలా సంతృప్తి కరంగా ఉన్నది. క్రొత్త రచయితల (మీ పత్రికకు) కథలు ప్రచురించడం సహజంగా హర్షించదగ్గ విషయం. జోకులు మాత్రం చాలా పాతవీ, చెత్తవీ అని తెలియ జేయుటకు విచారిస్తున్నాం. అన్ని కథలకూ బాపు బొమ్మలు వేసే ఏర్పాటుచేయించిన హర్షించగలం.

అంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థిబృందం, వాల్తేరు.

నా అభిమాన మాసపత్రిక అయినటువంటి "జ్యోతి" క్రొత్త క్రొత్త శీర్షికలతోనూ, చక్కటి కథలతోనూ, కడుపుబ్బ నవ్వించే జోక్సుతోను వెలువడుతున్నందుకు చాలా సంతోషం. కథలుకూడా ఎంతో బాగుంటున్నాయి. ఈ నెల పత్రికలో "ఆశించని ఆనందం", "జ్యోతి", "అనుమానం" కథలు ఎంతో బాగున్నాయి. కాముడు కథ చదువుతున్నంతసేపు నవ్వాగింది కాదు. అన్నిటికన్నా అగ్రస్థానాన్ని ఆక్రమించే సీరియల్ "సెక్రటరీ" ఎంతో చక్కగావుంది. రచయిత్రి కథను ముందుముందు ఏం జరుగుతుందోనన్న సస్పెన్సుతోనూ, చక్కటి శైలిలోనూ, చక్కటి పంథాలోనూ కథను అతి సమర్థంగా నడిపిస్తున్నారు. ఇంత చక్కటినవల ఇటీవల ఏ పత్రికలోనూ వెలువడలేదని చెప్పవచ్చు. ఈ కథవల్ల మీ "జ్యోతి" ఎక్కడలేని కాంతితో శోభాయమానంగా వుంటోంది. ఇటువంటి కథను రచించి మా జ్యోతికే ఖ్యాతిని తెస్తున్న యద్దనపూడి సులోచనారాణిగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

వి. శ్యామసుందరప్రభు, సత్తెనపల్లి.

"సెక్రటరీ" సీరియల్ చాలా బాగుంది. రచయిత్రి 'జయంతి'ని ప్రధాన పాత్రగా తీసుకున్నారు. కాని ఒక సంచికలో జయంతి తన 'సెక్రటరీ' పదవిని సార్థకం చేసుకొని 'వనితా విహార్' పెద్దలను తన వైపు త్రిప్పుకోవాలని శపథంచేసుకొంటుంది. కాని కథ అడ్డంతిరిగింది. తన ఉద్యోగానికే రాజీనామా ఇవ్వడంవల్ల తన శపథాన్నే మరచిపోయినట్లుంది. కావున రచయిత్రి 'జయంతి'ని చంచల హృదయక్రింద వ్రాశారు. కాని వారికి, ప్రచురించుచున్న మీకు ధన్యవాదాలర్పించకపోలేదు.

పెద్దాడ పార్థసారథి,
సిర్పూర్ — కాగజ్ నగర్.

"సెక్రటరీ" సీరియల్లో 'సోవియట్ బాలే' (Ballet) ని "సోవియట్ బాలెట్" అని వ్రాసినారు. మా స్నేహితుడు ఒకడు, 'బొగ్గుల డిపో'ని (Depot) ని 'బొగ్గుల డిపోట్' అని చదివేవాడు. వాడు గుర్తుకు వచ్చినాడు!

పి. విలోచనరావు, మచిలీపట్టణం.

ముళ్ళపూడివారి "పగటి కలలు" చాలా బాగున్నాయి. ఇది చదివిన తరువాత నేను - "ముళ్ళపూడివారితో ఈ పగటికలల విషయమై చర్చిస్తున్నట్లు" ఒక చిన్న పగటి కల కనేశాను. శ్రీ అదుర్తి వెంకట నరసింహమూర్తిగారు వ్రాసిన "పాల తెలుపు-నీలం కవరు" జ్యోతికి ఒక విధమయిన కాంతిని అందించింది.

పైడిపల్లి సత్యానందం, రాజమండ్రి.

మామూలుగా ముళ్ళపూడిని తలచుకుంటేనే నవ్వు వస్తుంది. "సెప్టెంబరు" సంచికలో ఆయన పగటి కలలు కంటూ తెగ నవ్వి, మిగిలింది మాచేత నవ్వించి, చక్కా ఊరుకున్నారు. కనీసం నెలకొక సారయినా రమణగారు మాకు జ్యోతిలో కనిపించి నవ్విస్తే అరవయి పైసలేకాదు. ఇంకో పదేసి పైసలు యివ్వమన్నా హాయిగా నవ్వేస్తూ యిచ్చేస్తాం (చివరది "కోత" క్రింద సవరించమని ప్రార్థన)

ఎ. డి. నాధ్ బాబు, వాల్తేరు.

"కాముడు" కథే హాస్యంగా ఉంది. చివరలో ఆ కథ చదువుతుంటే నవ్వాగింది కాదు. మిగిలిన కథలలో "జ్యోతి", అనుమానం" బాగుగానున్నవి.

సెక్రటరీ సీరియల్ చాలా సస్పెన్స్‌తో నడుచుచున్నది ఇంత చక్కని నవల వ్రాస్తున్నందుకు రచయిత్రిగారికి ప్రచురిస్తున్న మీకు మా 'హార్టీథ్యాంక్స్''

బి. శ్యామసుందరగౌడ్, అదిలాబాద్.

"కాముడు"అనే కథ వాస్తవానికి అతిదగ్గరగాను, సునిశితహాస్యముతోను వుంది మధ్యతరగతి ప్రజల, ఉద్యోగుల వ్యక్తపరచలేని మూగబాధలను తెలయపర్చి, పఠితలను ఊహాలోకమునుండి వాస్తవిక జగత్తుకు తీసుకొచ్చిన రచయిత, ప్రచురించిన సంపాదకులు మిక్కిలి అభినందనీయులు.

పి. స్వారాజ్యలక్ష్మి, కోటగిరి,

ఒక ముఖ్య ప్రకటన

ప్రారంభించిన కొద్ది కాలానికే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ మాస పత్రికలలో ఒకటిగా, దేశంలో తెలుగువారు నివసించే దాదాపు ప్రతిచోటికి ప్రయాణం చేస్తూ ఆహ్లాద కిరణాలను ప్రసరిస్తోంది "జ్యోతి". పాఠకులు తనపై చూపుతున్న అపారాభిమానానికి కృతజ్ఞత తెలుపుతోంది "జ్యోతి".

ఇబ్బందులు పడడంలేదని కాదు. అయినా, పాఠకుల ఆదరాభిమానాల వల్ల "జ్యోతి" "నెల నెలాభివృద్ధి" పొందుతోంది. ఇదే మాకు ఉత్సాహం కలిగిస్తున్న మొదటి ఇబ్బంది.

భారత ప్రభుత్వపు దిగుమతి విధానం కారణంగా కాగితం కరువేర్పడింది. అందుచేత పత్రిక అమ్మకం పెరిగిన కొద్ది కాగితానికి ఇబ్బందికూడా పెరుగుతున్నది. కనుక పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాన్ని తట్టుకొనడానికి వీలుగా "జ్యోతి" వెలను పెంచక తప్పడంలేదు.

రానున్న జనవరికి "జ్యోతి" ప్రారంభించి రెండేళ్ళవుతుంది. ఆనాటి నుంచి కాపీ వెల 75 పైసలు చేస్తున్నాము. ఏడాది చందా తొమ్మిది రూపాయలు. (ప్రస్తుతపు చందాదారులకు జనవరి '65 నుంచి ఈ రేటు ప్రకారం చందా సవరించ బడుతుంది.)

నెలకు మరొక 15 పైసలు "జ్యోతి" అభిమానులకు భారం కాబోదు గాని, అది "జ్యోతి" మరింత ఉత్సాహంగా పురోగమించడానికి ఎంతైనా తోడ్పడగలదు.

రాజకీయ వాతావరణం

పార్లమెంటులో మొన్న ప్రవేశపెట్టిన విశ్వాసరాహిత్య తీర్మానం సరిగ్గా పన్నెండునెలల పదిహేనురోజుల లోపల ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన రెండవ తీర్మానం. మొదటిదానికి రెండవదానికి ప్రధానమైన వ్యత్యాసం: మొదటి తీర్మానంపై చర్చలో ప్రధాని నెహ్రూ విధానాలను తీవ్రంగా విమర్శిస్తే, రెండవ తీర్మానంపై చర్చలో ఆ విధానాలనే శ్రీ లాల్‌బహదూర్ సరిగ్గా అనుసరించటంలేదని తీవ్రంగా విమర్శించారు.

మిగిలిన విమర్శలన్నీ అప్పటివే.... ఇప్పటివీను. కాశ్మీర్ సమస్య. చైనా దురాక్రమణ. అంతరంగిక పరిస్థితులు.

శ్రీ లాల్‌బహదూర్ ప్రధాని అయిన నాలుగు నెలల లోపలే వచ్చిన విశ్వాసరాహిత్య తీర్మానం ఇది.

ఈ సందర్భంలో మితవాద కమ్యూనిస్టు నాయకుడు శ్రీ హిరేన్ ముఖర్జీ శ్రీ లాల్‌బహదూర్‌ది ద్వంద్వ వ్యక్తిత్వం (స్ప్లిట్ పర్సనాలిటీ) అని అన్నారు. లాల్‌బహదూర్‌లో ఇద్దరు వ్యక్తుల విభిన్న తత్వం ఆయనకు కనిపించిందట....

ఎలాంటి పరిస్థితులలోనైనా నెహ్రూ ప్రతిపాదించిన మౌలికవిధానాలను 'తు.చ' తప్పకుండా ఆచరించాలనే తత్వం ఒకవైపు: కాంగ్రెసులో కొన్ని మితవాద వర్గాల ఒత్తిడులకు తలఒగ్గి నెహ్రూ విధానాలను తదనుగుణంగా మార్చివెయ్యాలనే తత్వం మరోవైపు ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రిలో 'స్ప్లిట్ పర్సనాలిటీ'గా ద్యోతకం అవుతున్నదని శ్రీ ముఖర్జీ విమర్శ.

"ఈలాంటి వ్యక్తిగతమైన విమర్శ చాలా దురదృష్టకరమైన"దని తన సమాధానంలో శ్రీ లాల్‌బహదూర్ అన్నారు. అసలు విషయాన్ని శాంతంగా ఆలోచించటం మానివేసి, ప్రతిదానికి పెడర్థాలు తియ్యటం, యెదుటివారిలో చీలికలు తీసుకురావటానికి ప్రయత్నించటం, కమ్యూనిస్టులకు అలవాటు అయితే కావచ్చు కాని, ఈ లాంటి బాధాకరమైన వ్యక్తిగత విమర్శలు చెయ్యటం మాత్రం చాలా దురదృష్టకరం అన్నారు శ్రీ లాల్‌బహదూర్.

ప్రతిపక్షాలు తెచ్చిన విశ్వాసరాహిత్య తీర్మానం 'ఒక బాంబ్ షెల్' లా ప్రయోగింపబడుతుందనుకున్నవారి అంచనా లన్నీ తలక్రిందు లయినాయి

అంతే ప్రభుత్వ విధానాలన్నీ సవ్యంగా వున్నాయని, వాటిని విమర్శించరాదని, వాటిని పూర్తిగా సమర్థించాలని కాదు....

విమర్శ చేసినా, సూచన చేసినా, ఆందోళన చేసినా, ప్రతిది బాధ్యతాయుతంగా, సహనంతో, సానుభూతితో సృజనాత్మకమైనదిగా వుండటం అవసరం.

అలా కాకుండా, "తండ్రి మధ్వాచారి, తనయు డాచార్యుండు...." ఈ రీతిలో ప్రతిపక్షాలు....

స్వప్రయోజనాలు, కార్పణ్యాలు, ముఠాలు, అంతఃకలహాలు — వీటితో గందరగోళంగా కాంగ్రెసు వర్గాలు....

సూక్ష్మంగా కాకపోయినా, స్థూలంగా ఆలోచిస్తే, మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన వెంటనే జర్మనీ యెదుర్కొన్న పరిస్థితులనే మన దేశంకూడా ఈనాడు యెదుర్కొంటోందా అనిపిస్తోంది.

జాతి జీవనంలో ఒక నిస్పృహ; యెక్కడ చూచినా అవినీతి; రూపాయికి విలువ లేకుండా ధరలు ఆకాశాన్ని అందుకోవటం; మిగిలిన దేశాలమధ్య గట్టిగా రొమ్ము విరుచుకుని ధీమాగా నిలబడగల రక్షణశక్తి లేకపోవటం — అంతా అస్తవ్యస్తంగా, భయభ్రాంతులను కలుగ చేసే పరిస్థితులు.

ఈలాంటి తరుణంలోనే వైమర్ రాజ్యాంగాన్ని ప్రవేశ పెట్టాడు హిట్లర్. అపారమైన దేశభక్తి అనే పేరుతో జాతి ఉన్మాదాన్ని రెచ్చగొట్టి, నియంతృత్వానికి వలలు పన్నుకున్నాడు. అంతవరకు ప్రజాస్వామ్యం చూపించిన "చలనం లేని వాతావరణాన్ని" ప్రజలు యేవగించుకున్నారు. ప్రజా స్వామ్య వచనాలు శుష్కప్రియాలు అనుకున్నారు. ప్రజా స్వామ్యంలో చెలరేగిన అవినీతిని అణచాలనే ఆకాంక్షతో బుద్ధి పూర్వకంగా హిట్లర్ నియంతృత్వాన్ని జర్మనీ ప్రజలు వరించారు.

అతను కల్పించిన ఆశలు ప్రణాళికలు, రేకెత్తించిన జాత్యున్మాదం జర్మనీని మూకుమ్మడిగా నాజీయిజం పాలుచేశాయి.

భయంకరమైన "నాజీ నియంతృత్వం" కోట్ల ప్రజల మారణహోమం — తరువాత జరిగిన కాండ అందరికీ తెలిసినదే.

జాతి ఆలోచనలను బలహీనపరచి నిస్పృహపాలుచేసే పరిణామాలను సరిఅయిన తరుణంలో నిగ్రహించకపోతే దేశం భయంకర దశలపాలవుతుంది.

మొన్నీ మధ్య బొంబాయిలో జరిగిన కాంగ్రెసు సమావేశాలలో చర్చల ధోరణి వింటుంటే చాలామందిలో నిస్పృహ జనిస్తుంది.

ఆలాంటి సమావేశాలలో నెహ్రూ రోజులనాటి కాంగ్రెసు వాదుల ధోరణికి, మొన్నటి ధోరణికి యెంతో మార్పు కనిపిస్తుంది.

దేశ సమస్యల బాధ్యత యావత్తు పదవులలోని కాంగ్రెసువారిదేనని, తక్కినవారి పని కేవలం వారిని విమర్శించటమేనని- పదవులలోలేని కాంగ్రెసు కార్యకర్తలకు నిర్దుష్టమైన నిర్మాణ కార్యక్రమం లేనట్లనిపిస్తుంది-అన్నీ శుష్కవచనాలు, ముఠా రాజకీయాలు, పర్మిట్లకోసం ప్రాకులాట....

దీనికి తగ్గట్టుగా కమ్యూనిస్టులలో మరింత తీవ్రంగా వర్గ వైషమ్యాలూ - 'కప్పల తక్కెడ'గా సంయుక్త సోషలిస్టులు- స్వతంత్రపార్టీ సరేసరి.

గందరగోళమైన రాజకీయ వాతావరణం-



సెప్టెంబరు 6 వ తేదీన రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను
76 వ జన్మ దినోత్సవ సందర్భంగా అభినందిస్తున్న ప్రధాని శాస్త్రి

మరొకవైపు జననంఘ్ శక్తులు మరీ వెర్రిగా కనిపిస్తున్నాయి. దాటుదాటున ఒకవిధమైన 'జాతి తత్వాన్ని' రెచ్చగొడుతున్నాయి.

ఇదంతా చూస్తుంటే, ఇందిరా చెప్పినట్లు మొదటి ప్రపంచ యుద్ధానంతరం హిట్లరిజానికి దారి తీసిన జర్మనీ పరిస్థితి గుర్తుకొస్తోంది....

బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ... వీరు ప్రతిపాదించిన మహత్తర "మానవత్వం", జాతి మత వర్గాల నధిగమించిన ప్రేమ తత్వం ఈనా డెక్కడ ?

ఈనాడు, ముఖ్యంగా కాంగ్రెసు వాదులు బాధ్యతా రహితంగా ప్రవర్తించి మతాలతో, పదవుల అపేక్షతో వైషమ్యాలకు దారులు తీస్తే - యేబు దశాబ్దాల కాంగ్రెసు చరిత్ర అంతా ఒక్కమాటుగా బూడిద పాలవుతుంది. నెహ్రూ, గాంధీ "శుష్కవేదాంతాన్ని బోధించినవాళ్ళవుతారు."

అభ్యుదయం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, ప్రేమపూరితమైన విశాల విశ్వమానవ సౌభ్రాత్రం అన్నీ మంట కలిసిపోతాయి. వెర్రితలలేసే "వీరజాతి తత్వం" మహాద్భూతంలా దేశాన్ని చుట్టుకుంటుంది.... తరువాత జరిగే కాండ....అందరూ ఊహించుకోగలిగినదే

కాంగ్రెసు సంస్థపైన, కాంగ్రెసు నాయకులపైన, కాంగ్రెసు కార్యకర్తలపైన, ఈనాడు ప్రధానమైన ఒక బాధ్యత వుంది. కనీసం మరొకసారి సాధారణ యెన్నికలలో కూడా ఆ పార్టీవారే దేశ పరిపాలనను చేపట్టడం తథ్యం. (ఒకటి రెండు రాష్ట్రాలలో ఏమవుతుందో చెప్పలేమనుకోండి) ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత వారిదే. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవటం వారి ధర్మం.

గాంధీ, నెహ్రూ, లాల్ బహదూర్

రాజకీయంగా దేశం ఈనాడు మూడవ తరం పాలనలోకి అడుగు పెట్టింది. లాంఛనప్రాయంగా దేశాన్ని గాంధి పాలించకపోయినా, అనేక విధాల అక్షరాలా భారత జాతి ఆలోచనలను శాసించి, రూపం దిద్ది, భవితవ్యానికి బాటలు వేసిన మహానాయకుడు ఆయన. కోటాను కోట్ల ప్రజలను చరిత్రలో మొదటిసారిగా ఏక ఛత్రంక్రింద నడిపించిన మహోదక్షుడు మహాత్మాగాంధీ.

గాంధి మార్గానికి, నెహ్రూ మార్గానికి వ్యత్యాసం సూక్ష్మంగా పరిశీలిస్తే యెంతో కనిపిస్తుంది.

తనను తాను మరచి, నిద్రాణమైన భారత జాతిని జాగృతంచేసి స్వస్వరూపాన్ని అంతర్ముఖంగా చూసుకోగల శక్తిని గాంధి ప్రసాదించారు.

అదే జాతికి ఇతరులు తనను యేవిధంగా చూస్తున్నదీ నేర్పి, ఇతరుల దృక్పథంలో తన స్వరూపాన్ని ప్రతిబింబించుకుని చూడగలిగిన సమతా దృష్టిని జవహర్‌లాల్ నెహ్రూ ప్రసాదించారు.

యుగయుగాల భారత ధర్మాన్ని గీతా వాక్యాలతో చెప్పినట్లు ధర్మప్రవర్తితం చేసిన మహాత్ములు గాంధి, నెహ్రూలు.

మట్టిలోనుంచి మనిషిని మనిషిగా నిలబెట్టి నడిపి, వ్యక్తిత్వానికి ప్రాధాన్యం ఇచ్చారు గాంధి.

వ్యష్టికి సమష్టికి మధ్య అంతరాన్ని అపూర్వంగా వ్యాఖ్యానించి, రెండు వ్యవస్థలకు సమాన ప్రతిపత్తిని కల్పించి ప్రజాస్వామ్య గమ్యానికి బాటలువేసిన మహాత్ముడు జవహర్‌లాల్.

ఇది మూడవ తరం - లాల్ బహదూర్ - గాంధి, నెహ్రూలు ప్రవచించిన మహా చైతన్యానికి మరో వ్యాఖ్య ...

గాంధిని 'అనార్కిస్టు' అనే వారికి, జవహర్‌లాల్ లాల్‌గులాబీని చూచి, అది ఆయనలో గూడుకట్టిన అతివాద తత్వానికి చిహ్నం అనుకునేవారికి, లాల్ బహదూర్‌లోకూడా తప్పకుండా "స్ప్లిట్ పర్సనాలిటీ" కనిపించటంలో సందేహం లేదు. పై రెండూ యెంత సత్యమో, తరువాత "స్ప్లిట్ పర్సనాలిటీ" కూడా అంతే అనేది చరిత్రే నిరూపిస్తుంది.

గాంధీ మతంలో, నెహ్రూ యుగం చివరి దశలో ప్రజాస్వామ్యవాదానికి వేసిన పథకాలను శాస్త్ర ముందు వెనుకలుగా సరిదిద్ది ఆచరణ యోగ్యంగా సాధనచేసే బాధ్యత ప్రధాని లాల్‌బహదూర్‌ది.

• • •

కేరళీయం

దాదాపు అయిదు సంవత్సరాలనాటి కేరళీయానికి, ఈ నాటి కేరళీయానికి ఏమాత్రం వ్యత్యాసం లేదేమో.

భారతదేశంలో ఎక్కువమంది చదువుకున్నవాళ్ళున్నది అక్కడే. భారతదేశంలో మరి యెక్కడా లేనన్ని ముఠా రాజకీయాలు అక్కడే వున్నాయి. (రెండింటికీ సంబంధం వుందనటం నా వుద్దేశ్యంకాదు.)

కేరళరాష్ట్రంలో కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీలోని పదిహేనుమంది ప్రతిపక్షాలు తెచ్చిన విశ్వాసరాహిత్య తీర్మానాన్ని బలపరచటంతో ఆ రాష్ట్రమంత్రివర్గం పతనమైంది. మధ్యవర్తిత్వానికి వెళ్ళిన శ్రీ పాటిల్, తనమాటను అసంతృప్తవర్గీయులు (పదిహేనుగురు కాంగ్రెసు శాసనసభ్యులు ముఖ్యం) ఎంతకూ ఖాతర్ చెయ్యకపోతే వారినందరినీ "మర్డరర్స్" (ఖూనీకోరులు) అన్నారు కోపంగా.

దానా దీనా అసలు విషయానికి వస్తే 'కేరళీయం' మళ్ళీ కేరళీయం అయింది. అయోమయమైన అనిశ్చితమైన వాతావరణానికి మారుమాట అది.

ఐదు సంవత్సరాల క్రితం రాజకీయ పరిస్థితి ఇప్పుడూ కొనసాగుతోంది. కమ్యూనిస్టు ప్రభుత్వ పతనం. ప్రెసిడెంట్ పాలన. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పతనం. ప్రెసిడెంట్ పాలన - ఇదే అప్పటికీ ఇప్పటికీ తేడా.

అంతేకాదు. పరిస్థితిలో మరోవ్యత్యాసం కూడా వుంది. అప్పట్లో కమ్యూనిస్టులలోనూ కాంగ్రెసులోను అంతగా లేని వర్గవైషమ్యాలు మరీ ప్రస్ఫుటంగా ఇప్పుడు బయటపడ్డాయి.

కేరళలో రాజకీయ పక్షాలకంటె కూడా అతి ప్రధానమైనవి కుల వర్గాలు, మత వర్గాలు. ఎజావలు, నాయర్లు, క్రైస్తవులు, ముస్లింలు - ఈ విధంగా అక్కడి రాజకీయాలు చీలిపోయి వుంటాయి.

ఈ వర్గ వైషమ్యాలు అదుపులోనికి రానంతవరకు కేరళం కేరళీయంగానే వుంటుందని రాజకీయ పరిశీలకుల మీమాంస.

ఏది ఏమైన రాబోయే ఫిబ్రవరిలో ఆ రాష్ట్రంలో ఎన్నికలు కోలాహలంగానే జరుగుతాయి.

ప్రతిపక్షాలన్నీ ఏకమై సంఘటితపడి కాంగ్రెసును చిత్తు చెయ్యాలని పథకాలు వేస్తున్నాయి.

రాబోయే మాసాలలో ఆ రాష్ట్రంపట్ల, రాష్ట్ర కాంగ్రెసు శ్రేయస్సుపట్ల కేంద్రం వారు వ్యవహరించే విధానం యెంతో జాగ్రత్తగా పరిశీలించవలసివుంటుంది.

లాల్‌బహదూర్ నాయకత్వానికి మరో గడ్డు పరీక్ష ఇది.

• • •

రాష్ట్ర రాజకీయం

ఇది రాస్తున్న రోజుకి రాష్ట్రంలో ఒక సమ్మె జరుగుతోంది. పి. డబ్ల్యు. యు. డి. వర్క్‌షాప్ జల విద్యుచ్ఛక్తి శాఖలవనివారు సమ్మెచేస్తున్నారు. సమ్మెకు, ఇతర కారణాలటుంచి, ప్రధానమైన కారణం చాలా స్వల్పమైంది. గోరుతో తీసివెయ్యగలిగినదే. అయినా అది కొండంతైంది. పట్టుదలకు దారితీసింది. రక్షణ నిబంధనలు, సమ్మెనాయకుల అరెస్టు.

ఇంతకీ కారణం - ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి, ముందుగాచెప్పకుండా విద్యుచ్ఛక్తి శాఖామాత్యులు ఇతర ప్రభుత్వోద్యోగులకిచ్చినట్లుగానే 'భత్యంలో' ఐదు రూపాయలు సమ్మె చేస్తున్నవారికి కూడా



భారత విదేశాంగమంత్రి శ్రీ స్వర్ణసింగ్ సింహళ పర్యటన సందర్భంలో ప్రధాని శ్రీమతి సిరిమావోతో సంభాషణలు జరుపుతున్న దృశ్యం

పెంచారు. అందరికీ యిచ్చినట్లు ఏప్రిల్ నెల నుంచి 'అ ఇవ్వటం' అమలుకి జరపమని కార్మికుల కోరిక. 'కాదు. ప్రకటించినట్లు గానే సెప్టెంబరునుంచీ మాత్రమే ఇస్తా'మని ప్రభుత్వం వాదన సమ్మెకు ప్రధానకారణం ఇది.


సమ్మె సందడిలో మంత్రివర్గానికి ముందుగా తెలియకుండా విద్యుచ్ఛక్తిమంత్రి గారు ప్రకటించిన అయిదురూపాయల 'ఇంక్రిమెంటు' విషయం బయటపడింది. ఏమిటండీ చెప్పకుండా యెందుకీవని చేశారని ముఖ్యమంత్రి అడిగితే "చెబితే మీరు వద్దంటారేమోనని" సమాధానం —

ఇదీ రాజకీయం - రాజకీయంలో సమ్మె నలిగిపోతోంది. ముఖ్యమంత్రికి మరొక మంత్రికి; మధ్యనున్న ఈ "కమామీషు" ఇంతటి రాద్ధాంతానికి;దారితీసిందిట....

దీనికి ముందు రాష్ట్రంలో మరొకచోట మరోకథ జరిగింది - పశ్చిమ గోదావరి జిల్లాలో జిల్లాపరిషత్తు యెన్నికలలో ముఖ్యమంత్రిగా రనుకున్న వ్యక్తికి పోటీగా విద్యుచ్ఛక్తి శాఖామాత్యులు అభీష్టించిన వ్యక్తి నిలబడి గెలవటం—

ఏమైనప్పటికీ రాష్ట్ర రాజకీయంమాత్రం చాలా చెప్పుచేతుల్లోనే వుంది.

ఉభయులకు ఇష్టులైన శ్రీ సంజీవరెడ్డి గారు కేంద్రంలో మకుటాయమానులై వుండటం ఆంధ్రరాజకీయానికి క్షేమకరమే.



సెప్టెంబరు 6 వ తేదీనుంచి నాగభూమిలో ప్రశాంతి ఏర్పడింది. ఈసందర్భంలో కృతజ్ఞతా ప్రకటనగా బహిరంగసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ షిలూ ఆవో.

"అంధులు"....

ఉత్తరప్రదేశ్ గోండా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ రాం రతన్‌గుప్త ఎన్నిక రద్దై ప్రత్యర్థి శ్రీ దండేకర్ గెల్చినట్లు ప్రకటింపబడటానికి కారణం ఏడుగురు అంధులు....

గుడ్డివారు, వికలాంగులు ఓటు వెయ్యాలంటే, వారి ఓట్ల సీరియల్ నెంబర్లుగుర్తుంచుకుని, వారి అభీష్టానుసారం ఎన్నికల అధికార్లే ఓట్ల చీటీలమీద 'గుర్తు' పెట్టి ఓట్లు వేస్తారు.

గోండా నియోజకవర్గంలో ఏడుగురు గుడ్డివారు పెట్టెలో వేసిన ఓటు చీట్లమీద ఒక గుర్తుకు బదులు రెండుగుర్తులున్నాయి.

ఈ రెండవగుర్తు యెవరు పెట్టినట్లు - అంధులు పెట్టారా ?
కళ్లులేనివారే సత్యాన్వేషణకు అద్భుతంగా సాక్షిభూతులైనారు.

— అనంతం:

వచ్చే సంచికలో

కొత్త సీరియల్ ప్రారంభం

'శిఖరాలు-సరిహద్దులు'

రచన:
నండూరి పార్థసారథి

అక్టోబరు

1. బ్యాంకు చెక్కుల కన్ననూ నాకు
భామ చెక్కులు ఇష్టము

2. మహాత్మునికి
పాకివాండ్రన్న పరమగౌరవము;
తుపాకివాండ్రన్న అసహ్యమున్ను.

3. రాటంకన్నా రంకుట్రాటం
ఇష్టం నాకు.

4. ట్రేజియర్ను ట్రా అంటారు;
ట్రా నిజంగా అట్రకాడట్రా;
చనుకట్టుమీద కనుకటు

5. మనుష్యుని పతనానికి కారణం
పాపకార్యం అంటుంది
క్రైస్తవ పురాణం

6. మలబారు నిజంగా
భామలబారు

7. క్షయవ్యాధికి
అపత్యం కూడదు.

8. అండర్‌గ్రౌండు ఆక్టివిటీ
అన్నివేళల, ఎర్రలముఠాకు.

9, దక్షిణిండియాలోన ఇంతమంది
బిచ్చగాండ్రు ఉండుటకుకారణం
దాక్షిణాత్యుల స్వభావమే

10. భార్యలందరికీ భర్త నాట్యం
ప్రస్తుతం.

11. చిఫాన్ చీరలు ప్రసన్నంగా
వుంటాయి.

12, సుబాసుబోసు
బాబో: ముమ్మంచివాడు.

18, సంపత్తికి కారణం నల్లరేగడ.

14. వసతికి సతి కావాలి

15. అవిద్య నశించుటకు, విరివిగా
ప్రభుత్వం పెట్టు బడులు
కావాలి.

16. దక్షతలో చీమ
డంబాలలో "ఏనుగ"

17. వ్యాపారస్తునికి
శ్రీదేవి అనుగ్రహంతో సమానం
లావాదేవి అనుగ్రహంకూడాను,

18. బర్త్ కంట్రోలుకు ముఖ్యం
భర్త కంట్రోలు

19. కారుకన్నా స్పీడు పుకారు.

20. ఉత్తరం ఉత్తరం
దక్షిణం ఉత్తమం

21. తాళజ్ఞానముండేది నాటారులకు
నాటకులకు.

22. దంపతులకు ప్రేమ్మంచం

23. వానికి పత్రికలో పడాలని ఇష్టం
మరిన్ని వివాహ పత్రికలోన.

24. పద్యములనూ మద్యములనూ
సీసాలలో సేవింతురు
రసజ్ఞులు.

25. ఆర్య సమాజీకులు, తాళికి
ఎగవేసినారు.

26. ఆస్తిపాస్తులు భాగ్యవంతులకు;
బీదవాళ్ళకు అవి
హ్రాస్వము.

27. అమరుకావ్యములోన
శయ్యాలాలిత్యము
గమనార్హము.

28. లంగోటు = కనిష్ఠము
లాంగోటు = గరిష్ఠము

29. చేకొవిలికి దుడ్డు కావాలి,

30. ప్రపంచ భాషలన్నిటికి
అచ్చు ఆయువుపట్టు

31. చా అంటే తూ అంటుంది
ద్రావిడాంగన
చా అంటే తే అంటుంది
ఉత్తరదేశ వాసిని.



మనస్సు తమస్సు

పట్టని నిద్రని పట్టించుకోడం అనేది-అసంభవమని - నాకు తెలుసు. కాని నిద్రపోయే కాలంలో మేలుకొని చెయ్యాదగినది ఏముందిగనుక ?

పక్కమీంచి లేచాను.

చంద్రుడు - పున్నమి చంద్రుడై వుంటాడు - తన వెన్నెలనంతా వెదజల్లుతున్నాడు. పక్కన మంచంమీద పడుకున్న రాధకేసి చూశాను ఆమె ముఖంమీద కిటికీలోంచి వచ్చిన చంద్రకాంతి పడి. వింత అందాన్ని తెచ్చి పెడుతోంది. ఫ్యానుగాలికి ఆమె ముంగురులు నుదుటిని ముద్దుపెట్టుకుంటున్నాయి. ఆ వాతావరణం చూసేసరికి రాధని వెంటనే నిద్రలేపి "రాధా - నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పా లనిపించింది.

కాని అందులో ఒక చిక్కుంది.

రాధతో అలా అంటే. "ఏవిటా వేళాకోళం.-నిద్ర లేపగొట్టి ఏవిటా ప్రకటన ? మీరు నన్ను ప్రేమించడం లేదని నే నన్నానా ? నన్ను గాకుండా యింకెవర్నయినా ప్రేమిస్తే నే నూరుకుంటానా ? మీకేమైనా వెర్రా" అని ఆలసగా చీవాట్లు పెడుతుంది.

ఆమె తిట్లు నాకు హాయిగా వుంటాయి. ఆఫీసులో చచ్చీచెడి పనిచేసి ఇంటికి వచ్చి రాధచేత మెత్తని రెండు చివాట్లు తింటే ఆ అలసటపోయి కొత్త హుషారు వస్తుంది.

అయినా తిట్లు తినడానికి ఆమెను లేప బుద్ధికాలేదు. నాకు నిద్రపట్టని కారణం వేరేవుంది. తలుపు తెరుచుకుని డాబామీదకు వచ్చి పిట్టగోడ మీద కూర్చున్నాను. పున్నమిచంద్రుణ్ణి చూస్తుంటే పూర్వపు సంఘటనలు మనస్సులో తిరుగుతున్నాయి.

సాయంత్రం సినిమాకు వెళ్ళకపోయినా బాగుండేదనుకున్నాను. సినిమాకి వెళ్ళినా, ఆ సినిమాకే వెళ్ళకపోయినా బాగుండును. అని సరిదిద్దుకున్నాను, అదే సినిమాకు వెళ్లాలని పట్టుబట్టిన రాధమీద కోపం వచ్చింది, రాధనులేపి, ఇంకెప్పుడూ అలా మంకుపట్టు పట్టకు, భర్తకు ఎదురుచెప్పకు అని హెచ్చరించా లనిపించింది. కాని అది అయ్యే పని కాదు. రాధతో గొంతు చించుకుని చెప్పక్కరలేదు. ఎంత సున్నితంగా చెబితే అంత త్వరగా అర్థం చేసుకుని పశ్చాత్తాపపడే సంఘటనయితే, పశ్చాత్తాపపడుతుందికూడా.

ఇంతకూ ఆ సినిమాకి వెళ్ళి సుశీలని చూడకపోతే యీ రాత్రి ఆలోచించవలసిన పనిలేదు. చక్కగా నిద్రపోయేవాణ్ణి ! కాని దైవం ప్రతి చిన్న పనిలోకూడా అడ్డువస్తాడని వేదాంతులు తీరి కూర్చుని అనరుకదా !

సుశీల !

అవును, సుశీల !

నా మనస్సు ఐదు సంవత్సరాలు వెనక్కి పరుగెట్టింది,

ఐదే ళ్ళయివుంటుంది.

అవి నేను యం కామ్. ఆఖరి సంవత్సరం చదివేరోజులు. చదువులో నేగాకుండా, నాటకాల్లో వేషాలెయ్యడమన్నా. పాటలు పాడడమన్నా విపరీతమైన ఆసక్తి వుండేది. ఆమాటకొస్తే యిప్పటికే ఆసక్తి వుంది. ఆ 'శక్తి' వుందో లేదో తెలుసుకునే అవకాశంమాత్రం లేదు.

జె. వి. భూపతిరాజు

ఆనాడు ఒక బ్రహ్మాండమైన నాటకం వేశాము. నాటకంలో నేను బాగా నటించా నని నా శ్రేయోభిలాషులే గాక, ముక్కూ ముఖం తెలియనివారు కూడా అన్నారు. ప్రఖ్యాత సినిమా నటుడిని పిలిచా రానాడు. ఆయనే నాకు వెండిపతకాన్ని బహూకరిం చారు. నాటకం అయిపోగానే అంతా వచ్చి నన్ను తెగపొగిడారు. గర్వంతో నాశరీరం పుబ్బింది. అంతా వెళ్ళిపోతుంటే నేను చేతులు జోడించి దేశనాయకుల పక్కలో నమస్కరించాను. వాళ్ళు వెళ్ళిపోయాక, హూందాగా గ్రీన్ రూములోకి నడిచి, నాట కంలో నాపాత్ర పాడిన పాట పాడుకుంటూ మేకప్ చెరుపుకోడం ఆరంభించాను. ఇంతలో తలుపు శబ్దం అయ్యింది. ఎవరో మా పటాలంలో వాళ్ళు అయివుంటారని "రావచ్చు" అన్నా నా ముఖానికి నూనె రాసుకుంటూ, తలుపు తోసుకుని వచ్చిన శబ్దానికి, నూనె తుడుచుకుని చూశాను.

కళ్ళు జిగేల్ మన్నాయి.

ఎవరో ఓ అమ్మాయి-కాదు మెరుపుతీగ కిలకిల నవ్వుకుంటూ లోపలకు వచ్చి "నమస్కారమండీ" అంది. నేను లేచి, "నమస్కారమండీ" అన్నాను నూనె చేతులు కలుపుతూ. అంత అందమైన అమ్మాయి వచ్చిన సమయంలో ముఖానికి నూనె పట్టించుకుని, చెరిగిన రంగుతో రాక్షసుడిలా వున్న నా అవతారం తలుచుకుని, నన్ను నేనే వందతిట్లు తిట్టుకున్నాను.

"కూర్చోండి" అన్నాను తేరుకుని.

ఆమె కూర్చుంది.

"ఎవరు కావాలండీ" అన్నాను అంతకన్నా మరోవిధంగా పలకరించడం తెలియక.

"ఎవరో కావలసివస్తే మిమ్మల్ని వెతు క్కుని రావడం ఎందుకు ?" అందామె నవ్వుతూ.

ఆమాట వినేసరికి నా శరీరం గగుర్పొడి చింది. మళ్ళీ అవే మాటలు యింకోసారి అంటే బావుండు ననిపించింది. ఇంతలో ఆమె మాట్లాడడం ప్రారంభించింది.

"మీరు వేసిన నాటకం యిదివరకోసారి చూద్దామని ప్రయత్నించాను. కాని, కుదర లేదు. ఆ భాగ్యం యివాళ కలిగింది. మీ నటన నన్ను ఎంత ఆనంద పెట్టిందో చెప్ప లేను. నిజంగా మీకు పూర్వజన్మ అదృష్టం వుంది. లేకపోతే అంత చక్కని నటన రాదు." అంది చక్కని గొంతుతో.

నా కేమనాలో తెలియలేదు. చచ్చి చెడి, ముఖానికి పట్టించుకున్న నూనె తుడుచు కున్నాను ఆవిడమాటలు వింటూనే.

"నేను కూర్చుంటాను. మీరు మీ పని కానివ్వచ్చు" అందామె తన గోళ్ళు చూసు కుంటూ.

నేను ముఖం కడిగేసుకుని, క్రాపు ఎగరేసి దువ్వుకుని, డబ్బాలో చాలాభాగం పౌడరు ముఖానికి రాసేసుకుని, బట్టలు మార్చుకుని వచ్చేవరకు ఆమె అలా కూర్చునేవుంది.

"మన్నించండి. చాలా ఆలస్యం చేశాను" అన్నాను; అలా అనాలని ఒక ఆనవాయితీ వుండడంవల్ల.

"ఆలస్యం చేసినట్టు నా కనిపించలేదు" అందామె గాజులు సవరించుకుంటూ.

"చాలా థాంక్స్. నాటకం చూడడమే గాకుండా స్వయంగా వచ్చారు శ్రమతీసుకుని. నా నటనలో ఏవైనా లోపాలుంటే విమర్శించి చెప్పండి" అన్నాను.



ఆమె ఏం చెబితే అది చెయ్యా లనిపిం చింది. గంగలో దూకమన్నా దూకేద్దా మన్నంత వుత్సాహం కలిగింది.

ఆమె నామాటలకు చిన్నగా నవ్వుతూ, "చొరవ తీసుకుని చెబుతున్నందుకు ఏమీ అనుకోరుకదా !" అంటూ ప్రారంభించింది.

"ఏమీ అనుకోను. పైగా మీ సలహాలు శిరోధార్యాలు" అన్నాను కుడిచెయ్యి నెత్తి మీద పెట్టుకుంటూ.

ఆమె నా చొరవకి కొంచెం సిగ్గుపడి, ఆ జాతికే చెందిన నవ్వు నవ్వుతూ, "మీరు నటించేటప్పుడు ముక్కు పుటాలు ఎగరే స్తారు. కోపం నటించాల్సిన సీనుల్లో బాగున్నా మిగతావాటిలో బాగుండదని నావుద్దేశ్యం. తప్పు అయితే కావచ్చు" అంది.

"రేపటి నుంచి ... మీ సూచన" —

"ఇకలేవారు ఇవాళనుంచి మీ సూచన నూరుపాళ్ళ పాటిస్తాను" అన్నాను నేను ముక్కు పుటాలు ఎగరవేయబోయి, నిభాయించుకుంటూ.

ఆమె లేచి నిలబడి "వస్తాను. నమస్తే" అంది.

నేనూ లేచి నించుని "మీ కభ్యంతరం లేకపోతే నా కారులో దింపుతాను" అన్నాను ఆమె అడ్రసు తెలుస్తుందనే ఆశతో. ఆమె అంగీకార సూచకంగా తల వూపింది. నేను ఛెంగున గంతేసి, మిగతా వారితో "వెళ్ళొస్తా"నని చెప్పి, బయల్దేరాను. ఆమె నన్ను అనుసరించింది. నేను స్టీరింగు ముందు కూర్చున్నాను. ఆమెకూడా డోర్ తెరచి ముందుసీటులోనే కూర్చుంది. కారు స్టార్ట్ చేశాను.

ఆమె ఎటుపోవాలో చెప్పసాగింది. నేను మధ్యమధ్యలో ఆమెకేసి చూస్తూ, ఆమె చెప్పే మాటలు వింటున్నాను. ఆమె తను యం. బి. బి. యస్. ఆఖరి సంవత్సరం చదువుతున్నానని చెప్పింది.

నా గుండె గుభేలుమంది. నా యమ్‌కామ్. ని గుప్‌చిప్‌గా దాచేస్తే మంచిదను కున్నాను. కాని, ఆమె అడగడంవల్ల చెప్పక తప్పలేదు.

"అంత చదువుకునికూడా మీరు చక్కని సంగీతం, చక్కని నటన ఎలా అభ్యసించారో! చాలా మెచ్చుకోతగ్గ విషయం" అందామె.

"ఆ! ఏవుందిలెండి పెద్ద" అన్నాను.

"భలేవారు. మిమ్మల్ని చూస్తుంటే నాకెంత గర్వంగా వుందో" అందామె

నే నామెకేసి చూశాను. ఆమె కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. చటుక్కున ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుని, "నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అందా మనిపించింది. కాని అలా అన్నందువల్ల యీ పరిచయం ఫెళ్ళున విరగచ్చు. దవడ పెళ్ళుమన్నా అస్టే ఆశ్చర్యంవుండదు. అనిపించి నిభాయించుకున్నాను.

కారు మరో మలుపుతిరిగి, ఆమె ఆజ్ఞను పాటించి, ఒక యింటిముందు ఆగింది. నే నా యింటిని, నంబరును మనస్సులో మననం చేసుకున్నాను.

"నమస్తే వుంటాను" అందామె రెండు చేతులూ కలిపి నాకు నమస్కరిస్తూ.

నేను రెండుచేతులూ జోడించాను.

ఆమె మెరుపులా వెళ్ళిపోయింది.

కారు నీరసంగా కదిలింది.

ఆమె పేరు అడగడం మర్చిపోయినందుకు నన్ను నేనే అష్టోత్తర శత తిట్లు తిట్టుకున్నాను. ఇంటికి వచ్చి పడుకున్నాను గాని, నిద్ర పట్టలేదు. ఆమె ముక్కు పుటాలు ఎగరవెయ్యొ వద్దంది. అవును వచ్చినా ముక్కు పుటాలు ఎగురవెయ్య కూడదనుకున్నాను. అద్దంలో నా విగ్రహం చూసుకున్నాను. నానిన శనగలా వుబ్బింది నా శరీరం. నాలుగైదు కోణాల్లో చూసుకుని, "భేష్" అనుకున్నాను.

ఆ మర్నాడు నేను కారు వాళ్ళింటి ముందు ఆపేసరికి ఆమె బయటకు వచ్చింది. నే నాశ్చర్యపోయి, "నేనిక్కడ వస్తానని మీ కెలా తెలుసు?" అనడిగాను

"అలాటి ప్రశ్నలకు సమాధానం చెప్పడం కష్టం" అందామె జడకుచ్చులు గిర్రున తిప్పుతూ. నేను నవ్వేశాను. ఆమె కూడా నవ్వి, కారులోఎక్కి "మీ యిష్టం వచ్చినచోటుకు పోనివ్వండి" అంది.

"బీచ్‌కి వెళ్దామా?"

"మీ యిష్టం."

"నా యిష్టప్రకారం కారుని అడయార్ బీచికి పట్టించాను. మధ్యమధ్య ఆమె ఏవేవో మాట్లాడుతోంది. ఆమె మాట్లాడుతున్నపుడు ఆమెవంక చూడడంవల్ల కారు గతితప్పి అధోగతిపాలయి, మమ్మల్నికూడా చేస్తుందేమోనని ఆట్టే చూడడం మానేశాను.

బీచ్‌కి చేరగానే ఆమె ఆనందంతో కారు లోంచి ఒక్క గంతువేసింది. నేను అద్దాలు పైకెత్తి, కారుతాళం వేసేసరికల్లా ఆమె సముద్రందగ్గరకు వెళ్ళి నిలబడింది. లాంగ్ షాట్‌లో ఆమెను చూసేసరికి నా వొళ్ళు పులకరించింది.

నల్లని పట్టుచీర, నల్లరవిక, నల్లగాజులు, నల్లటి చెప్పులు వేసుకుంది. ఆ నలుపువల్ల ఆమె శరీరంరంగు మరింత మెరుస్తోంది. నే నామెను చేరేసరికి "మీరు చాలా నెమ్మదిగా నడుస్తా రనుకుంటాను. కారున్నవాళ్ళకి నడక చేతగాదు" అంది నవ్వుతూ.

ఆమె మాటకు ఎదురుచెప్పబుద్ధి కాలేదు. నవ్వేసి వూరుకున్నాను. ఆమె నీటిలో గంతులువేసింది. పీతల్ని చూసి అరిచింది. పీత శరీరభాగాలు వర్ణించి చెప్పింది. చివరికి నేను నిన్నరాత్రి అనుకున్నది గుర్తుకువచ్చి, "అన్నట్టు మీ పేరు చెప్పనేలేదు" అన్నాను నేను. ఆమె అసలే పెద్దవైన తన కళ్ళను మరింత పెద్దవిగా చేసి చూస్తూ, "మీరడగందే? పైగా అబ్రహాం లింకన్ ఏమన్నాడో తెలుసా?" అంది.

"ఏమన్నా ఫరవాలేదు. మీపేరు చెప్పద్దని అతను అనుంటాడనుకోను. ఒకవేళవద్దన్నా మీరు చెప్పరని అనుకోను" అన్నాను నేను.

"నాపేరు సుశీల" అందామె కళ్ళు క్రిందికి దించుకుని.

"సుశీల!!" అన్నాను నేను.

"ఏం? పేరుచప్పగా వుందా?"

ఆమెకేసి చూశాను. నాకేసి వింతగా చూస్తోంది ఆమె.

"పేరా! నేను మీకు ఏపేరు వుండాలని వూహించుకున్నానో అదేపేరు చెప్పారు." అన్నాను ఆమె కళ్ళల్లోకి చూస్తూ. ఆమె కళ్ళు దించుకుంది.

రాసురాను వాళ్ళింటికికూడా వెళ్ళడం ప్రారంభించాను. వాళ్ళమ్మమ్మగారిని పరిచయంచేసింది. ఆవిడకూడా అనుమానాలున్న పురాణకాలపు మనిషిలా కనిపించలేదు. చాలా చనువుగా మాట్లాడేది. ఇలా నెలలు గడిచిపోయాయి. సుశీల పరీక్ష లయిపోయాయి. ఒక్కొక్కసారి ఆమెయింటికి వెళ్ళినపుడు ఆమె వుండేదికాదు. వాళ్ళమ్మమ్మగారితో మాట్లాడి వచ్చేసేవాడిని.

• • •

ఆలోచనలు నిలిపి, పిట్టగోడ దిగాను. ఆపైన గతం గుర్తు తెచ్చుకోడం నాకు యిష్టం లేకపోయింది. లోపలకు వచ్చి పక్కమీద వాలాను. రాధకేసి చూశాను. రాధ నిద్రలో నవ్వుకుంటోంది కాబోలు పెదిమలు కదిలాయి. రాధను గమ్మునలేపి నిద్రలో నవ్వురావడానికి కారణం ఏమిటో చెప్పమని అడగాలనిపించింది. కాసేపు నిద్రపోతున్న ఆమెకేసి అలాగే చూశాను అనక, నా పక్కమీంచి వంగి రాధ భుజం తడుతూ, "రాధా, రాధా" అన్నాను. "ఆ ...ఆ" అంది వెంటనే లేస్తూ. రాధది కోడి కునుకు. చీమ చిటుక్కుమన్నాసరే లేచి కూర్చుంటుంది.

● ఒకడు అర్ధరాత్రివేళ అర్జంటుగా డాక్టరుకి ఫోనుచేసి: "అయ్యా! బొత్తిగా నిద్రపట్టడం లేదు. మీరేదన్నా చెయ్యాల్సిందే" అన్నాడు.

డాక్టరు: "ఆగండి, జోలపాట పాడుతాను."

లేచి "ఆ....ఏమండి, పిలిచారా" అంటూ తలపక్కనున్న స్విచ్ వేసింది. గదంతా దిక్కుమాలిన వెలుతురు వ్యాపించింది.

"ఏవిటి? అలావున్నారేవిటి? నిద్ర పోలేదా?" అనడిగింది నా ముఖం చూస్తూనే.

"ఏం?" అన్నాను నేను క్రాపు సరిచేసుకుంటూ.

"ఏం ఏవిటి? మీ ముఖమే చెప్తోంది. ఏవి టాలోచిస్తున్నారు?" అంది మంచం మీంచిలేచి నా మంచంవద్దకు వస్తూ.

"ఏంలేదు-ఏదో ఆఫీసు విషయం" అన్నాను తప్పించుకోడానికి లేచినకారణం చెప్ప బుద్ధికాలేదు.

ఆమె బాధగా నవ్వింది.

"మీరు ఆ ఆఫీసులో గుమాస్తానా లేక యజమానా? నేనే మీ స్థితిలోవుంటే అసలు ఆఫీసుకు వెళ్ళేదాన్నేకాదు. పని యెక్కువయితే మరో పదిమందిని వెయ్యండి. అంతేగాని మీ ఆరోగ్యం పాడుచేసుకుంటే ఎలా?" అంది నా నుదురుమీద చెయ్యి వేస్తూ. "అబ్బే జ్వరంలేదు." అని చిన్నగా గొణిగింది.

"రాధా! మనం యజమానులం గనుకే యింత ఆలోచించాలి. లేకపోతే నాకేంపని" అన్నాను ఆఫీసుగురించి ఆలోచిస్తున్నానని చెప్పిన విషయాన్ని బలపరుచుకుంటూ. రాధ నామాటని సుతరాం వొప్పుకోనట్టు తలతిప్పి, "కాదనను కానీ యిలా అనవసరంగా ఆలోచించే అంత ఏమొచ్చింది? హాయిగా నడుస్తోంది కదా! రాత్రి తెల్లవార్లూ ఆలోచించడంవల్ల లాభం ఏవిటి?" అంది.

"అవును. లాభంలేదు. పడుకుంటాను. లైటార్పెయ్" అన్నాను పక్కమీదవాలుతూ. రాధ లైటార్పేసి, పడుకుంది. నాకు నిద్ర పట్టదని ముందే తెలుసు. రాధ నిద్రపోయిందని తేల్చుకోగానే లేచి మళ్ళ డాబామీదికి వచ్చాను. ఆ పక్కనున్న పడకకుర్చీ వెన్నెల్లోకి లాక్కుని కూర్చున్నాను. గతం గురించి ఆలోచించకూడదనుకున్నకొద్దీ ఆ ఆలోచన విజృంభిస్తుంది. నా మనస్సు గతంలోకి వెళ్ళిపోయింది.

రానురాను నేను పొద్దునపూట కూడా వాళ్ళింటికి వెళ్ళేవాడిని. అలా వెళ్ళే రోజుల్లో ఎవరో ఒకతను వాళ్ళింటికి రావడం, పోవడం చూశాను. ఆరోజు నేను వెళ్ళేసరికి అతను, సుశీల హాల్లో కూర్చుని, కబుర్లు చెప్పుకుంటున్నారు. సుశీల అతన్ని నాకు పరిచయం చేసింది. అతను డాక్టర్ మోహన్‌ట! ఆమెతోనే చదివాడట. ముగ్గురం కబుర్లలోకి దిగాము. అతను మరీ వాగుడుకాయలా కనుపించాడు. సుశీల అతని మాటలకు వుత్సాహంతో నవ్వడం ప్రారంభించింది. నాకు చిరాకు కలిగింది. అసూయకూడా కలిగింది. ఆ మోహన్ నామీద గుప్పెడు పొడుగున్నాడు. నాకన్నా కొంచెం బలంగా వున్నాడు. పైగా డాక్టరు చదివాడు. కాస్తో కూస్తో వున్నవాడే అయి వుండా లనిపించింది. రెండు గంటలు కబుర్లయ్యాక 'వెళ్ళొస్తా' అని నేను లేచాను. మోహన్‌కూడా లేచి నిలబడి "నేనూ సెలవు తీసుకుంటాను" అన్నాడు. సుశీల అతన్ని కాస్సేపు వుండమని బ్రతిమాలింది. నన్ను కూడా ఆగమంది. కాని, ముందతనికి ప్రాధాన్యం ఇవ్వడంవల్ల నాకు కోపం ఎక్కువయింది. ఇక అక్కడ ఒక్కక్షణం కూడా వుండబుద్ధికాలేదు. బయటికి వచ్చేశాను. నా కారుపక్కన మరో కారువుంది. దానిలో కూర్చున్న డ్రయివరులాంటివాణ్ణి, "కారెవరిది?" అని అడిగాను. "మోహన్ గారిది" అన్నాడతను. నాబుర్ర తిరిగింది. అతనికీ కారుంది! ఇక అన్ని విషయాల్లోనూ అతనికన్నా నేను హీనమే! నామీద నాకే అసహ్యంవేసింది. అతన్ని పీక నులిపేసి చంపేద్దామనుకున్నాను కాని అది కార్యరూపం దాల్చలేదు. అతనుకూడా నా అంత తరుచుగా వాళ్ళింటికి రావడం ప్రారంభించాడు. సుశీలతో అతను మాట్లాడుతుంటే ఆమె తన రెండుచేతులను చెంపల కానించి, అతని కళ్ళల్లోకి చూస్తూ వూకొట్టేది. అలాటి సమయాల్లో నేను ఏ పేపరు చాటునో ముఖం దాచుకునేవాడిని. సుశీలకి మాటలు వినడంఅంటే తగని యిష్టం. మోహన్‌కి కబుర్లుచెప్పడం వుంటే, తిండి తిప్పలుకూడా అక్కర్లేదు. నాకు కబుర్లు చెప్పడమూ రాదు, వినే ఓపికాలేదు. ఇక నాగతి అంతే! రానురాను సుశీలని చూడాలనే వుత్సాహం నాలో సన్నగిల్లడం ప్రారంభించింది. చాలాసార్లు వాళ్ళింటికి వెళ్ళి బయట అతనికారు చూసి, వెనక్కు వచ్చేవాడిని.

సుశీల నా సొత్తు. పరాధీనం కాకూడదు. కావడానికి వీల్లేదు అనే పట్టుదల నాలో ఎక్కువయింది. ఈ ఆలోచనవల్ల ఒకవారం వాళ్ళింటికి వెళ్ళడం మానేశాను. ఒకనాడు ఆమె నా ఆఫీసుకు ఫోనుచేసి, రావడం మానేసిన కారణం అడిగింది. ఏమీలేదని చెప్పినా నమ్మలేదు. సాయంత్రం యింటికి రమ్మని బ్రతిమాలింది. అలాగే అన్నాను. సాయంత్రం యీ సంగతి తాడోపేడో తేల్చెయ్యాలని బయల్దేరాను. ఇంటికి వెళ్ళేసరికి ఆమె లేదు. డాక్టర్ మోహన్, ఆమె ఎక్కడికో వెళ్ళినట్టు వాళ్ళమ్మమ్మ చెప్పింది. నా బుర్ర గిర్రున తిరిగింది. కేవలం నన్ను అవమానపరచడానికే రమ్మందా అన్న అనుమానం కలిగింది. తిన్నగా కారెక్కి మెరీనాబీచ్‌కి చేరాను. బీచ్‌లో అటూయిటూ ఆలోచిస్తూ తిరుగుతుండగా నా కంటికి ఓ జంట కనుపించింది. మరికాస్త తేరబారి చూచాను. నా వొళ్ళు ఝల్లుమంది. శరీరం చల్లబడి పోయింది.

వాళ్ళిద్దరు సుశీలా మోహన్‌లు!

పరుగున వెళ్ళి ఆ మోహన్ జుట్టు పీకేసి, ప్యాంటు, చొక్కా చింపేసి, టైతో వాడి మెడ బిగించేసి, దవడపళ్ళు రాలగొట్టేద్దామనిపించింది. కాని, అది అవివేకం. వాళ్ళను వెంబడించి, వాళ్ళు ఏవిధంగా

● వృద్ధుడైపోతున్న మావో, తనను రెడ్‌స్క్వేర్‌లో సమస్త గౌరవ లాంఛనాలతో సమాధి చేయడానికి గనక ఒప్పుకుంటే, ఈ క్షణంలోనైనా, రష్యాల మధ్య విరోధాలను అంతం చేయించగలనని క్రుశ్చెవ్‌కు వ్రాశాడట.

దీనికి రష్యాప్రధాని జవాబు: "మీరు వెంటనే రండి. అలాగే చేస్తాము."

("శాటర్ డే రివ్యూ")

ప్రవర్తిస్తారోచూసి, ఒకవూహ కల్పించుకోవచ్చని వాళ్ళను వెంబడించడం ప్రారంభించాను. వాళ్ళు ఒకళ్ళకొకళ్ళు చాలా దూరంగా నడుస్తున్నారు. సుశీల కొంచెంముందు నడుస్తోంది. అతను ఆగి ఏదో వర్ణించి చెబుతుండడంవల్ల, ఆగి వెనక్కు తిరిగింది. ఆ తిరగడంలో ఆమెకు నేను కనబడ్డాను. నాకేసి వచ్చేసింది. వస్తూనే, "వెరీ సారీ! సాయంత్రం మూడింటికి ఆసుపత్రికి వెళ్ళాము. అక్కడ చాలా ఆలస్యమైంది. ఒక కేసువిషయం మాట్లాడుకుంటూ యిద్దరం యిలా వచ్చాము. ఆపరేషను ఆయింది. కానీ, ఆ పేషంటుమాత్రం బ్రతకలేదు" అంది గబగబా.

"ఆహా" అన్నాను నేను.

ఇంతలో అతనుకూడావచ్చి అదే సంగతి చెప్పి, "సుశీల మిమ్మల్నిగురించే చెబుతోంది" అన్నాడు. 'నోర్ముయ్యవోయ్' అందా మనుకున్నానుగాని, బాగుండదని వూరుకున్నాను. ముగ్గురం యిసకలో కూర్చున్నాము. ఐస్‌క్రీమ్ వచ్చేసరికి మోహన్ కొన్నాడు. వాడు కొన్న ఐస్ నాకు తినా లనిపించలేదు. చేయి జారినట్టు నటించి ఐస్ ఇసకలో పడేసి, నా డబ్బుతో మరోటి కొన్నాను. మరికాస్సేపు కూర్చొన్నాక మోహన్ లేచి వెళ్ళవస్తానన్నాడు.

"మంచిది" అన్నాను నేను తొందరగా.

మోహన్ వెళ్ళిపోయాక నేను చెప్పదలచుకున్న విషయాలు ఎలా చెప్పాలో ఆలోచించుకుంటుంటే సుశీలే మాట్లాడి "నే నొక విషయం మీతో చెప్పాలి" అంది.

"నేను వచ్చేవారం మా వూరు వెళ్ళిపోతున్నాను. మా అమ్మమ్మనుకూడా తీసుకువెళుతున్నాను. మన వివాహవిషయం మా తలిదండ్రులతో అమ్మమ్మ మాట్లాడుతానంది. మీ కిష్టమేకదా? మా నాన్నగారు వస్తారు మీ యింటికి. వాళ్ళ లాంఛన ప్రకారం జరగవలసినవి వుంటాయికదా! ఏమంటారు?" అంది.

నాకు ఆశ్చర్యంవేసింది. సుశీలకి నన్ను వివాహంచేసుకోవాలనే వుద్దేశం నిజంగా వుందనే నమ్మకం నాకు కలగలేదు.

"డాక్టర్ మోహన్ మంచి సంబంధమేమో" అన్నాను యిసకలో గీతలుగీస్తూ. ఆమాట వింటూనే సుశీల చీత్కారంచేసింది. ఆమె కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"మీరింత నీచంగా వూహించగలరని నేను కలలోనయినా వూహించలేదు." అంది బాధగా.

"ఊహించడం కాదు, నానమ్మకం అది. నేను కేవలం అతనికి ఎందులోనూ సరిపోను. నాకు చాలా డబ్బువుందనుకుంటే - అతనికీవుంది. ఇక నాలో ఏఘనతాలేదు. ఏ స్త్రీకూడా చూస్తూ చూస్తూ ఒక అల్పుడిని ప్రేమించి పెళ్ళాడదు. పెళ్ళాడాక అల్పుడయితే విషయం వేరు" అన్నాను.

ఆమె తలవంచుకుని కూర్చుని వుంది. కన్నీరుమాత్రం చీరకుచ్చెళ్ళమీద పడడం కనిపించింది. నాకు తృప్తి కలగలేదు. సుశీల భోరున ఏడ్చినా, నామనస్సు శాంతించదేమో! కాని భోరున ఏడిస్తే చూసి, ఆనందించా లనిపించింది... మాటలతో ఆమెను ఎంతవరకు బాధపెట్టగలనో అంతవరకు బాధపెట్టి తీరాలనుకున్నాను. ప్రారంభించాను.

"నువ్వు నా దాని వనుకున్నాను. కానీ అది కేవలం నా భ్రమని తేలింది. నువ్వు ఆ మోహన్‌తో అంత చనువుగా మాట్లాడడం నా కిష్టంలేదు. లేదని చెప్పడానికి నే నెవర్ని-అవును. ఆ ప్రశ్నకు నేనే సమాధానం చెప్పుకోలేను." అన్నాను తాపీగా ఆమెవంక చూస్తూ.

ఆమె ముఖంపైకెత్తి నాకేసి చూసింది. ఆమె కళ్ళు ఎర్రగా తయారయ్యాయి. ఆమె ఆ స్థితిలో వుండడం నే నిదివర కెన్నడూ చూడలేదు. కళ్ళు తుడుచుకుంటూ "మీరు యింత సంకుచిత భావాలు కలవారని నేను ఎన్నడు అనుకోలేదు నా వృత్తి డాక్టరు వృత్తికదా! అతను-నేను కలిసి అప్పుడప్పుడు ఆసుపత్రికి వెళ్ళడం జరిగేది. మనిషి చక్కగా మాట్లాడుతాడు ..."

"చక్కగాకూడా వుంటాడు" అన్నాను నేను ఆమె మాటలకు అడ్డొచ్చి.

"ఆ విషయం నేను ఎన్నడూ ఆలోచించలేదు. నాకు అవసరంకూడాలేదు" అందామె.

"అవసరంవస్తే ఆలోచిస్తావన్న మాట" అన్నాను.

"ఆ అవసరం రాదన్న నమ్మకం వుంది నాకు" అంది. ఆ మాటన్నపుడు ఆమె గొంతు చాలా స్థిరంగావుంది.

"ఇంతకీ నా మాటకి మీరు సమాధానం చెప్పలేదు" అందామె.

"నాలో ఏంచూసి నువ్వు నన్ను వివాహం చేసుకోదలచావో చెప్పగలవా?" అన్నాను.

"ఆ ప్రశ్నకి నేనేకాదు, చాలామంది చెప్పలేరు. నాకు బెండకాయకూర యిష్టం. అదెందుకే నీ కిష్టం అని అమ్మమ్మ అడుగుతుంది కానీ చెప్పలేను. అంత చిన్న విషయమే చెప్పలేకపోతే యింతపెద్ద విషయం ఎలా చెప్పగలను?" అందామె.

"అయితే యింకా కొన్నాళ్ళు నాకు టైమివ్వాలి. ఏ సంగతీ ఆలోచించుకోవాలి. నాకు ఆలోచన చెప్పడానికి తల్లీ తండ్రీ కూడా లేరుకదా! డబ్బుని ఆలోచన అడిగితే అది చెప్పలేదు" అన్నాను లేచి నుంచుంటూ. సుశీలకూడా లేచి నుంచుంది. ఇద్దరం ఇసకలో నెమ్మదిగా నడిచి, కారులో ఎక్కాము. ఆమెను ఆమె యింటిముందు దింపాను. ఆమె కారుదిగి, రెండు చేతులు జోడించి "ఉంటాను. మీ రాకకోసం ఎదురు చూస్తుంటాను. ఆవేశపడి బుర్ర పాడుచేసుకోకండి" అంది. "అలాగే" అన్నాను నేను. నా కారు కదిలి, మలుపుతిరిగేవరకు అలాగే నిలబడివుంది. ఇంటికి వచ్చేసరికి నాకోసం నౌకర్లు ఎదురుచూస్తున్నారు. వాళ్ళకది మామూలు. మేనేజరుగా వుంటున్న మేనమామ "ఏంరా, అలావున్నావు" అని పలకరించాడు. ఆయన దయామయుడు. నా ఆస్తిని, నన్ను పెద్దచేసినవాడు. ఆయనకే గనుక అమ్మాయివుంటే మాట అడ్డుచెప్పకుండా పెళ్ళిచేసుకుని వుండేవాడిని.

"ఏంలేదు, మామయ్యా" అన్నాను.

ఆయన అంతకన్నా ఎక్కువ పలకరించరు. నేను తిన్నగా నా రూములోకి వెళ్ళిపోయాను. ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. సుశీలని గురించి ఒక నిర్ణయానికి రాలేకపోయాను.

రెండు రోజులు గడచాయి. ఆనాడు సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళాను. సుశీల యింట్లో సుమారు పదిమంది మగవాళ్ళున్న

ట్టున్నారు. లోపలకు వెడదామా, వద్దా అని సంశయించేలోగా సుశీలే నన్నుచూసి, "రండి రండి" అని పిలిచి వాళ్ళకి పరిచయం చేసింది. అంతా డాక్టర్లేట! వీళ్ళు దేశంలో రోగాలు నయం చెయ్యడానికా, లేక విస్తృతం చెయ్యడానికా అనుకున్నాను అంతా వెళ్ళిపోయాక, సుశీలా, నేనూ డాబా మీదకువెళ్లాము. నేను మనస్సులో మాట్లాడబోయేది నిర్ణయించుకున్నాను. సుశీల చల్లని పానీయం నాకో గ్లాసుడు యిచ్చి, "మీరు ఏమని ఆలోచించుకున్నారు?" అంది.

"నా ఆలోచనలు నీమనస్సుకి నచ్చవని తెలుసు. అయినా అడిగావుగనుక చెబుతాను. నీకు వినడానికి తీరుబడి వుందనుకుంటాను" అన్నాను.

ఆమె మౌనంగా తల వూపింది.

నేను గొంతు సవరించుకున్నాను.

"నాకు కొన్ని ఆశయాలు, ఆశలు, ఆదర్శాలు వున్నాయి. వివాహాన్నిగురించి కొన్ని వూహలు వున్నాయి. నువ్విలా అందరితో కులాసాగా కబుర్లుచెప్పడం నా కిష్టం వుండదు. దాన్ని తప్పనలేను. కాని నాకు తెలియకుండా నా మనస్సు బాధపడుతోంది. నా స్థానంలో ఆ మోహన్‌నిగాని మరెవర్నిగాని నేను వూహించుకోలేను. నువ్వే నా దానివి. ఇవాళ గాకపోతే రేపు అవుతావు. ఆపాటికి యివాళనుంచే నా మాట మీద గౌరవం వుంచితే నీకు పోయేదేమీ వుండదు. నా మాట విని ఆ మోహన్‌ని, వాళ్ళని పలకరించకు. వాళ్ళని రానివ్వకు, వాళ్ళతో మాట్లాడకు. అంతే - అంతే" అన్నాను ఆవేశంతో.

ఆమె నిస్పృహగా నవ్వింది.

"మీ మనస్సు మరీ వికలంగా వుంది. ఇంతగా ప్రతిదానికీ మీరు బాధపడతారని అనుకోలేదు. కాని మీకు కోపం రాకుండా వుంటే ఒక్కటి అడుగుతాను" అంది.


"ఏమి టది?" అన్నాను కొంచెం విసురుగా.

"మా యింటికి వచ్చారు. మా వాళ్ళని పరిచయంచేశాను. మా వివరాలన్నీ తెలియజేశాను. నా కథంతా చెప్పాను. మా నాన్నగారి వుద్యోగం, ఆస్తిపాస్తులు చెప్పాను. కాని, మీరు ఒక్కనాడయినా మీ యింటికి రమ్మన్నారా? లేదు. రమ్మనలేదు. మీ కుటుంబ విషయంగాని, మరితర విషయాలు గాని చెప్పారా-లేదు. ఇన్ని విషయాలు మిమ్మల్నిగురించి నాకు తెలియకపోయినా మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. మీ పేరు, మీ కారు నెంబరు, ఫోను నెంబరు తప్ప మిగతా విషయాలు నాకు తెలియవు" అంటూ ఆగింది.

"ఈ వుపోద్ఘాత మంతా ఎందుకు?" అన్నాను నేను

"ఏమీలేదు. కాస్త నిదానించి, విశాలంగా ఆలోచించండి" అంది ఆమె ముక్తసరిగా.

"ఆలోచించలేను. నువ్వు నాదానివిగా కావాలంటే నే చెప్పినట్టు వినాలి. ఇదిగో నా వుంగరం నీ వేలికి తొడుగుతాను. మనిద్దరికి పెళ్ళి అయిపోయినట్టే అనుకుందాము. నువ్వు మీ నాన్నగారితోచెప్పు. ముహూర్తం పెట్టించు" అంటూనే ఎడమచేతి చిటికినవేలి వుంగరం తీసి, ఆమెవైపు నడిచాను. ఆమె కంగారుగా ఒక్క గంతు వేసింది.



"మిష్టర్ రాజూ!" అంది కొంచెం స్థిరంగా.

నన్నారకంగా ఆమె ఎన్నడూపిలవలేదు. నేను నిలుచున్నచోటే వుండిపోయాను.

"ఈపద్ధతి నాకు బొత్తిగా నచ్చలేదు. ఆ రకం నాగరికతను నే నెన్నడు కోరను. మీకు మనసు ఏనాడో యిచ్చాను. దానిని రుజువు చేసుకోడానికి యీ వుంగరాలు తొడగడాలు అవి నాకు పనికిరావు. పెళ్ళయ్యే వరకు మీరు నా స్నేహితులక్రిందే లెక్క. ఆపైన చనువు యివ్వలేను" అంది.

నాచేతిలో వుంగరం నన్ను వెక్కిరించింది. చేతిలో వుంగరాన్ని కసిమని నేలకేసికొట్టి చర్రున బయటికి వచ్చేశాను. ఆ మర్నాడు ఎవరో ఒకతను ఒక కవరు నాకు యిచ్చారని వ్యాపిచ్చాడు. అందులో వుత్తరంవుంది. సుశీల తన తల్లిదండ్రులతో చెప్పి ముహూర్తం పెట్టిస్తానని, ఆవేశపడవద్దని రాసింది. కోపంతో ఆ వుత్తరం చింపి పారేశాను. మూడోనాడు వాళ్ళ నాన్నగారు వస్తే అపలాయన్ని చూడడానికే నిరాకరించాను. ఆయన వెళ్ళిపోయాడు. అంతే ఆనాటికి - మళ్ళీ యీనాటికి - సుశీలని చూశాను.

● ● ●

ఆలోచనలతో బుర్ర వేడెక్కింది. సుశీల వివాహం చేసుకుందా? లేదా!! ఎవర్ని చేసుకుంది? ఆ మోహన్‌నా? మరో మదన మోహనుడినా? ఎంతమంది పిల్లలు అనే ప్రశ్నలకు సమాధానాలు తర్కించుకుంటూ నిద్రపోయాను.

● ● ●

రాధ లేపడంవల్ల లేచి, తెల్లవారిందని గ్రహించాను.

"మీ మనస్సులో ఏదో వుంది. ఎందుకో మథనపడుతున్నారు. నాతో చెప్పకూడదా?" అంది నా కళ్ళల్లోకి చూస్తూ. రాధ చేతుల్ని

నా చేతిలోకి తీసుకుంటూ "ఏం లేదు. నిన్ను గురించే" అన్నాను. అలాటి మాటలు రాధ సుతరాం నమ్మదు. నా చేతులను విడిపించుకుంటూ "ఎందుకు? తెల్లారుతూనే అబద్ధాలాడుతారు? చెప్పకపోతే నన్ను చంపుకు తిన్నట్టే" అంది. ఉలిక్కిపడ్డాను. "మనుష్యుల్ని చంపుకుతినడంఅంటే అంత తేలిక కాదు. అందులో పెళ్ళాన్ని ఎవరైనా చంపుకుతింటారా?" అన్నాను.

"అయితే చెప్పండి" అంది మడతకుర్చీ చెయ్యిమీద కూర్చుంటూ.

"ఇప్పుడుకాదు. కాఫీ లయ్యాక" అన్నాను నేను.

కాఫీ లయ్యాయి.

"చెప్పండి" అంది పట్టుదలతో.

"చెప్పనా? బ్రహ్మాండమైన ప్రేమకథ" అన్నాను నేను సీరియస్‌గా.

"బోదురూ. ఎప్పుడూ వేళాకోళమేనా" అంది.

"కాదు. నిన్ను పెళ్ళి చేసుకునేముందు ఒకమ్మాయిని ప్రేమించాను. ఆకథ" అన్నాను.

రాధ ముఖంలో నవ్వు మాయమయ్యింది. ముఖం నయాపైసా అంత చేసుకుంది.

"అదే! అందుకే చెప్పనన్నాను" అన్నాను.

"లేదు, చెప్పి తీరాలి" అంది.

అంతా చెప్పాను.

"నీ అభిప్రాయం చెప్పు" అన్నాను.

రాధ చిన్నగా నవ్వింది.

"అభిప్రాయానికి ఏముందని ఒక. చిన్న విషయంమీద మగాళ్లు ఎలా చంపుకున్నారో నాకు బోధపడలేదు. స్త్రీతత్వమే అంత. ఏమీ లేనిదానికి కూడా కొండంతగా ఆలోచిస్తారు" అంది. మనశ్శాస్త్రవేత్తలాగ.

"అవును" అన్నాను.

"మళ్ళీ - వాళ్ళ నాన్నగారు వచ్చి వెళ్ళాక ఆమె రావడం కానీ వుత్తరం రాయడం కాని. చెయ్యలేదా" అంది రాధ.

"లేదు మన పెళ్ళి శుభలేఖ రిజిస్టర్డు పోస్టులో పంపాను. దాంతోకాని, నా కసి తీరలేదు" అన్నాను.

రాధ యింకేమీ సమాధానం చెప్పలేదు.

● ● ●

ఆఫీసులో ఎవరితోనో మాట్లాడుతుండగా ఫోన్‌కాల్ వచ్చింది. "వన్మినిట్" అని చెప్పి ఫోనుతీసి "హలో రాజుహియర్" అన్నాను.

"సుశీల మాట్లాడుతున్నది" అంది అవతలి కంఠం. అది ఆపరేటరు కంఠం. అరకంగా చెప్పడం ఆ ఆపరేటరుకి ఒక హాబీ.

సుశీల పేరు వినడంతో నేను వులిక్కిపడ్డాను. ఇంతలో సుశీలకంఠం శ్రావ్యంగా వినిపించింది.

"నమస్కారమండి" అంది. ఆ కంఠం ఎంతో పరిచయంవున్న కంఠం. హాయిగా ఒకానొక కాలంలో తీయని కలలకు రూపం దిన కంఠం.

"నమస్కారం" అన్నాను నేనూ పొడిగా.

"మీ కభ్యంతరం లేకపోతే మెరీనాబీచ్ దగ్గరకు సాయంకాలం ఒకసారి రావాలి.

నేనే మీ ఆఫీసుకి వద్దామనుకున్నాను. కానీ ఎన్నడూ రాలేదుకదా అని జంకాను. ఏం? వస్తారుకదూ" అంది.

సుశీల గొంతులో ఒక ఆజ్ఞ వుంది. వస్తారా అని అడిగినా అది ఆజ్ఞే.

"తప్పక వస్తాను" అన్నాను.

"థాంక్యూ" అంది.

ఫోను క్లిక్‌మంది.

● ● ●

నాకోసం చూస్తున్న ఆమెను చప్పున చూశాను. తెల్లటి సిల్కుచీర, అంతకన్న తెల్లటి రవిక తొడిగింది. జుట్టు చక్కగా ముడిచుట్టి, సిగమీద మల్లెపూలు పెట్టుకుంది. కుడిచేతికి మేల్స్ వాచ్ వుంది. ఎడంచేతికి ఒక బంగారం గాజుంది.

"ఇలా కూర్చుందామా" అంది నన్ను చూస్తూనే.

"ఆహా" అన్నాను.

ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాము. ఆమెనుచూస్తుంటే నాకళ్లలోగకంమరోసారి గిర్రున తిరిగింది. ఆనాడు నాముందు చిలిపిగా, చక్కగా మాట్లాడిన ఆ సుశీలవేరు. గంభీరంగా కూర్చుని, ఇసకలో గీతలు గీస్తున్న యీ సుశీల వేరు.

"మీ భార్యని చూడాలనివుంది" అంది సుశీల వున్నట్టుండి.

"ఏం?" అన్నాను నేను.

"ఏమో! అలాటివాటికి సమాధానం చెప్పలేనని యిదివరకే చెప్పాను. బెండకాయకూర నీకెందుకే అంత యిష్టం అని అడిగిన అమ్మమ్మ లేదు యీనాడు. కానీ, నాటికీ నేటికీ ఆమె ప్రశ్నకి సమాధానం నా దగ్గరలేదు." అంది.

నేను సుశీలకేసి చూశాను. అయిదేళ్ళ క్రితం సుశీలకి, యీనాడు నా యెదురుగా కూర్చుని వున్న సుశీలకి తేడామాయమైంది. కాకపోతే మనిషి అప్పటికన్నా కొంత నాజూకు తేలింది.

"ఎంతమంది పిల్లలు యిప్పుడు" అంది గాలికి ఎగిరే పైటకొంగును అదుపులో పెట్టుకుంటూ.

"పిల్లలు యింకాలేరు." అన్నాను నేను కొంచెం బాధపడుతూనే.

"చాలా అదృష్టవంతులు. అయితే మీకింకా సమస్యలు పుట్టలేదన్నమాట" అంది.

నవ్వేసి వూరుకున్నాను.

"ఇంతకీ నే నడిగినదానికి సమాధానం చెప్పనేలేదు. మీ ఆవిణ్ణి చూపించరా? నిన్న సినిమాహాల్లో చూశాను. కానీ, ఆమెనుపలకరించాలి-మాట్లాడాలి అనే కోర్కె తీరలేదు" అంది.

ఇసకలోంచి లేచి నిలబడుతూ "అయితే వెడదాం పదండి" అన్నాను. సుశీలకూడా లేచి నిలబడింది. ఇద్దరం మౌనంగా నడక ప్రారంభించాము.

"మా ఆవిణ్ణి చూపించాలంటే ఒక్క షరతు" అన్నాను నేను నడకమాని నిలబడుతూ. సుశీలకూడా ఆగి "ఏమిటది?" అంది.

"మీ వారినికూడా నాకు పరిచయం చెయ్యాలి" అన్నాను.

ఆ మాటతో ఆమె ముఖంలో విచిత్రమైన మార్పువచ్చింది. తల దించేసుకుంది. రెండు నిముషాలు మౌనంగా గడిచాయి.

"మీ కోర్కె చెల్లించలేను" అంది చాలా నెమ్మదిగా.

"ఏం?" అన్నాను నేను విషయం అర్థం గాక.

ఆమె తలెత్తి నాకేసి చూసింది. కళ్ళ వెంట నీరు ధారగా కారుతోంది. ఎడమచేతి చూపుడువేలు నా కేసి చూపించింది. ఆపు కుందామని విశ్వప్రయత్నం చేసినా ఆమె దుఃఖం ఆగలేదు.

నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను.

ఆ నాడు నేను వాళ్ళింట్లో విసిరేసిన నా వుంగరం!

నా తల కొట్టేసినట్లయ్యింది.

ఆమె ముఖంలోకి చూడలేక, తల దించేసుకున్నాను.

"మనస్సు నివ్వడం, మనసారా ప్రేమించడం అనేది ఒక్కసారే జరుగుతుంది. అది నా జీవితంలో అయిపోయింది...." అంటూ నిలుచున్నచోటే నెమ్మదిగా కూర్చుంది. నేనూ కూర్చున్నాను.

వాళ్ళ నాన్నగారు నాచేత పరాభవింపబడి, యింటికి వెళ్ళి తనను అనరాని మాటలు అన్నసంగతి, తమ పెళ్ళాడనని తల్లితో తెలియజేశాక, ఆయన మనోవ్యాధితో మంచం పట్టిన సంగతి, చివరికి ఆయన మరణించిన సంగతి నెమ్మదిగా చెప్పింది.

నా హృదయంలో ఎవరో చెయ్యిపెట్టి దేవినట్టయింది. పీక నులుపుకుని చచ్చిపోదామనిపించింది. సుశీల నన్నంతగా ప్రేమించిందని నే నానాడే కాదు, ఈ నాటివరకు వూహించలేదు. కాస్త నిదానించి వుంటే ఏమయ్యేదో! ఆమె భవిష్యత్తుకు, ఆమె తండ్రి చావుకు నేనే కారకుడిని. ఈరకం హంతకులను చట్టం ఏమీ చెయ్యలేదు. అవును. ఏమీ చెయ్యలేదు.

సుశీల కన్నీరు తుడుచుకుని లేచి నిలబడింది. నేనూ యాంత్రికంగా లేచాను.

"మీరంత బాధపడవలసిన పనిలేదు. దైవనిర్ణయం ఏమిటో అది జరిగితీరుతుంది" అందామె.

నా తల సిగ్గుతో వంగిపోయింది. ముందు వెనుకలు ఆలోచించకుండా ఒక అమాయక ప్రాణి జీవితం నాశనం చేశానే అనిపించింది. "తన కోపమె తన శత్రువు అన్నారురా రాజా! ప్రతీదానికి ముందూ వెనుకా ఆలోచన లేకుండా అంతకోపం తెచ్చుకుంటే. తరువాత పశ్చాత్తాపపడినా ప్రయోజనం వుండదు" అని నా చిన్నతనంలో మేనమామ చేసిన హెచ్చరిక అక్షరాలా నిజమనిపించింది.

"వివాహం అనేది నా జీవితపథంలోంచి ఏనాడో పోయింది. ఇక నా కున్నది - నా వృత్తి ధర్మం అంతే" అందామె తడిఆరిన గొంతుతో.

నేను నిల్చున్నచోటే వుండిపోయాను. అమాంతం గొంతు నులుపుకుని చద్దామన్నంత ఆవేశం కలిగింది.

"సుశీలా! నేను దుర్మార్గుణ్ణి-మూర్ఖుణ్ణి నన్ను క్షమించు" అన్నాను. ఏడుద్దామనుకున్నా కంటివెంట ఒక్కచుక్కయినా నీరు రాలేదు.

సుశీల నిస్పృహగా నవ్వింది.

"అంత మాటనకండి. విభిన్న తత్వాలున్న వాళ్ళ దాంపత్యజీవితం ఎప్పుడూ సుఖంగా జరగదు. ఒకరకంగా మన వివాహం జరగక పోవడమే మంచిది. అన్నట్టు రాధతో మీకెలా వివాహమైంది?" అని నాముఖంలోకి చూసి, "పేరెలా తెలుసనా, ఆశ్చర్యపడుతున్నారు? రిజిస్టర్డు పోస్టులో వచ్చిన శుభలేఖలో విషయం

అమాత్రమయినా గుర్తు వుండదా" అంది కన్నీరు తుడుచుకుని నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అవును" అన్నాను నేను.

"చెప్పండి" అందామె.

రాధ మా ఆఫీసులో టైపిస్టు వుద్యోగం కోసం వచ్చినట్టు, తలిదండ్రులులేక, మేనత్త వద్దిలో పెరిగిన ఆమెగాథ విని జాలిపడి వుద్యోగం యిచ్చిన వైనం, వారం తిరగకుండా రాధకి దిక్కు అయిన మేనత్త కూడా చనిపోయిన నాడు రాధని వివాహం చేసుకోడానికి నిశ్చయించుకుని, మరోవారం తిరిగేలోగానే వివాహం చేసుకున్నట్లు చెప్పాను.

"రాధ చాలా అదృష్టవంతురాలు. మీ వంటివారిని భర్తగా పొందింది" అంది సుశీల.

"అనే అనుకుంటోంది రాధకూడా! కానీ నేనెంత మూర్ఖుణ్ణో, ఎంత అహంకారినో నీకథ విన్నాకూడా ఆమె గ్రహించలేదు, అది విచిత్రం" అన్నాను.

"అందుకనే రాధ అదృష్టవంతురాలని అన్నాను" అంది మళ్ళీ.

"అవునేమో!" అన్నాను నేను.

ఇద్దరం మౌనంగా కారెక్కాము కారులో మళ్ళీ, నేను రాధని ఎంత విచిత్ర పరిస్థితుల్లో కలుసుకున్నదీ, వివాహం చేసుకున్నదీ చెప్పాను. సుశీల చాలా ఆనందంగా వింది. మరి కాస్సేపు ఏదోఏదో మాట్లాడి "డాక్టర్ మోహన్ ఎక్కడున్నాడు?" అన్నాను తీరా అడిగాక, ఆ ప్రశ్న ఎంత తెలివితక్కువ ప్రశ్నో, ఆమెను ఎంత బాధపెట్టే ప్రశ్నో తెలిసింది. నా తెలివితక్కువతనానికి శిక్ష అనుకున్నాను. కాని, సుశీల ఏమీ బాధపడినట్లు కనబడలేదు. అతను గుంటూరులో వుంటున్నాడని, ఇద్దరుపిల్లల తండ్రి అయ్యాడని చెప్పింది.

కారు ఇంటిముందు ఆపేసరికి రాధ బయటకువచ్చింది. కారు దిగి నేను రాధకి ఎదురువెళ్ళేసరికి సుశీల కారు దిగి మెట్ల దగ్గరకు వచ్చింది. నేను రాధ నుద్దేశించి "ఈవిడే డాక్టర్" అనగానే "సుశీల" అని రాధ పూర్తిచేసింది.

"మీ ఆవిడ చాలా తెలివైనది" అంది సుశీల రాధభుజంమీద చెయ్యివేసి తట్టుతూ. రాధ సిగ్గుతో తలదించుకుంది

"సామాన్యమయిన తెలివికాదు. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టగలదు. ఛస్తున్నాను మధ్య నేను" అన్నాను.

● అప్పారావు: "హల్లో, ఒక్క అయిదు...."

డప్పారావు: "కానీ కూ...."

అప్పారావు: "....నిమిషాలు నీతో మాట్లాడాలోయ్"

డప్పారావు: "....రొప్ప ఆ కుర్చీమీద."

''చాల్లెండి'' అంది రాధ క్రీగంట చూస్తూ.

ముగ్గురం కలిసి అరగంటసేపు కబుర్లు చెప్పుకున్నాము. తర్వాత రాధ కాఫీ పట్టు కొచ్చి యిచ్చింది. కాఫీ త్రాగాక, ''వస్తాను' అంటూ సుశీల లేచింది.

''భలేవారు. భోజనం చెయ్యకపోతే పేదుట్టుందనుకున్నారా యీ చెల్లెలు'' అంది రాధ సుశీల చెయ్యిపుచ్చుకుని. ఆమాటతో రాధ మనస్సు యెంత నిర్మలమో నాకు మరింత చక్కగా అర్థమయింది.

''భోజనం పెడతానంటే వద్దంటానా?'' అంటూ సుశీల కూర్చుంది.

రాత్రి భోజనాలు అయాయి మరి కాసేపు కబుర్లయ్యాక "వెళ్ళమనే లోగా వెడితే మంచిదనే సామెత వుంది. కనుక వెళ్ళొస్తాను, ఏం రాధా" అంది సుశీల.

"మళ్ళీ వస్తానంటేనే వెళ్ళనిచ్చేది" అంది రాధ.

"అహా! వచ్చేనెల పదో తారీకున యీ వూరు రావాలి. అప్పుడు మీరు వద్దన్నా మకాం మీ యింట్లోనే" అంది సుశీల.

రాధ తృప్తిగా నవ్వింది.

డ్రైవరు కారు తీసుకువచ్చాడు. సుశీల కారులో ఎక్కింది. "వస్తాను" అంది మాకేసి చూస్తూ.

"వచ్చేనెల పదవతేదీ తప్పక రావాలి" అంది రాధ.

"ఆ" అంది సుశీల స్టార్టయిన కారు శబ్దాన్ని మించి అరుస్తూ.

కారులో సుశీలని నేనే దింపుదామను కున్నాను కానీ, ధైర్యం లేకపోయింది. కారు కదిలేదాకా యిద్దరం అలాగే నిలబడ్డాము లోపలకువస్తూ "ఆవిడ ఎంత మంచిదండీ - ఎంతమంచి మనస్సో-మనిషిని చూడగానే ఒక పవిత్రమూర్తిని చూచినట్టు అనిపించింది. నిజంగా మనుష్యుల్లో దేవతలుంటారనడానికి ఆవిడే తార్కాణం" అంది రాధ.

"ఏం?" అన్నాను నేను హాల్లో కుర్చీలో కూర్చుంటూ.

"ఏమో! అలా అనిపించింది. ఒక మనిషిని చూడగానే మంచిభావం, మరో మనిషిని చూడగానే చెడ్డభావం కలుగుతుందంటారుకదా-అలాగే నా కావిణ్ణి చూడగానే అలా అనిపించింది. నిజంగా ఆ తెల్లటి దుస్తుల్లో ఆవిడ కారుదిగేసరికి మూర్తీభవించిన పవిత్రతలా కనుపించింది" అంది రాధ వుపన్యాసధోరణిలో.

రాధది కాస్త వుపన్యాస ధోరణిలో మాట్లాడే స్వభావమే అయినా చాలామటుకు నిజం వుంటుందని లోగడ చాలాసార్లు నేను గ్రహించిన విషయమే!

''ఏమిటాలోచిస్తున్నారు? ఏం మీకు నే నన్నమాటలు నచ్చలేదా'' అంటూ రాధ నాభుజం పట్టుకుని కుదిపింది.

''ఏంలేదు. నువ్వు ఏది చెప్పినా అది నూరుపాళ్ళు సత్యం-నచ్చకపోవడమేమిటి? సుశీల నిజంగా దేవతామూర్తి! ఆమె మనస్సే అంత!'' అన్నాను నేను రాధజడ చేత్తో పట్టుకుంటూ.


''మీకున్నకోపం కాస్త తగ్గితే మీరూ అంతే! మీ అంత మంచివారెవరూవుండరు'' అంది.

నిజమే!

నిజమే! కోపం తగ్గాలి అనుకున్నాను నిశ్చయంగా.

000

జ్యోతి



భగవంతం

స్థిరమైన నడవడితోబాటు స్థిరమైన ఇరుగు పొరుగు సఖ్యత 'జనుల కందరకు వలయు' అని పూరాగా నమ్మినవాళ్ళలో భగవంతం ఒకడు.

స్థిరమైన నడవడీ మాట సిగ్గోసిరి-అది అంత సులభంగా కనిపించలా. కాని స్థిరం మాట ఎలావున్నా ఇంతకాలం ఇల్లు లేక పోవటంవల్ల భగవంతానికి ఇరుగుపొరుగు వ్యక్తులకే అవకాశం లేకుండాపోయింది. ఇప్పుడా లోటు తీరింది కనక అటునుంచి నరుక్కురావటానికి ఉపక్రమించాడు భగవంతం!

కొత్తఇంట్లో చేరిన మర్నాడే భగవంతం పై భాగంలోని సంగమేశ్వరంగారి భాగంలోకి వెళ్ళి తనను పరిచయం చేసుకున్నాడు. కాసేపు కబుర్లుచెప్పి, ఇంకా పై భాగంలో వున్న సౌభాగ్యంగారి భాగంలోకికూడా ప్రవేశించి అలాగే చేశాడు. పైనుంచి చూస్తే చుట్టూ వాతావరణం ఎంచక్కాగానో కనిపించింది. పై భాగం అద్దె ఎక్కువయినా అలాంటిచోట వుండే జీవితం చాలా హాయిగా వుంటుందికదా అని భగవంతం మనస్సు ఉవ్విళ్లూరింది. కాని ఇప్పటికే ఇంతయింది!

క్రిందికి వచ్చి తన భాగంలోకి అడుగు పెట్టగానే శ్రీమతి "మీకోసం పై సంగమేశ్వరంగారు కాబోలు వచ్చారు!" అంది.

"దేనికట?"

"ఇప్పుడే మీరు వారిని చూట్టానికి వెళ్ళారటగా-అందుకని మిమ్మల్ని చూట్టానికి ఆయన వచ్చారట! మీ రింట్లో చేరనగానే బయటివారు బయటినించే వెళ్ళిపోయారు!" అంది గృహలక్ష్మి.

ఎలాగయినా మొగవాళ్ళకన్నా ఆడవాళ్ళు సులభంగా, త్వరగా పరిచయం చేసుకుంటారు. పై భాగాల ఆడవాళ్ళ రాకపోకలు తమ ఇంటికి బాగానే వుంటున్నట్టు గ్రహించాడు భగవంతం రెండుమూడు రోజుల్లోనే.

ఓనాడు భగవంతం బయటికి పోబోతుండగా వీధిలోంచి వస్తూ మెట్లెక్కిపోతున్న సంగమేశ్వరం ఆగి "చూడండీ! ఈ రాత్రికి మా ఇంట్లో భోంచేద్దాం!" అని భగవంతాన్ని ఆహ్వానించాడు.

"ఏమిటి విశేషం?" అన్నాడు భగవంతం.

"ఏదో ఒక చోటవున్నాంగా - కలిసి భోంచేద్దాం!" అన్నాడు సంగమేశ్వరంగారు. అంతవరకూ పరాయిఇళ్ళల్లో శుభసమయాలప్పుడూ, అయినవారి ఇళ్ళల్లో అశుభ సమయాలప్పుడూకూడా భోజనానికి వెళ్ళటమే అలవాటుపడిన భగవంతానికి ఇలాటి విందులు చాలా కొత్త.

"బాగానేవుంది. కాని శనివారం రాత్రి నేను భోంచెయ్యనే!" అన్నాడు భగవంతం. సంగమేశ్వరంగారు 'పీ నామ రూపములకు నిత్యజాయ మంగళం' అని పాడినంత జోరుగా మూడు సెకనులు మాట్లాడి-బుంగమూతితో మెట్లెక్కుతూ నిష్క్రమించాడేకాని "పోనీ రేపు (ఆదివారం) కాకపోతే మీకెప్పుడు వీలవుతుందో చెప్పండి-అప్పుడే భోంచేద్దాం!" అనన్నా అనలేదు. ఇది మరొక పరీక్ష కాకపోతే మరేమిటి?

దేవతలు మానవులమల్లే వచ్చి ఒకరి త్యాగం, ప్రేమ, శౌర్యం, దాతృత్వంలాటివి పరీక్షించటం, వాడు లేక అది ఆపరీక్షలో నెగ్గటం, తర్వాత ఆ దేవతలు తమ నిజ స్వరూపాలు చూపో లేక తమ అసలుపేర్లు చెప్పో ఆ దౌర్భాగ్యుడిని-లేక ఆ నిర్భాగ్యురాలిని ఆశీర్వదించటం, ఆతర్వాత అతని కథ శుభాంతంగా కంచికివెళ్ళటం మొదలైనవి లేక ఆమె జీవితం మంగళప్రదమైనట్టు పురాణాల్లో వ్రాసి వుండటం, ఎవరో చదివి చెప్పితే తాను విని వుండటం భగవంతానికి కొత్తకాదు. కాని తనొక సామాన్యమానవుడు-తన జీవితం పురాణం కాదుకదా?

గృహాన్వేషణోద్యమంలో భగవంతం వూళ్ళో అన్నిప్రాంతాల్లో తలదాచుకుంటూ కాలుకాలిన పిల్లిలా తిరగటం సహించలేక అతని సతి, ఇల్లు దొరికేవరకూ శనివారాల రాత్రిళ్ళు భోజనం చెయ్యనని మొక్కుకుంది - ఎవరికో, దేముడికే తెలియాలి! వారంలో ఒకపూట అన్నం మానెయ్యటం ఆరోగ్యమే కాని శనివారాల రాత్రిళ్ళు పస్తున్నంతమాత్రాన ఇల్లు దొరకదు అని భగవంతం తన భార్యకు హితోపదేశం చేసినా ఆవిడ వినకపోయేసరికి "పీఖర్మ!" అని వూరుకున్నాడు. రెండు పౌర్ణమిలు, మూడు అమావాస్యలో లేక మూడు అమావాస్యలు రెండు పౌర్ణమీలో దాటిం తర్వాత సహధర్మచారిణి "నేను శనివారాలు భోజనం మానేస్తే లాభంలేదు - మీరూ మానాలి!" అని పెదరావూరు పేచీపెట్టింది. పెదరావూరు పేచీ అంటే తుని తగవు తాతలాటిదని భగవంతానికి బాగా తెలుసు పాపం! భగవంతానికి గుండెదడ పుట్టింది. మరి అతనికి అభోజనం అసలు పడదు! ప్రియురాలు అతని గుండెదగ్గిర చెవిపెట్టి వినటం బాగానేవుంది కాని "వొట్టికబుర్లు; గుండెదడాలేదు - గిడాలేదు!" అనటం అతనికేం మనస్కరించలేదు.

మునిసిపాలిటీవాళ్ళకు చిక్కిన కుక్కయినా తప్పించుకోవటం కద్దు. కాని భగవంతం ప్రేయసి రుసరుసలు, క్రోధవీక్షణాలు, పరుషవాక్కులు, ముఖావరోహణాలు తప్పించుకోలేక పోయాడు. ఉత్తమా ఇల్లాలు నుసురుపెట్టటం దేనికని అతడు మనసా వాచా దిగజారిపోతున్న సమయంలో అలివేణి "మీరూ శనివారాల రాత్రిళ్ళు భోజనం మానేస్తేనే కాని చస్తే నే బతికివుండగా మనకు ఇల్లు దొరకదు!" అని సమయోచితంగా పోసిన పిరికిమందు వజ్రాయుధమై కర్మణా చేసింది. ఆ దంపతులు శనివారాల రాత్రిళ్ళు నిరాహారదీక్ష పూనారు.

కాని అలా శనివారాలుంటున్న ద్వైతులు ఆ దీక్ష సమయంలో బాదంహల్వా, జీడిపప్పు, కిస్మిస్ చేర్చిన పాలు, రవ్వ కేసరి ఇత్యాది తగు మోతాదులలో చపాయించటం ఎరిగిన భగవంతం అర్ధాంగి నుద్దేశించి ఓసారి కనుబొమలు ఎగరవేశాడు. ఆమె అపార్థం చేసుకుందని తెలియగానే అలాటి అనవాయితీని పెళ్ళానికి చెప్పాడు.

"అలాటి వాళ్ళంతా పరాయి వూళ్ళల్లో బంధువు లింటికి వెళ్ళినప్పుడు, లేక కొంతమంది కలిసి సహకార భోజన సదుపాయాలు సమకూర్చుకోవాలిసి వచ్చినప్పుడు లేక, మరియు తమకంటె క్రింది అంతస్తులో వున్నవారిపట్ల చూపే సానుభూతికాని మరేం కాదు!" అని తాపీగా పెదిమ విరిచింది శ్రీమతి భగవంతం. అయితే భర్త ఖిన్న వదనం చూసి రెండురోజులయిన తర్వాత ఆయనకుమాత్రం "ఉప్మా" వరకు అనుమతి ఇచ్చింది.

"ఉప్మాలేంది ఏం బాగుంటాయి పెసరట్లు?" అన్నాడు భర్త.

కొడవటిగంటి కృష్ణమూర్తి

"పెనరట్లేమిటి?" అని ఆశ్చర్య పోయింది భార్య.

"ఆదేలే! పెసరట్లు లేంది ఉప్మా బాగుండదే!" అన్నాడు భర్త.

"సయించకపోతే మానెయ్యండి!" అన్నట్టుగా వినిపించింది ఆలి వాణి. పేచీ మొనటికి రావటంచూసి "పోనీ ఉల్లిపాయలైనా ఆ ఉప్మాలో తగలెయ్యరాదూ?" అన్నాడు భగవంతం.

''ఇక్కడెవ్వరూ తగలెయ్యటానికి లేరు. పైగా శనివారం ఉల్లిపాయ అసలు ముట్టుకోరాదు.''


''పోనీ రెండు టొమేటోలన్నా వేస్తూ వుండు!'.

''మీ కన్నీ హోటలు మనసులు!'' అని తాళి కట్టించుకున్న కలికి ఎగతాళి చేసింది.

పండు టొమేటోలకాలం అయిపోయినా ఇల్లు వాసనేలేదు. హోమియోపతి చికిత్సా విధానంలో 'లక్ష పొటెన్సీ' వేసినట్టు భగవంతం భార్య ఉప్మాకూడా మగ్గూర్ చేసింది. అయినప్పటికీ ఇంటిశబ్దమే లేదు. అలా రెండు సంవత్సరాల శనివారాల రాత్రిళ్ళ ఉపవాసానంతరం కాటోలు భగవంతానికి ''ఇల్లు' అనేమాట కనిపించింది.

గాంధిచౌకు సమీపంలోని రెండవవీధిలో మొదటి ఇల్లయిన మూడంతస్తుల మేడలో ఎవరో క్రిందిభాగం ఖాళీచేసి పోతున్నారనీ ఆ క్రిందిభాగం అద్దెకు దొరకటానికి అవకాశం వుందనీ అనుకోని అదృష్టం కలిసి రావటంతో పక్షంరోజుల క్రిందట భగవంతానికి కబురు వచ్చింది. కష్టపడి సంపాదించుకున్న ఉద్యోగం వదులుకుని. వుంటూన్న వూరినుంచి వెళ్ళిపోవటమా, మానటమా అని సతమతమవుతున్న భగవంతం వాకబు చేయగా 'కొన్నివేలు' కనక గృహకట్నం' దాఖలు చేసుకుంటే (వరకట్నం మల్లేనే గృహకట్నం ఓనిషేధం లాంటిదే. అయితే వరకట్నం యిచ్చేసిన వాళ్ళు, మగసంతతివుంటే, మళ్ళీవరకట్నం గుంజవచ్చు. గృహ కట్నానికి ఈ పేచీ, అదృష్టంలేదు)ఆ సదరు క్రిందిభాగం లభించగలదనీ తెలిసొచ్చి, బేరంలోకి దిగగా, గృహకట్నం కాక భగవంతం ఇదివరకు పెద్దమనిషి యిచ్చేస్తూ వచ్చిన దానికంటే నెల నెలా హెచ్చు అద్దె ముట్టచెప్పవలిసి వుంటుందనీ, అలా అర్పించుకోటానికి భగవంతం ఏనెల అయినా మోరాయించవచ్చును కనుక అతను మూడునెలల కొత్త అద్దె మొత్తం ముందే చెల్లించవలిసి వుంటుందనీ, ఏమయినా యావత్ వ్యవహారం అమీ తుమీ తేల్చుకోటానికి ముచ్చటగా మూడురోజుల గడువే వుందని హెచ్చరిక చేయబడినాడు. భగవంతం బెదిరిపోయి భార్యతో సంప్రతించాడు. ''శనివారాల మహాత్యం వృధా పోలేదు - ఇల్లు జారిపోనీయకండి!" అని ఆదేశం వచ్చింది. భగవంతం, గత్యంతరం లేక 'కాబూలీ వడ్డీ'మీద దాఋణంచేసి, ముడుపుచెల్లించాడు. వెంటనే తిథి వార నక్షత్రాలు చూసుకుని రాహుకాలం దాటిం తర్వాత గృహాన్వేషణ ఫలం స్వీకరించాడు.

ఇల్లు దొరికినా శ్రీమతి తానుమాత్రం ఇంకా శనివారా లుంటాననీ, ఇష్టమైతే శ్రీవారు మునుపటిలా 'అన్నం' తినవచ్చుననీ తిండిలో ఆంక్షను తొలగించటమేకాక ప్రమోషనుకూడా ఇచ్చింది. కాని ఎందు



వల్లనో భగవంతం భార్యతోనే పస్తువుంటున్నాడు. భగవంతం అలా ఇంకా శనివారా లుండటానికి కారణం ఆ ఇల్లు తమ ఇద్దరు పిల్లల స్కూలుకూ దగ్గర్లో వుండటం కావచ్చు అని ఫ్రాయిడ్ ప్రశిష్యు డెవడైనా చెప్పగలడు!

ఆడవాళ్ళ విషయం ఏమయినా, సంగమేశ్వరంగారి భోజనాహ్వానానంతర ధోరణి భగవంతానికి కష్టం కలిగించింది. భగవంతం 'ఇరుగుపొరుగు సఖ్యత ఉద్యమం' సంగమేశ్వరంగారి విషయంలో రంగుమారి ఆయన ఇప్పుడు దబదబా చప్పుడుచెయ్యకుండా మెట్లుదిగి పోతున్నాడు! స్నేహం పైవారితో చెయ్యాలి అని ఏదో పత్రికలో ఇదివరకే చదివివున్నవాడే భగవంతం. అందుకని సంగమేశ్వరంగారు పిలవగానే ఆ శనివారం రాత్రే 'అపుపోసన' ప్రారంభించి పైవారితో స్నేహం వగైరా పాటించివుంటే బాగుండేదా అని భార్యను సలహా అడిగాడు.

"ఇది మీ కింత క్లిష్టమైన సమస్య అయినప్పుడు పూర్వాపరాలు ఆలోచించి ఆనక్క చెపుతానని లౌక్యంగా సూచించలేక పోయారో? లేక మీ కంత దివ్యమైన ఆలోచన తట్టలేనా! ఉన్నమాట పుసుక్కున అనేస్తిరి. ఇహ ఈ గతజల సేతుబంధనం దేనికి? సంగమేశ్వరంగారు ఎందరిని ఎప్పుడు భోజనానికి పిలుస్తూవుంటాడోకాని అతగాడు పిలవగానే, పిలవబడిన ప్రతివాడూ వచ్చితీరాలిసిందే? ఎవరికైనా వీలుకాక తగిన కారణంవుండి రాలేకపోతే ఆయన అర్థంలేని అహం దెబ్బతినాలిసిందే."

భగవంతం తన ఇల్లాలి సినిమాధోరణి డైలాగుచూసి అదిరిపోయాడు. కొంచెం సేపయినతర్వాత భార్యమూడ్ మారివుండటం చూసి "పోనీ మనమే సంగమేశ్వరం గారిని భోజనానికి పిలిస్తే!" అన్నాడు భగవంతం.

భార్యకు పాతమూడ్ తిరిగి రాలేదుకాని "దేనికి?" అనిమాత్రం అడిగింది. దేనికి

అని అడిగితే మరి సమాధానం చెప్పటం కష్టమే! అవును దేనికి? 'ఇరుగు పొరుగు సఖ్యత' అని చెప్పితే అదీ సినిమా డైలాగ్ లాగే వుంటుంది. ఏ సమాధానం చెప్పకుండా భగవంతం రొకాయించటంచూసి ఆవిడ "సరే-మీ యిష్టం!" అంది.

పండగా పర్వమూ కాకుండాచూసి, అది వారం అని రూఢిచేసుకుని పైనున్న సంగమేశ్వరంగారిని ఆహ్వానించటానికి ఆయన భాగంలోకి పోబోతూ వీధిలోంచి వస్తూన్న ఆయన్నుచూసి, ఆగి ఆయన దగ్గిరికి రాగానే మెట్లదగ్గిరే ఆ రాత్రికి తన యింటికి భోజనానికి ఆహ్వానించాడు భగవంతం. 'ఎదురుపడితే పిలవటమా - ఇంటికొచ్చి పిలవటం మర్యాద' అన్న మొహంపెట్టాడు సంగమేశ్వరం. కాని వెంటనే తన అంగీకారాన్ని సూచించాడు. భగవంతానికొక పెద్ద సమస్య చాలా సులభంగా పరిష్కారమైపోయింది. ఇంట్లోకి వెళ్ళి ఆ శుభవార్త భార్యకు చెప్పాడు.

ఓ అరగంట గడిచిందేమో - ఎవరో తలుపుతట్టారు. తలుపుతీసిచూస్తే సౌభాగ్యంగారు!

"రండి - లోపలికి దయచెయ్యండి!" ఆయన్ను భగవంతం ఆహ్వానించాడు. సౌభాగ్యంగారు లోపలికి ప్రవేశించకుండా "చూడండీ! ఈరాత్రికి మీతో కలిసి భోం చెయ్యాలనివుంది. కులాసాగా కబుర్లు చెప్పుకుందాం! వస్తారా?" అన్నాడు సౌభాగ్యంగారు.

మళ్ళీ ఈ పరీక్షతో భగవంతం కాస్త బుర్ర అర క్షణంలో వేడెక్కిపోయింది. ఎలా అంగీకరించటం? ఎదురుగా వున్న, ఇంకా మేడమీదవున్న పెద్దమనిషి ఆయిన సౌభాగ్యంగారిని ఆహ్వానించకుండా ఆయన క్రిందభాగంలో వుంటున్న సంగమేశ్వరంగారిని ఆ రాత్రికే తాను భోజనానికి పిలిచాననైనా ఎలా చెప్పటం?

"మంచిదే - కాని ఈరాత్రికి వీలుపడదే మీకు వీలయినప్పుడు మరోసారి చూద్దాం!"

"మీయిష్టం!" అని వెనక్కి తిరిగైనా చూడకుండా - వీధిలోంచి వస్తూవుండటం వల్ల కాబోలు - మేడమీదికి వెళ్ళిపోయాడు సౌభాగ్యంగారు.

భగవంతం బుర్రకాస్తా పనిచెయ్యటం మానేసింది. పోనీ ఆ రాత్రికి సౌభాగ్యాన్ని కూడా ఆహ్వానిస్తే? ఆయన పిలిస్తే తను రావటానికి వీల్లేదనిచెప్పి ఇప్పుడు ఆయన్ను తను పిలవటం సుతలామూ గౌరవప్రదం కాదు. "మీకు వీలయినప్పుడు మరోసారి" అని తను అనటంలో కూడా అర్థంలేదు. ఆలోచిస్తే, ఆ రాత్రికి వీలయ్యే తనను ఆయన ఆహ్వానించాడు. ఆయన పిలిచిన క్షణంలోనే తనెందుకు రావటానికి వీల్లేదో చెప్పి,అప్పుడే ఆయన్నుతనుపిలవటంకూడా మర్యాద లక్షణంకాదు. 'ఏం పరీక్షలు!' అనుకుంటుండగా మళ్ళీ యెవరో తలుపు తట్టారు. తెరిచి చూస్తే సంగమేశ్వరంగారు!

"రండి!" అని పిలిచాడు భగవంతం. సంగమేశ్వరంగారు లోపలికి రాకుండానే "చూడండీ! ఈ రాత్రికి వీలుపడదేమోనండీ-మీకు వీలయినప్పుడు మరోసారి చూద్దాం. ఇక్కడ వుండేవాళ్ళమేగా - మరి ఈ రాత్రికే నన్ను సౌభాగ్యంగారు ఆహ్వానించారు!" అని వీధిలోకి నిష్క్రమించాడు. సౌభాగ్యంగారు భోజనానికి పిలవటం అదో మహా గొప్పఅయినట్టు. 'పైవారితో స్నేహం చెయ్యాలి' అని సంగమేశ్వరంగారుకూడా చదివివుండాలని భగవంతానికి చప్పున అర్థమైంది!

"ఇరుగు పొరుగు సఖ్యత మంచిదేకాని పైవారితో స్నేహం చెయ్యాలంటే చిక్కులున్నాయి-ఆ రెండూ కుదరవుకాబోలు!" అంటూ భగవంతం వంటఇంట్లోకి వచ్చి కూర్చుంటూ భార్యతో చెప్పాడు.

"ఏమిటీ?" అంది భార్య అర్థంకాక. భగవంతం చెప్పేలోగా మళ్ళీ ఎవరో తలుపు తట్టారు. వెధవ మహాపట్నాలూ - వెధవ తలుపులు తట్టటమూను! శ్రీమతి ముందు గదిలోకివెళ్ళి తలుపు తీసింది. ఎవరో లోపలికి వచ్చినట్టున్నారు. భగవంతం భార్య తలుపేసి మళ్ళీ వంట గదిలోకి వచ్చింది.

"ఎవరొచ్చారట?" అన్నాడు భగవంతం.

"ఆ! స్నానం చెయ్యటానికి సంగమేశ్వరంగారి భార్య. మంచి తీర్థం తీసుకుపోవటానికి సౌభాగ్యంగారి వంటావిడా!-రోజూ భాగోతమే! పొద్దున పదిదాటితే వాళ్ళ భాగాలకు నీళ్ళుఎక్కవుగా.అందుకనే కామాలు పట్టివుండకోరుకూడాను!" అంది శ్రీమతి భగవంతం.

స్నానాలగదిలో నీళ్ళచప్పుడు స్పష్టంగా వినిపిస్తోనేవుంది భగవంతానికి. అదీ సంగతి! పైవాళ్ళ భోజనానికి పిలిచి, ప్రతిఫలంగా కామాలు, రోజూ నీళ్ళకువస్తూ తమతో ఇరుగు పొరుగు సఖ్యత-ప్రకటిస్తున్నారు. కాని ఆ మహావిద్య - పైవారితో స్నేహం చెయ్యటం-భగవంతానికే చేతకాకుండావుంది!

□□□

● "పదిరూపాయిలు కావాలి ఇస్తావా?"

"ఇదిగో. ఇందులో అయిదురూపాయిలు నువ్వుంచుకో."

"ఎందుకు?"


"నువ్వు నాకు అయిదు బాకీవుంటావు. నేను నీకు అయిదు బాకీ వుంటాను. మన బాకీ తీరిపోతుంది."

● వైద్యుడు: "రోజూ రెండుగంటలసేపు ఏకబిగిన గొంతెత్తి అరిస్తే ముసలితనంలో కూడా ఊపిరితిత్తుల బాధలేవీ రావు."

రోగి: "బహుశా ముసలితనం బాధలుకూడా వుండవు."

నేనెందుకు రాశాను?

తంబు




ఈ ప్రశ్న తలుచుకుంటే ఒకసారి మా అమ్మమ్మ - నేను సిగరెట్లు ధారాళంగా కాల్చేస్తున్నానని తెలుసుకొని "ఏరా అబ్బీ! నువ్వు సిగరెట్లు ఎందుకు కాలుస్తున్నావు?" అని నన్ను నిలేసి అడగడం జ్ఞాపకం వస్తోంది.

"అలవాటయిపోయింది కాబట్టి" అని సమాధానం చెప్పాను అమ్మమ్మకి.

"అసలు, ముందు నువ్వెందుకు కాల్చినట్టు?" అని నన్ను కాల్చుకుతింది మా అమ్మమ్మ.

"ఏమీ తోచక" అని చెప్పి" పోపీలే ఇంకెప్పుడూ కాల్చను" అనేసి తప్పించుకున్నాను అప్పుడుమాత్రం.



కానీ-"నే నెందుకు రాశాను?" అని ఇప్పుడు నన్ను నేను ప్రశ్నించుకుంటే- నన్ను నేను తప్పించుకోలేను కాబట్టి అసలు విషయం చెప్పేయాల్సివస్తోంది.

నా రచనా వ్యాసంగాన్ని మొట్టమొదట పద్యాలతోగాని, పాటలతోగాని, కథలతోగాని, కావ్యాలతోగాని, నవలలతోగాని, నాటకాలతోగాని ప్రారంభించలేదు.

నా భావాన్ని నా కొచ్చిన భాషలో అందంగా అమర్చవలసిన అవస్థకలిగి మొదటిసారిగా నేను రాసినది ఒక "ప్రేమలేఖ."

ఈ విషయం చెప్పేయడానికి నాకు కొంచెం సిగ్గేస్తున్నా, ఇదంత సిగ్గుచేటు విషయంకాదు కాబట్టి చెప్పేస్తున్నా.

నేను విజయనగరంలో బి. యస్ సి. చదువుతున్న రోజుల్లో - ఒక అమ్మాయిని ప్రేమించాను. (అంటే అంతకు ముందు ఎవర్నీ ప్రేమించలేదని కాదు. అదీకాక- ఆ తర్వాతకూడా చాలామందిని ప్రేమించానుకోండి. అది వేరేవిషయం.)


"ఆ అమ్మాయి నన్ను ప్రేమించిందా లేదా?" అని అనుమానం నాలో ఉన్నా, ముందు నేను ఆ అమ్మాయిని ప్రేమించినట్టు ఆమెకి తెలియచేయడం నా కర్తవ్యం కాబట్టి ఆ ప్రేమలేఖ రాయాల్సివచ్చింది.

అదే నేను ఒక ప్రయోజనం ఆశించి చేసిన మొట్టమొదటి రచన. అది నాకు సరిగ్గా జ్ఞాపకంలేదుగాని, దాని సారాంశం మటుకు-"ఇదిగో అమ్మాయ్! నేను నిన్ను చాలా ఇదిగా ప్రేమిస్తున్నా. నీ క్కూడా ఇష్టం అయితే నువ్వుకూడా ప్రేమించవచ్చు. నువ్వు నన్ను ప్రేమిద్దామనుకునేపక్షంలో నీ ఇష్టాన్ని తెలియచేయడానికి వీలుగా వచ్చే సోమవారం ఎడమ జడలో గులాబీ పువ్వులు పెట్టుకొని కాలేజీకి రావాలి."

ఈ ఉత్తరం అడుగున "చంద్రశేఖర్" అని నా సంతకం చెయ్యడానికి ధైర్యంచాలక, నాపేరు త్రిమూర్తుల్లో ఒక దేవుడిపేరనీ, నన్ను ఇంకా గుర్తుపట్టాలంటే ఆ దేవుడికి మెడలో పాము మొదలగునవి వుంటాయనీ రాశాను.

ఆ ఉత్తరాన్ని పోస్టు చెయ్యడానికి నాకు భయము, మరియు గుండెదడ మొదలగునవి కలిగి నా స్నేహితు డొకడికిచ్చి - వాడిని పోస్టు చెయ్యమన్నాను.

సదరు సోమవారంనాడు ఆ అమ్మాయి ఎడమజడలోనే, గులాబీపువ్వులే పెట్టుకుని వచ్చింది కాలేజీకి. నా ఆనందానికి అవధులు



లేక, నేను కాస్సేపు స్వర్గంలోవుండి వచ్చి నా రచన (ప్రేమలేఖ) ద్వారా యింత ప్రయోజనాన్ని సాధించగల్గినందుకు చాలా గర్వపడి, నేనేగాని కథలేగాని రాస్తే ఎంతమంది పాఠకులు అవి చదివి మెచ్చుకుంటారో అని సాయంత్రం అయ్యేలోగా ఒక కథ రాశాను.

ఇంతలో-నాచేత ఆ ప్రేమలేఖ పోస్టు చెయ్యవలసిందిగా పురమాయించబడిన నా స్నేహితుడువచ్చి తనక్కూడా అది పోస్టు చెయ్యడానికి ధైర్యం చాలకంలేదని ఆ ప్రేమలేఖ నాకు తిరిగి ఇచ్చేశాడు. నాకు తల తిరిగింది. నా ఆశాసౌధాలు గబ్రా - నేలమట్టంగా కూలిపోయాయి

పోనీలే ఈ కథ చదివి ఎలావుందో చెప్పమని ఆ కథ ఇచ్చాను. ఆ కథలో ఇతివృత్తం ఏమిటంటే-ఒక అబ్బాయి, ఒక అమ్మాయి వుంటారు. అబ్బాయి అబ్బాయి కాబట్టి- అమ్మాయి అమ్మాయి కాబట్టి ఒకళ్ళ నొకళ్ళు ప్రేమించుకుంటారు. చివరికి పెద్దలచే పెళ్ళి చేయించుకుంటారు. వాడు అది చదివి తిన్నగా నా కళ్ళలోకిచూసి "నీకు ఇంతకాలం ఇంగ్లీషే రాదనుకున్నాను. తెలుగుకూడా రాదన్న మాట!" అనేశాడు.

"ఐతే ఈ విషయం ఎవరితో చెప్పకు. నే కథ రాసిన సంగతి నీ కడుపులోనే దాచుకో. ఇంకెప్పుడూ ఇటువంటి తెలివి తక్కువ పనులు చెయ్యను'' అని వాడిని బ్రతిమాలి పంపేశాను.

కొన్నాళ్ళు పోయాక - విశాఖపట్నంలో 'లా' చదువుతున్న మా అక్కకి, వృత్తినే ఏమీ తోచక సరదాగా, నాలుగుపేజీల చిన్న సైజు పెద్ద ఉత్తరం ఒకటి రాశాను.

మా అక్క నాకు జవాబురాస్తూ నేరాసిన వుత్తరాన్ని వాళ్ళ హాస్టల్లోవున్న మరి కొందరు అమ్మాయిలుకూడా చదివారని, చాలా సంతోషించారని రాసింది. నా ఉత్తరం అంతమందికి ఆనందం చేకూర్చడం నాకు చాల గర్వంగాతోచింది. అందులోనూ "అమ్మాయిలు'' నా వుత్తరాన్ని అంత పొగడడంతో నేను పొంగిపోయాను. (కొత్తగా మీసాలొస్తున్న రోజులు కాబట్టి) కొన్నాళ్ళు పోయాక, ఇంకో పెద్ద వుత్తరం ఇంకొంచెం హాస్యంగా రాశాను మా అక్కకి. మళ్ళీ అక్కడ అందరూ మెచ్చుకున్నారట! నా ఆనందం, గర్వం మరో మెట్టు ఎక్కాయి.

ఇలా వుండగా నా బి. యస్‌సి. పరీక్ష వన్సుమోర్‌గా పోవడం, మా నాన్నగారికి రాజమండ్రీ నుంచి తిరుపతి బదిలీకావడం జరిగాయి. నేను తిన్నగా తిరుపతి వెళ్ళి, అందరూ పరీక్ష ప్యాసయితే గుండు చేయించుకుంటారు కాబట్టి, నా ప్రత్యేకత నిలబెట్టుకోడం కోసం పరీక్ష పోయిన శుభ సమయంలో గుండు చేయించుకున్నాను.

పరీక్ష పోయి, గుండు చేయించుకున్న నన్నుచూసి మా నాన్నగారు - భర్తలాంటి



పరీక్షపోయినందుకు గుండుకూడా చేయించుకున్న నేను అచ్చంగా విడోలాగా వున్నానని మెచ్చుకున్నారు. నాకు వుడుకు మోత్తనం వచ్చింది.

"గుండు అందంగా వుండదా? అదీకాక పరీక్ష పోయినవాడంటే అందరికీ ఎందుకింత లోకువ" అని నాకు అనిపించి-ఎలాగైనాసరే గుండు అందమైనది, పరీక్షలు పోవడం చాలా గొప్పవిషయం అని నిరూపించాలని అలాగే ఆలోచించడం ప్రారంభించాను.

రెండురోజులు అలాగే ఆలోచించి-మూడో రోజుని, రాజమండ్రీలో వున్న మా అమ్మమ్మకి ఒక వుత్తరం రాశాను.

అందులో నా గుండును వర్ణించి, అటువంటి అందమైన గుండు చాలా అరుదని, అందం అంటే అదేనని చెబుతూ నాల్గుపేజీల వుత్తరం రాశాను.

"పరీక్షలు అంటే ఏమిటి? ఎవరు కనిపెట్టారివి? అవి ఎందుకు పోతాయి? పరీక్ష పోయినంతమాత్రాన ఆ పోగొట్టుకున్నవాణ్ణి అందరూ చులకనగా ఎందుకు చూస్తారు? పరీక్ష పోయినవాడే ఎందుకు గొప్పవాడు కాకూడదు? ఇవ్వ డున్న గొప్పగొప్పవాళ్ళు పరీక్షలు ఒకప్పుడు

పోలేదా?-కాబట్టి ఏమిటీ అన్యాయం? పరీక్ష పోయినవాడిని ప్రశంసించాలి, వాడి విలువ గుర్తించాలి." అంటూ "పరీక్ష తప్పిన పట్టభద్రులు" అని అరవైపేజీల నోట్సు పుస్తకం ఒకటి రాశాను.

ఎట్టకేలకు, ఆర్నెల్లకి నేను బి. యస్ సి. పాసవడం జరిగింది. పరీక్ష ప్యాసయి పోయానుకాబట్టి ఫేలయినవాళ్ళమీద సానుభూతి కొంచెం తగ్గి "పరీక్ష తప్పిన పట్టభద్రుల" గురించి అట్టే పట్టించుకోలేదు.

తర్వాత-నా అదృష్టంకొద్దీ (లేక- మా వాడు అన్నట్టు ప్రజల దురదృష్టంకొద్దీ) నాకు మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది.

కొత్తగా కాలేజీలో చేరినవాళ్ళని సీనియర్ స్టూడెంట్లు ఏడిపించడం ఆనవాయితీ కదా! ఆ ఆనవాయితీకోసం నన్ను కూడా సీనియర్స్ ఏడిపించారు. కానీ నేను ఏడవ లేదు. అందుకని సీనియర్ అబ్బాయిలంతా కలిసి నన్ను అమ్మాయిల దగ్గరికి పంపించారు.

పదిమంది సీనియర్ అమ్మాయిలముందు ముద్దాయిలాగ చేతులు కట్టుకుని నిలబడ్డాను.



ఆరడుగులపొడుగున్న నన్ను ఆ అమ్మాయిలంతా కలిసి అడ్డమైన ప్రశ్నలు వేశారు. ఏవేవో అన్నారు. అన్నీ పడ్డాను. పైగా - "సార్టోరియస్" అని సన్నగా పొడుగ్గావుండే ఒక "మసిల్" (Muscle)కాలూకుపేరొకటి నాకు "నిక్‌నేమ్"గా పెట్టేరు. మొత్తానికి కాలక్షేపం బాగానే వుంది కాని - ఆఖరికి అమ్మాయిలు కూడా నన్ను అల్లరిచేసి అవమానించారే అనే బాధ, కసి నాలో ఎక్కువయ్యాయి.

ఏమైతే అయిందని కథ రాసేశాను. అందులో నన్ను ఏడిపించిన - కీచుగొంతుక అమ్మాయి, పళ్ళు జడ అమ్మాయి, పిల్లి కళ్ళ అమ్మాయి, తిప్పుకునే అమ్మాయి. రావణాసురుడి చెల్లెల్లాంటి అమ్మాయి - వీళ్ళందర్నీ వరసగా నా కసితీరా వర్ణించి, పైగా వాళ్ళు నాకు పెట్టిన 'సార్టోరియస్' అనే నిక్‌నేమ్‌నే, ఆ కథకి నా పెన్‌నేమ్‌గా పెట్టుకున్నాను. అది మా ఆంధ్రా మెడికల్ కాలేజీ మేగజైనులో అచ్చు అయింది. అచ్చు అయిన నా మొదటికథ అదే!

ఆ కథని అబ్బాయిలంతా మెచ్చుకున్నారు. అది చూసి అమ్మాయిలంతా ఉడుక్కున్నారు. 'నేనూ ఓ కథకుణ్ణి అయ్యాన'నే దానికంటే-నా ఆశయం నెరవేరిందనే తృప్తి ఎక్కువ లభించింది నాకు.


తర్వాత - కొంచెం జరిగినది జరిగినట్టు ఇంకో కథ రాశాను అందులో కూడా కాలేజీ అబ్బాయిలకి కావాల్సిన సాహిత్యం వుంది కాబోలు - అందరూ మెచ్చుకున్నారు. (అమ్మాయిలు తప్ప.)

అలాగే మా కాలేజీ మేగజీన్‌లో నేనే కథ రాసినా అమ్మాయిలు మెచ్చుకునేవారు కాదు. నా మనసులో ఏదో వెలితి మిగిలి నట్టు నాకు అనిపిస్తూ వుండేది అమ్మాయి లంతా ఇలా కుట్రచేసినట్టు కట్ట కట్టుకుని నా కథని మెచ్చుకోకపోవడం యెందుకో నాకు అర్థం కాలేదు.

ఇది ఇట్లుండగా - నేను వున్నట్టుండి ఓరోజున ప్రేమలో పడ్డాను ('అది ఎన్నో సారి?" అని మీరు అడక్కండి మరి) నిజంగా, అచ్చంగా, ముమ్మాటికీ. ఎల్లప్పటికీ పడ్డాను ప్రేమలో —

నాకు స్వతహాగా చాలా బిడియం. అటువంటివాడిని ఎందుకిందపనికట్టుకుని ప్రేమలో పడవుతున్నానో అని నాకే అనుమానంగా వుండేది. ఆతర్వాత తెల్సింది అదే. నిసరైన ప్రేమ అని!

నా నిష్కార్సయిన ప్రేమకి నిదర్శనంగా నాకు ఏదో 'మైకం' లాంటిది కమ్మింది. ఆ మైకంలో వుండి ఆ అమ్మాయిని రాణీగాను, నన్ను రాజుగాను వూహించుకుంటూ కలలు కనేవాడిని. అటువంటి కలల్లో ఒకటి జ్ఞాపకం తెచ్చుకుని మరో కథ రాశాను.



ఆ కథ అచ్చయినప్పుడు ఆ అమ్మాయి నన్ను ఆపి "నా మీద కథ ఎందుకు రాశారు?" అని నిలేసి అడిగింది. ఏమైతే అయిందని-"నువ్వంటే నాకు చాలా ఇష్టం. పైగా మైకంకూడా కమ్మింది" అని కొంచెం కంగారుపడ్డాను.

"కష్టపడి కథరాసే బదులు తిన్నగా నాకే ఈ విషయం చెప్పేస్తే నే నెంత సంతోషించేదాన్ని" అన్నట్టుగా ఆ అమ్మాయి చిర్నవ్వు నవ్వింది.

దానితో నాకు కొంచెం ధైర్యంవచ్చి "మరి నే నంటే నీక్కూడా యిష్టమేనా" అన్నట్టు ఆ అమ్మాయి కళ్ళల్లోకి చూశాను. "ఆ విషయం చెప్పాలంటే నేనుకూడా మీ మీద కథ రాయాలా?" అన్నట్టు చూసింది నాకేసి ఆ అమ్మాయి. మొత్తానికి కథ సుఖాంతం.

అప్పటినించి ఆ అమ్మాయే నా కథలకి ఇన్‌స్పిరేషన్ అయింది. దానితో నా మనసులో పేరుకు పోయిన బోలెడు తియ్యటి బాధ గూడ్సుబండిలా వరసగా అందంగా ఒక క్రమంలో పైకి వస్తూండేది. అటువంటి బాధని ఒకసారి రికార్డు చేశాను. అదో చిన్న గేయంలా తయారయింది. ఇదిగో సదరు గేయంలాంటిది:

పద్మా-ఇంకా ఇదిగా పిలవాలంటే పద్దూ!
నువ్వంటే నాకు ప్రాణం! ఓ నా
పద్దూ!
కావాలంటే చూడు! ఇదిగో నా
ప్రేమపద్దు,
నీ చిరునవ్వే నా హృదయానికి
సరిహద్దు!

నీ మాట నా మనసుకి ఒక ముద్దు
కష్టల విందైన వీనులకి అక్కర
లేదు దుద్దు
నీ చూపులముందు మరి తూపులైనా
రద్దు
నీవు లేని క్షణం నా గుండెకి ఒక
గుద్దు
బాకీ కాదిది, నీ హృది ఓపరి అప్పు
ఇద్దూ
నీవుతప్ప నాకి లోకంలో మరేమీ
వద్దు
ఆనంద బాష్పాలివి నీ అరచేతితో
అద్దు
నీ ప్రేమతో నా ఎదని ఇంకా
కొంచెం రుద్దు
నీ ప్రేమతో నిండి అవుతా కొంచెం
బొద్దు
ఏమైనా అణగదు నా అంతరంగంలో
సద్దు
ఇలా ఆలోచిస్తా నీకోసం, ఇంతలో
పోతుంది పొద్దు
నిజం! అలా ఆలోచించకపోవడం
బహుకద్దు
యతిప్రాసలకి చాకిరీచేసి అయ్యా
నొక ఎద్దు
ఇక లాభంలేదు, అయింది మెదడు
మొద్దు
నా నొసట సురేఖపై నా జీవితాన్ని
సరిదిద్దు
నే నంటే ప్రేముంటే వరుగు
వరుగున ఇటు రద్దూ
పద్దూ నా పద్దూ'

అయ్యా (లేక అమ్మా!) ఈవిధంగా చాలా రాసరాసి ఆ అమ్మాయి హృదయాన్ని గెల్చుకున్నాను. ఆమె హృదయ సామ్రాజ్యానికి చక్రవర్తి నయ్యాను. అలా అలా ఆ ప్రేమలో మునిగిపోయాను. నాపరీక్ష చెట్టు యెక్కేసింది.' మళ్ళీ గుండుచేయించుకున్నాను. పరీక్ష పోవడం గొప్ప అని. అందంగా వుంటుందని నాకు జ్ఞాపకం వచ్చింది. వాటిమీద నేను పూర్వం రాసినవి

● *కొత్తగా వచ్చిన టీచరు: "ఈ క్లాసులో శుద్ధ మొద్దులెవరన్నా వుంటే నుంచోండి. ముందే గుర్తుపెట్టుకుంటాను."*

రెండు నిమిషాలయినా ఎవరూ లేవకపోవడం చూసి ఒకడు లేచి నుంచున్నాడు.

టీచరు: నువ్వు శుద్ధ మొద్దువేనన్నమాట."

విద్యార్థి: "అది కాదండి. మరీ మీరొక్కరే నిలబడి వుంటడం బావుండదని ...."

తీసి చూశాను. వాటిని అందంగా అందరికీ అందించి ఆనందింప చెయ్యాలనుకున్నాను. కాబట్టి మామూలు పాఠకుడిని గురించి ఆలోచించడం మొదలుపెట్టాను.

ప్రపంచంలో ప్రతీవ్యక్తికీ ఏవేవో కష్టాలుంటాయి. ఎవరిబాధలు వాళ్ళవి. మనం కూడా ఏదో రాసి పాఠకుడుగార్ని బాధించడం నాకు ఇష్టంలేదు. మనతో కలిసి ఆయన్నికూడా బాధపడమనే ఐదులు. మన సంతోషం కొంచెం పంచుకోమంటే ఆయనకేమీ అభ్యంతరం వుండదేమో అనుకున్నాను. నావుద్దేశ్యంలో పాఠకుడుగారు ఒక చిన్న చక్రవర్తి. ఆయన సర్వజ్ఞుడు అనే ఆయన వుద్దేశం. మనంకూడా అవుననే ఒప్పుకోవాలి. ఆయన నీతి నేర్చుకొనడానికిగాని, దేశాన్ని మరమ్మత్తు చెయ్యడానికి గాని మన కథ చదవరు. ఆయన్ని మనం బాగుచెయ్యాల్సిన పనిలేదు. వారు బహుదొడ్డవారు. చాలా పెద్దమనిషి.

మరి ఆయనకి తీరుబడి వున్నప్పుడో, లేక ఏమీ తోచనప్పుడో ఆయన మన రచనకేసి చూస్తారు. అటువంటి సమయంలో ఆయనకి చిరాకు కల్గించడం, మన బాధలు చెప్పి ఆయన్ని బాధించడం అంత సబబు కాదు. పైగా మనం రాసింది వారు చదివి ఆనందించడమే మన పరమలక్ష్యం. కాబట్టి ఆయనకి ఏమాత్రం విసుగు కలిగినా మన రచన మన మొహానికేసి కొడతారు.

అందుకని, శ్రీ రాజావారికి పిలయినంత ఆహ్లాదం కల్గిస్తేనే వారు ప్రసన్నులౌతారు: హర్షిస్తారు. ఆయన కొంచెం ప్రసన్నులయ్యాక మన గోడు కొంచెం వెళ్ళబోసుకున్నా ఫరవాలేదు.

కాబట్టి పాఠకుడిని దృష్టిలో వుంచుకుని రాయడం మొదలుపెట్టాను. పడిన కష్టానికి ఫలితందక్కుతూనేవుంది. ఈపద్ధతికిట్టుబాటు అయి లాభసాటిగానేవుంది. మనం రాసిన దానికి నిర్ణయాధికారి పాఠకుడే. మనం ఏది రాసినా పాఠకుడికోసమే. "పాఠకుడికి జై" అనుకుని మనం రాయడం మొదలుపెడితే పాఠకుడు కూడా కొన్నిరోజులు పోయాక "రచయితకీ జై" అనొచ్చు. అంతే —

□□□

["నే నెందుకు రాశాను?" అనే శీర్షికతో విశాఖజిల్లా రచయితల సంఘంవారు తమ సభ్యులచేత వ్రాయించి ఒక సమావేశంలో చదివింపించిన సందర్భంలో శ్రీ "తంబు" చదివిన ప్రసంగ వ్యాసం.]

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని. అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలని కూడా మా విజ్ఞప్తి.

— మేనేజింగ్ ఎడిటర్.



సెక్రటరీ

యద్దనపూడి సులోచనారాణి

(గత సంచిక తరువాయి)

మొదట డాక్టరుగారు, కామేశ్వరమ్మగారు దిగిపోయారు. జయంతిని యింటి దగ్గర గబగబా తీసుకొచ్చి దింపేశాడు శివరామ్. మధ్యలో ఒక్క మాటగూడా మాట్లాడలేదు. జయంతి దిగిన తర్వాత వస్తానని చెప్పకుండానే జయంతి ఆ మాట చెప్పేందుకు అవకాశం యివ్వకుండానే వెళ్ళిపోయాడు. అతనంత హఠాత్తుగా మౌనంగా యెందుకయిపోయాడో జయంతికి అర్థంగాలేదు. బహుశా అనుకోకుండా ఆ స్నేహితుడన్న మాటవల్ల గావచ్చు జయంతికి నవ్వు వచ్చింది. రేపు శివరామ్ యింటికి భోజనానికి వెళ్ళిన అతనిమొహం యెలా వుంటుంది? ఇంతమందిలో శివరామ్ యెందుకో చాలా దగ్గరగా అనిపించాడు జయంతికి.

బట్టలు మార్చుకుని చీరెని మడతపెడుతుంటే శేఖరం మాటలు గుర్తొచ్చాయి. అసహ్యం వేసింది. అయినా, తనెంత బుద్ధి లేనిది. శేఖరం ప్రెజెంట్‌గా చీర పంపిస్తే తీసుకోవటం యేమిటి? సుమిత్రాదేవీ వాళ్ళ వాలకాన్నిబట్టి చూస్తే వాళ్ళకసలు యింతవరకూ తెలిసినట్టు లేదు. అదెలా సాధ్యం? జయంతి కదే అర్థం

గావటంలేదు. వాళ్ళ మాటలు, చూపులు గుర్తొస్తేనే వంటినిండా తేళ్ళు కుట్టినట్టు, జెర్రులు పాకినట్టు అనిపిస్తోంది. శేఖరం బంగారు పిచ్చుకయితే ఆ పిచ్చుక చుట్టూ విషవలయాలు వున్నాయట. మిష్టర్ వర్మ స్వరం జయంతి చెవుల్లో గుడ్లగూబలా అరుస్తోంది. శేఖరం బంగారు పిచ్చుకయితే తన కెందుకు? మట్టి గోరువంక అయితే మటుకు తనకేమిటి?

శేఖరానికి రేఖా రాణి తో పరిచయం, ప్రమీల నివ్వాలనుకోవటం, దీనికి రేఖారాణి వత్తాసు, ఏమిటిందతా? వీటన్నిటికీ దూరంగా నిలబడి తన వుద్యోగం తను చేసుకోలేదా? ఉహూ! వీలుగాదు. వాళ్ళమధ్య నిలబడితే, వాళ్ళతో సాంగత్యం వుంటే వీటన్నిటితో సంబంధంలేకపోయినా చుట్టుకుపోవాల్సిందే. ఇకనుంచి యిలాటి విందులకి, వినోదాలకి తనురానని స్పష్టంగాచెప్పాలి. తనవుద్యోగం వాళ్ళ సమస్యలతో పెనవేసుకుపోగూడదు. జయంతి దృఢంగా నిశ్చయం చేసుకుంది.

మర్నాడు జయంతి వెళ్ళేసరికి శేఖరం అప్పటికే తయారై బైటకు వెళ్ళే ప్రయత్నంలో వున్నట్టు బట్టలేసుకుని కూర్చుని రాసుకుంటున్నాడు. రాత్రి పొద్దుపోయిన తర్వాత పడుకున్నప్పుడు కలిగే అలసట గాని, బద్ధకంగాని అతని మొహం లో మచ్చుకి గూడాలేవు. నిన్నంతా విశ్రాంతి తీసుకుని రాత్రి వేళకి పడుకుని మంచినిద్ర పోయి లేచిన మనిషిలా వున్నాడు. జయంతి రాక అతన్ని డిస్టర్బ్ చెయ్యలేదు.

దాదాపు అరగంట అయిం తర్వాత, రాస్తూనే మధ్యలో ఆగి బెల్ నొక్కాడు. నాయర్ కాఫీ టిఫిన్ తెచ్చేలోపల రాయటం పూర్తిచేసి కాగితాలు ప్రక్కన పెట్టిలేచాడు.

"రాత్రి ఎలా వెళ్ళారు" అని అడిగాడు. అతని పిలుపులో మీరు అని మర్యాదవుట్టి పడితే మనిషి చికాకుగానైనాగాని, లేక కోపంగా గాని వున్నాడని అర్థం.

"శివరామ్ కారులో వెళ్ళాను."

"వెళ్ళేముందు వెడుతున్నాం అని తెలియ చెయ్యటం మర్యాద అనే సంగతి తెలియదూ."

"మీరు బిజీగా వున్నారు"

"ఓహో!" నాయర్ తెచ్చిపెట్టి వెళ్ళిన కాఫీ తీసుకుంటూ అన్నాడు. జయంతి మాట్లాడలేదు. ఇద్దరిమధ్య మౌనం ఆవరించింది. ఆ నిశ్శబ్దంలో బోలెడంత దూరం కన్పిస్తోంది.

"కాఫీ తీసుకోండి."

"వద్దు" ఈకాఫీ, టిఫిన్‌కూడా పూర్తిగా మానెయ్యాలని రాత్రి గట్టిగా నిశ్చయం చేసుకుంది జయంతి.

శేఖరం యింకోసారి తీసుకోమని చెప్ప లేదు. వెళ్ళబోయేముందు ఆగి "పనెక్కువ లేదు. మీయిష్టం వచ్చినప్పుడు వెళ్ళిపోవచ్చు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఎందుకో అతని మొహంలో కోపం స్పష్టంగా కనిపిస్తోంది.

ఒకసారి నువ్వు-ఒకసారి మీరు-యేమిటా పిలుపు? అసలు నిన్న డాక్టర్‌గారిముందు చీర విషయంలో చేసిన అవమానానికి, పార్టీ జరుగుతున్నప్పుడు హఠాత్తుగా తనను మర్చిపోయినందుకు సంజాయిషీ అడగవలసింది తను. పైనుంచి యెదురు యిదా? అతని ప్రతి మాటలో నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. ఏమిటది? బహుశా తనింకో

"సెక్రటరీ" సీరియల్-జరిగిన కథ

అనగనగా ఒక జయంతి. ఆమె కొక బామ్మ. జయంతికి లేకలేక ఒక ఉద్యోగం దొరుకుతుంది-"వనితావిహార్" అనే మహిళా సంఘం సెక్రటరీగా. ఆ ఉద్యోగంపై ఎన్నో ఆశలు, కలలు నిర్మించుకున్న జయంతి అక్కడి సభ్యురాళ్ళ సంకుచితత్వాన్ని ఏవగించుకుంటుంది. ముఖ్యంగా, ఒక సభ్యురాలి భర్త తనపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో రిజైన్ చేస్తుంది.

వనితావిహార్‌లోనేకాక, ఊళ్ళో కూడా గొప్ప పలుకుబడిగల రాజశేఖరం ఆమెకు తన వద్ద సెక్రటరీగా ఉద్యోగమిస్తాడు. అతడు అందగాడు, యువకుడు, ధనికుడు, మంచివాడు. తరువాత ఆమెకు పరిచయమైన వారు అదివరకు రాజశేఖరంవద్ద పనిచేసి మరొక మంచి ఉద్యోగంలోకి వెళ్ళిపోయిన శివరామ్, అతని స్నేహితుడు ప్రకాశం. వీ రిద్దరితోను, మరికొంతమంది స్నేహితురాళ్ళతోను ఆమె ఒకనాడు పిక్నిక్ వెడుతుంది. తిరిగి అర్ధరాత్రివేళ ప్రకాశం కారులో ఆమె తిరిగివస్తుండగా ఏదో చిన్న ప్రమాదం జరిగి, వారిద్దరిని పోలీసులు స్టేషనుకు తీసుకుపోయి రాజశేఖరానికి ఫోను చేస్తారు. జరిగినదానికి అత దేమంటాడో ననే భయంతో జయంతికి స్పృహ తప్పి నంత పని అవుతుంది.

అయితే, రాజశేఖరం పలుకుబడివల్ల ఆ గండం గడిచిపోతుంది. జయంతి ని, ప్రకాశాన్ని పోలీసులు విడిచిపెట్టేస్తారు.

ఆ తరువాత ఒకనాడు రష్యన్ నృత్య బృందంవారికి రాజశేఖరం విందుచేస్తాడు. ఆ విందు సందర్భంలో జయంతి తనను రాజశేఖరం అవమానించినట్టు బాధపడుతుంది. అతనికి ప్రమీల అనే మరొక యువతితో సంబంధం నిశ్చయమైందని తెలుస్తుంది. ఆమెతో అతడు చనువుగా వుండడం కూడా స్వయంగా చూస్తుంది. ఇక ఎక్కువ కాలం శేఖరంవద్ద సెక్రటరీగా పనిచేయడం కష్టమని జయంతి నిశ్చయించుకుంటుంది.

వుద్యోగం ప్రయత్నం చెయ్యటం లేదు గదాని. ఇంక ఈ వుద్యోగంమీద మోజుపడి పోతున్నాననిగాబోలు. ఛీ - ఛీ - యెక్కడి కక్కడే యేదో అవాంతరం. ఈ గొడవ లేవీ బామ్మ చెవిని పడకుండానే యెలాగో తను మెల్లగా యిందులోనుంచి తప్పుకుంటే నయమేమో అనిపించింది జయంతికి. మళ్ళీ తనమీద తనకే అసహ్యంవేసింది. తనసలు యెక్కడా నిలబడలేదు. ఏదీ కుదురుగా వుంచుకోలేదు. ఈ లోపం అసలు తనలోనే వుందేమో.

మర్నాడు జయంతి బట్టలేసుకుని బయలు దేరబోతుండగా "అమ్మాయీ! ఎక్కడి నుంచో వుత్తరం వచ్చిందే అమ్మా" అంటూ బామ్మగారు కవ రొకటి తెచ్చి యిచ్చింది. తనకి వుత్తరం రాసేవా ళ్ళెవ

రబ్బా అనుకుంటూ కవరు తీసిచూసింది. చూస్తూనే తెల్లబోయింది.

ఎప్పుడో వనితావిహార్‌లో చేరకముందు, అసలు వుద్యోగం అనేది ఒకటి దొరికితే చాలనిపించే రోజుల్లో సునందద్వారా యేదో ఆడపిల్లల స్కూలులో టీచర్ పోస్ట్ ఖాళీ వుందంటే అప్లికేషన్ పంపించింది. దానికిప్పుడు ఇంటర్వ్యూ. జయంతికి నవ్వాలో యేడవాలో తెలియలేదు. క్షణంసేపు ఆ వుత్తరం అక్కడ పారేసి వెళ్ళిపోవాలనిపించింది. మరుక్షణం మనసులో వివేకంలాటిది పట్టి ఆపి "నిన్ననేగా యింకో వుద్యోగం చూసుకోవాలి అనుకున్నావు. శేఖరం సెక్రటరీగా నీకు నిజంగా మోజులేకపోతే దీని కెందుకు ప్రయత్నం చెయ్యవు" అని ప్రశ్నించింది.

జయంతి ఆరోజు శేఖరందగ్గరకు వెళ్ళటం విరమించుకుని ఒంట్లో బాగాలేదని కారు తిప్పి పంపేసి సునంద యింటికి వెళ్ళింది. జయంతి అదృష్టమో, దురదృష్టమో యెప్పుడూ యే జన్మనాలేంది సునంద తీరుబడిగా కూర్చుని కుట్టుకుంటోంది.

జయంతిని చూస్తూనే ఇంతమొహం చేసుకుని ఆహ్వానిస్తూ "రా! రా! ఇవాళ ఆఫీసులేదా! ఇంత యెండలో వచ్చావేం?" అంది.

"పనుండి వచ్చాను. నీ సలహా ఒకటి కావాలి" అంది జయంతి సునంద ప్రక్కన మంచంమీద కూలబడుతూ.

"నీ బుర్రలోనే ఆలోచనలు పట్టిపోయి నాయంటే ఇహ నా బుర్రేం పనిచేస్తుంది!"

"నిజంగా సీరియస్‌గా మాట్లాడాలని వచ్చాను."

"నేను సీరియస్‌గానే వున్నాను." అంది సునంద గంభీరంగా చూస్తూ.

జయంతి కవరుతీసి చూపిస్తూ ఇంటర్వ్యూ వచ్చిందని చెప్పింది.

"అయితే?" అర్థం గానట్టు చూసింది సునంద.

"నేను ఇంటర్వ్యూకి వెడతాను. నీకు ఆ హెడ్మిస్ట్రెస్ తెలుసునని చెప్పావు. నువ్వుగూడా రావాలి. నాకు తప్పకుండా యిమ్మని చెబుదువుగాని" అంది జయంతి.

ఎండలో రావటంమూలాన కందిపోయి వట్టున్నా జయంతిని చూస్తుంటే సునందకి జయంతి చెబుతున్నది తమాషాగాదని, నిజంగానేనని అనిపించింది.

"ఇప్పుడు నువ్వు చేసే వుద్యోగానికి యేమైంది?"

"ఇంకోటి చూసుకునేవరకేనని ఇదివరలో చెప్పలా?"

"చెప్పావనుకో." చేతిలో కుట్టు సామాను ప్రక్కన పెడుతూ,

"దాని కింతెవరూ రాలేదుగా" అంది.

"నే నుండగా యింకో మనిషి రావటం జరగదు."

"అంటే? యేమిటసలు విషయం చెప్పు. అతనేమైనా అన్నాడా?"

జయంతి మొహం తిప్పేసుకుంటూ "అతను నన్నెందుకంటాడు? నాకే యిష్టం లేదు" అంది.

క్షణంసేపు జయంతిని పరిశీలనగా చూసిన సునంద "ఇలా మాటిమాటికి నాకు బాగా లేదని మనసు మార్చుకోవటం, వున్నదాన్ని వదిలెయ్యటం మంచిదిగాదు జయంతీ! వనితావిహార్‌లో అంటే ఆ వాతావరణం నీకు సరిపడలేదు అనుకుందాం."

"ఇతనుగూడా వాళ్ళలో వాడే అన్న సంగతి మనం మర్చిపోగూడదు."

"అదే నేను అడిగేది. ఏదయినా అసభ్యంగా ప్రవర్తించాడా! అలాటి మనిషిలా కన్పించలేదే."

"బాబూ! నీ ప్రశ్నలకో నమస్కారం. నువ్వు నాతో వచ్చి ఆ హెడ్మిస్ట్రెస్‌కి చెబుతావా లేదా అది చెప్పు. లేకపోతే నే వెళ్ళిపోతాను."

"నువ్వు కారణం చెబితేగాని నేను రాను" మొండిగా అంది సునంద.

"సరే. అయితే, నే వస్తాను" జయంతి చటుక్కున లేచి వెళ్ళిపోవటానికి సిద్ధపడటంతో కంగారుపడిన సునంద చెయ్యి గట్టిగా పట్టుకుని "అరె! బాప్‌రే! యేమిటా కోపం? సరే, కారణం అడగనులే. వెళ్దాం! సరేనా" అంది సునంద.

జయంతి, సునంద యిద్దరూ వెళ్ళేసరికి హెడ్మిస్ట్రెస్ తీరికగానే వుంది. సునంద జయంతిని పరిచయం చేసింది. ఇంతకు ముందు ఆ క్లాసుకి టీచరుగా వెళ్ళినావిడ పురిటికని సెలవులో వెళ్ళి ప్రసవంలో యేదో జబ్బుచేసి చనిపోయిందిట. కాబట్టి మరో ట్రెయినింగ్ అయినావిడ వచ్చేవరకూ జయంతి కావుద్యోగం ఖాయంగానేవుంటుంది. ఈలోపల జయంతి గనక ట్రెయినింగ్ అయితే అది పర్మనెంట్ చేస్తామనిచెప్పింది. పరీక్షలు దగ్గరకొస్తున్నాయి కాబట్టి రేపటినుంచి వచ్చి జాయినవమని కోరింది ఆవిడ. జయంతి సరేనని వాగ్దానంచేసి లేచి వచ్చేసింది.

ఇద్దరూ హెడ్మిస్ట్రెస్ గదినుంచి బైటికొచ్చి వరండాదాటి వస్తుంటే కుడిప్రక్కగా ఓక్లాసుకి టీచర్ రానట్టుంది. అంతా గోలగా అరుస్తున్నారు. పెద్ద సంత జరుగుతున్నంత సందడిగావుంది. కొంతమంది సినిమాపాటలు పాడుతున్నారు. ఇంకా కొంతమంది బిగ్గరగా అరుస్తున్నారు. ఒకమ్మాయి బ్లాక్ బోర్డుదగ్గర నిలబడి యేదో గీస్తోంది.

"బాబోయ్! ఈ కోతుల్ని యెలా భరించటం?" అంది సునంద భయంగా. "నేర్చుకుంటాను. ఒకప్పుడు మనంగూడా అలా చేసినవాళ్ళమేగా" నీరసంగా అంది జయంతి. రేపటినుంచి తన జీవితంలో సగం యీ స్కూలు ఆవరణలో గడుస్తుంది కాబోలు. రేపు చేరగానే బామ్మకి చెప్పెయ్యచ్చు. ఇక్కడికి తనో విధంగా అదృష్టవంతురాలే. రాజశేఖరంవద్ద సెక్రటరీగా పనిచేస్తున్నట్టు బామ్మకి తెలియలేదు. వనితావిహార్ వాళ్ళు గూడా యేం గొడవచెయ్యలేదు.


సునందని యింటిదగ్గర వదిలేసి యింటికొచ్చేసరికి మధ్యాహ్నం తిరిగిపోయింది. వచ్చి ఒకగంట అయినా కాకముందే మళ్ళీ మొహం కడుక్కొని బట్టలు మార్చుకుంటున్న మనమరాలిని చూస్తూ "ఒంట్లో బాగాలేదని వేళ్ళాడపడుతూ మళ్ళీ యెక్కడికి" అంది బామ్మగారు.

"ఇప్పుడే వస్తా బామ్మా" అంది జయంతి జడవేసుకుంటూ. కడుపులో కుడివైపు నొప్పిగా వున్నమాట నిజమే. కాని, ఈ రోజు యీపూటే రాజశేఖరానికి రాజీనామా చీటీ యిచ్చేస్తే రేపు ఉదయంనుంచి వెళ్ళి స్కూలులో జాయినవచ్చు. రిజిగ్నేషన్‌తో పాటు ఆచీరగూడా యిచ్చేస్తే సరి. ఆచీర సంగతి గుర్తొస్తేనే జయంతి మొహం



జేవురిస్తోంది. అసలు తనెంత బుద్ధిలేనిది కాకపోతే యింకోళ్ళిచ్చిన చీర తీసుకోవటం యేమిటి. అది తీసుకుంది కాబట్టే అతను అలాఅనగలిగాడు. పోన్లే! తెలియక ఓపొరపాటు చేస్తే మళ్ళీ దాన్ని దిద్దుకునేమార్గం తోస్తే దిద్దుకోవచ్చుగా. చీర. యిచ్చేసి రాజీనామా కాగితంకూడా యిచ్చేసి ఒక నమస్కారం చెప్పి వచ్చేస్తుంది. తనలాటి వాళ్ళకి టీచర్ వుద్యోగాలే శ్రేష్ఠం. టీచర్ వుద్యోగం అంటే తనకి నచ్చదు నిజమే. కాని నచ్చని మనుష్యుల మధ్య అణుగడుక్కూ అసహ్యించుకుంటూ కాలం గడిపేకంటే యిది నయంగదూ!

చీరపెట్టిన అట్టపెట్టె తీసుకుని రెండు బస్సులు మారి, మూడు ఫర్లాంగుల దూరం నడిచి యెండకి కందిపోయిన మొహంతో, ఒంట్లో బాగుండని కారణంవల్ల కలిగిన నీరసంతో నుదుటినిండా పట్టిన చెమటతో జయంతి గేటులోపల అడుగుపెట్టింది. వాకిట్లో యింటిముందు యెవరిదో నీలం రంగులో డబుల్ షేడ్‌వున్న కారు ఆగివుంది. ఎవరో వచ్చినట్టున్నారు. ఒకవేళ రాజశేఖరానికి మాట్లాడే అవకాశం లేకపోతే తనేం చెయ్యాలి? జయంతికి హాల్లోగూడా యెవరూ కన్పించలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. హాలుదాటి లోపలికివస్తే లోపలగూడా యెవరూ వున్న శబ్దం విన్పించటం లేదు. వచ్చిన వాళ్ళెవరో శేఖరానికి ఆప్తులయి వుండాలి. అందుకే లోపలి గదుల్లో ఎక్కడో వున్నట్టున్నారు. తను వచ్చినట్టు అతనికి తెలియజేయటం యెలా? పరధ్యానగా నుదుటమీద పట్టిన చెమటని చీర కొంగుతో తుడుచుకుంటూ దగ్గరగా వేసివున్న ఒక గది తలుపుల్ని మెల్లిగా తోసింది. తోస్తూనే కొయ్యబారిపోయింది. గదిలో రాజశేఖరం పడక్కుర్చీలో వెనక్కువాలి పడుకున్నాడు.



అతని ప్రక్కగా చిన్న స్టూలుమీద కూర్చుని వున్న రేఖారాణి అతని గుండెల్లో తలదాచుకుంది. రేఖారాణి రెండుచేతులు జంటసర్పాల్లా శేఖరం మెడచుట్టూ పెనవేసుకుని వున్నాయి. హఠాత్తుగా కనపడిన యీ దృశ్యాన్ని ఎలా తీసుకోవాలో అర్థంగాక స్థాణువులా నిలబడిపోయిన జయంతి వూపిరిపీల్చటం, రెప్ప వేయటం రెండూ మర్చిపోయింది.

ఇటువైపు వీపు పెట్టి అతని గుండెల్లో తలదాచుకున్న రేఖారాణి జయంతిని గమనించలేదు. పరధ్యానగా యెటో చూస్తున్న శేఖరం తలుపు కొద్దిగా చప్పుడవటంతో

పులిక్కిపడి ఇటు తిరిగాడు. క్షణంలో సగంసేపు అతని కళ్ళు జయంతి కళ్ళతో కలిసినాయి. ఉన్నట్టుండి ఒక్కసారి గాలి పీల్చుకోవటం గుర్తొచ్చిన జయంతి గిరుక్కున వెనక్కి తిరిగి బైటకు పారిపోయింది.

ఇంటికి వెళ్ళటానికి గబగబా హాలుదాటి బైట వరండాలోకి వచ్చిందల్లా మళ్ళీ ఆగిపోయింది. తనెందుకు సిగ్గుపడాలి మధ్య? భయం యెందుకు? ఎలాగూ చూశాడు గబట్టి అతను బైటకి వచ్చేవరకూ వుండి యిచ్చి వెళ్ళిపోతేసరి. ఇప్పుడిలా తొందరపడి వెళ్ళిపోతే మళ్ళీ రావాల్సివస్తుంది. బోసి నాయర్‌గాని, కనీసం వాళ్ళ వాసుగాని కన్పించినాబాగుండును. వాళ్ళకయినా ఇచ్చేసి వెళ్ళిపోవచ్చు. ఉండటమా లేక వెళ్ళిపోవటమా అని తటపటాయిస్తూ అక్కడే స్తంభాన్నానుకుని నిలబడిపోయింది.

చేదుపదార్థం రుచి చూసిన దానిలా మనసంతా అసహ్యంతో మెలికలు తిరుగుతోంది. ఎంత సిగ్గులేనివాళ్ళు. బోసి లోపల తలుపు గడియ వేసుకుంటే యేగొడవా లేకపోయేది. తలుపు దగ్గరగా వేసినవాళ్ళకి గడియవేసే ఓపిక లేకపోయిందో, లేక అనవసరం అనుకున్నారో. అవును మరి ఆ ఓపికేవుంటే పైకి రాజశేఖరం పడగ్గదిలోకే వెళ్లేవాళ్లేమో! ఛీ - ఛీ - యెంత అసహ్యం అయిన మనుష్యులు. పెళ్ళయిన రేఖారాణి, పెద్దమనిషిలా కన్పించే రాజశేఖరం!

అసలీ ఆలోచనలన్నీ తనకెందుకు? ఎవళ్ళిష్టం వాళ్ళది.

ఈ రోజుల్లో యెవర్ని విమర్శించటానికి యెవరికి హక్కుందిగనక! ఇంతకీ తను వెళ్ళిపోవటమా వుండటమా? మనసు యేదీ నిర్ణయించుకోలేక పోతోంది. వెళ్తాం అని ఓ అడుగు ముందుకు వెయ్యబోతే. 'వద్దు వుండి ఇచ్చేసి వెడితే బాగుంటుం'దని పిస్తోంది. ఉందాం అంటే అతనిప్పుడు బైటకొస్తాడా అనే అనుమానం తోస్తోంది. రాజశేఖరం తన ఎదుటికి రావటానికి సిగ్గుపడితే?

"జయంతీ!" వెనకనుండి పేరు వినిపించటంతో చివ్వున వెనక్కి తిరిగింది. ఎదురుగుండా శేఖరం. అతని చూపులు స్థిరంగావున్నాయి. వాటిల్లో సిగ్గుగాని సంకోచంగాని నామమాత్రంగాగూడా కన్పించటంలేదు. క్షణంసేపు యిద్దరూ ఒకళ్ళ నొకళ్ళు సూటిగా చూసుకున్నారు.

"ఒంట్లో బాగాలేదని కారు పంపేసి ఇప్పుడెందుకు వచ్చావ్?"

అతని కంఠంగూడా మామూలుగానే వుంది. అందులో తడబాటుగాని, సందేహంగాని యేదీ లేదు.

"ఇవి యిచ్చెయ్యటానికి" చేతులోవి చూపిస్తూ అంది జయంతి. ఎంత సిగ్గులేని మనిషి. క్షణం క్రితం జరిగిన సంఘటన అసలు గుర్తులేనంత మామూలుగావున్నాడు. అతన్ని చూస్తూంటే తనకే సిగ్గేస్తోంది.

"యేమి టవి?" కనుబొమలు ముడుస్తూ అడిగాడు శేఖరం.

"ఆ పెట్టెలోది చీర. పైన కవర్లో నా రెజిగ్నేషన్."

క్షణంసేపు దాచి పట్టుకున్న వస్తువుల వైపు, మరోసారి జయంతివైపు చూశాడు శేఖరం.

"రెజిగ్నేషనా? ఎందుకు?



"నాకు వేరే వుద్యోగం దొరికింది"

జయంతికి యేడుపొచ్చినంత పనయింది. శేఖరానికి మెల్లగా తనకి వచ్చిన వుద్యోగాన్ని గురించి చెప్పి అందులో లాభాలు వివరించి మెల్లగా సెలవు తీసుకోవాలనుకుంది. అంతా తారుమారయింది. చూస్తుండగానే శేఖరం కళ్ళు యెర్రబడినాయి. కోపాన్ని సూచిస్తున్నట్టు పెదవులు బిగుసుకున్నాయి.

"ఎక్కడ జాబ్ దొరికింది? శివరామ్ దగ్గర స్టెనోగానా? లేక ప్రకాశం దగ్గర పి. ఎ. గానా?"

జయంతి మొహం కందగడ్డలామారింది. ఊపిరి బిగబట్టుకుని అలాగే నిలబడిపోయి శేఖరంవైపు చూడసాగింది.

రెండు క్షణాలసేపు జయంతిని కోపంగా చూసిన శేఖరం వెంటనే తెక్కపుచ్చుకుని

గబగబా లోపలికి లాక్కొచ్చి గదిలో కుర్చీలో కూలేసి "ఒక్క నిమిషంవుండు, ఇప్పుడే వస్తాను" అంటూ బైటికెళ్ళి పోయాడు. శేఖరం గుచ్చి పట్టుకున్న చోట జబ్బమీద యేర్పడిన నొప్పి చూసుకుంటూ జయంతి చేతిలో వస్తువులు టేబిల్ మీద పారేసి కుర్చీలోంచిలేచి ఇవతలకు వచ్చింది. ఎంత ధైర్యం! ఎంత సాహసం! మూర్ఖులకి బలంవుంటే రాక్షసులవుతారు. జయంతి పెదవులు రోషంతోనూ, కోపంతోనూ అదర సాగినాయి.

పది పదిహేను నిమిషాలయిం తర్వాత బైట కారు వెళ్ళిన శబ్దంవినిపించింది. రేఖారాణి వెళ్ళిపోయింది కాబోలు. జయంతి మళ్ళీ వూపిరి బిగబట్టుకుని శేఖరంకోసం ఎదురు చూడసాగింది.

కారు శబ్దం ఆగిపోయిన అయిదు నిమిషాలకి శేఖరం లోపలికి వచ్చాడు. వచ్చినవాడు వెంటనే జయంతి దగ్గరకి రాలేదు. కిటికీ దగ్గరగా వెళ్ళిపోయి బైటకు చూస్తూ నిలబడిపోయాడు.

అంత కోపంలోనూ, అంత అసహ్యం లోనూకూడా దూరంగా పొడుగ్గా, బలంగా, తీవిగా చెక్కిన శిల్పంలా వున్న అతని విగ్రహం, ఆ నిలబడిన తీరు, ప్రక్కనుంచి అందంగా దిద్దినట్టు కనిపిస్తున్న ఆ మొహాన్ని ఆసక్తిగా చూడకుండా వుండలేక పోయింది. ఇలాటి స్వభావంగల వ్యక్తులకి భగవంతుడు అందంగూడా ప్రసాదిస్తే దాన్ని వీళ్ళు ఆయుధంగా తీసుకుని ఆడవాళ్ళని నాశనం చెయ్యటానికి చూస్తారు.

ఉన్నట్టుండి హఠాత్తుగా వెనక్కి తిరిగిన శేఖరం జయంతి గబుక్కున చూపులు ప్రక్కకు తిప్పుకునే అవకాశం యివ్వకుండానే కళ్ళలోకి సూటిగాచూస్తూ "ఇప్పుడు చెప్పు" అన్నాడు.

"చెప్పేందు కేం లేదు. నా రెజిగ్నేషన్. ఈ చీర మీరు తీసుకుంటే నేను వెళ్ళి పోతాను."

"ఒకసారి కట్టుకున్న చీర తిరిగి యివ్వటం మర్యాదనేనా నీ వుద్దేశ్యం?"

"ఏది మర్యాదో యేది అమర్యాదో పాఠాలు నేర్చుకునేందుకు రాలేదు నేను. అసలు మీరు పంపిన చీర తీసుకోవటం నాది బుద్ధితక్కువ. తెలిసో తెలియకో చేసినదానికి ఫలితంగూడా చూశాను."

"మొన్న నే నన్నమాట పట్టుకుని ఈ రోజు రిజైన్ చేస్తున్నావుగదూ! నాకు తెలుసు నీ సంగతి. నే నారోజే నిన్ను క్షమాపణ అడగలేదా?"

"అవన్నీ యిప్పుడెందుకు లెండి. అవసరంలో ఆదుకుని సహాయంచేశారు. దానికి నా కృతజ్ఞత యెప్పుడూ వుంటుంది."

"నిజంగా నువ్వామాట మనస్ఫూర్తిగానే అనేటట్లయితే నువ్విలా అవసరంగా రిజైన్ చెయ్యనే చెయ్యవు. ఇప్పుడు నాకు వున్నట్టుండి మనిషి యెక్కడ దొరుకుతాడు! రేపు రాబోయే మీటింగ్స్‌కి నేనేంచెయ్యాలి! శివరామ్‌లాటి మనిషి దొరికేవరకూ నువ్వుండాలి అని నేను మొదటే చెప్పలేదూ?"

"నేనుండగా మీకలాటి మనిషి దొరకడు."

"అంటే నీ వుద్దేశ్యం?" శేఖరం దూరంగా నిలబడే రెట్టించాడు.

"ఏమీలేదు. నేను రిజైన్ చేస్తున్నానంతే."

ఈసారి శేఖరం దగ్గరగా వచ్చాడు.

"రిజైన్ చేయటానికి కారణం?"

"ప్రత్యేకంగామాస్తే యేమీలేదు. నాకు జాబ్ దొరికింది-అంతే."

"అదే! యెక్కడ. ఎవరిదగ్గర అని అడుగుతున్నాను."

"చెప్పను. అనవసరం" పళ్ళు బిగబట్టి అంది జయంతి.

శేఖరం చెయ్యి హఠాత్తుగా జయంతి చేతిని గట్టిగా పట్టుకుంది.

"ఎంత ధైర్యంనీకు! నా దగ్గర్నుంచి వెళ్ళిపోవటం అంత సులభమనే నీ వుద్దేశ్యం?"

"నా కింకో వుద్యోగం దొరికిన వెంటనే వెళ్ళిపోవచ్చునని మీరు వాగ్దానం చేశారు" శేఖరం చేతిని బలంగా విదిలించుకుంటూ అంది. కాని శేఖరం చెయ్యి వదలలేదు. మరింత బలంగా జయంతి చేతిని తనలో బిగించుకుంది.

"ఆ మాట నేను మర్చిపోయానంటే యిప్పుడు?"

జయంతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. గబుక్కున తలెత్తుతూ రోషంతోను, కోపంతోను, మెరుస్తున్న కళ్ళతో "అంటే! అంటే - మీప్లాన్ నాకిప్పుడు అర్థం అయింది. మీరు వాళ్ళలా కాదనుకున్నాను. నన్ను నా పరిస్థితుల్ని అర్థం చేసుకున్నారనుకున్నాను. పరిచయం యెక్కువ లేక పోయినా మీరు చూపించే చనువు సభ్యత గలవారనుకుని సహించాను. మనుష్యుల్ని అర్థం చేసుకునే సంస్కారం. విశాలత్వం వుంది కాబట్టి మీదగ్గర భయపడనక్కర్లేదనుకున్నా. కాని యిప్పుడు తెలుస్తోంది. మీరు వాళ్ళకంటే అసహ్యం. మనసులో యే వుద్దేశ్యం లేకపోతే మీరు అన్నమాట ప్రకారం నన్నెందుకు వెళ్ళిపోనివ్వరు? మీలాటి గోముఖవ్యాఘ్రాలని గుర్తుపట్టటం కష్టం."

"జయంతీ!" శేఖరం చప్పున చెయి వదిలేశాడు.

"నా కిప్పు డర్థమౌతోంది. నా మనసులో తెలిసినది చెప్పటానికి నాకేం భయం లేదు. నే నెందుకు మీకు భయపడాలి? నేను మీ డబ్బు చూసి ఆకర్షింపబడతా ననుకున్నారు. అది నేను మీ మనసు విశాలత్వంగా తీసుకున్నాను. మీ దయా ధర్మాలకి అలవాటు పడిపోతా ననుకున్నారు. అది దయాధర్మంగా తీసుకోలేను. సంస్కారంగా తీసుకున్నాను. మీ పేరు ప్రతిష్ఠలు చూసి మురిసిపోయి అందరిలా ఆకర్షింపబడి మీ చుట్టు తిరిగే శలభాల్లో ఒకదాన్ని అవుతాననుకున్నారు."

"తర్వాత?" ఇంకా అలాగే నిలబడి చూస్తూ అడిగాడు.

''నాకు మొదటినుంచి తెలుసు. వనితా విహార్‌లో మిమ్మల్ని గురించి అనేక రకాలుగా అనుకుంటుంటే నేను నమ్మలేదు. మీలో నాకా ఛాయలే కనిపించలేదు. కాని మీరు - మీరు." ఆయాసంతో అర సెకన్ సేపు ఆగింది జయంతి. శేఖరం మధ్యలో యేదో చెప్పబోయాడు. దానికి అవకాశం యివ్వకుండా మళ్ళీ తనే అందుకుంటూ,

''నా కీరోజు అర్థమైంది. పైకి పెద్ద మనుష్యులుగా కనిపించే మీరు - డబ్బు యెరగా పెట్టుకుని మీరు చేసే మోసాలు.

స్నేహం అనుకుంటూ మీరు యేర్పరుచుకునే నీచ సంబంధాలు—"

''జయంతీ" కోపంగా అరిచిన శేఖరం గబుక్కున జయంతి చెయ్యిపట్టి దగ్గరకు లాక్కున్నాడు. 'ఛీ' శేఖరం చెంప చెళ్ళుమంది. అంతే. ఇద్దరూ ఆగిపోయారు. గదిలో భయంకరమైన నిశ్శబ్దం యేర్పడింది. శేఖరం చూపుల్లో కన్పించిన భావానికి బైటనుంచి వస్తున్న గాలి, గదిలో ఆవరించుకున్న వెలుతురుకూడా వణికిపోయినాయి.

జయంతి చేతిని వదలకుండానే తీవ్రంగా చూస్తూ-

'' ఈ రోజు నీకేమైంది ? " అని అడిగాడు.

" మీ అసలు స్వరూపం తెలిసింది." అంది జయంతి.

శేఖరం చూపుల కేమాత్రం భయపడకుండా,

"అంటే - అంటే - నువ్వు చూసిన అందరిలాటివాడినే అంటావు."

"అంతకంటే హీనం అంటాను. వాళ్ళు కనీసం చూపుల్లో, చేష్టల్లో వ్యక్తం చేస్తారు. మాటల్లో బైటపడిపోతారు. అలాటి వాళ్ళని తేలికగా గుర్తుపట్టచ్చు. దూరంగావుండచ్చు. కాని మీలాటివాళ్ళని గుర్తుపట్టటం కష్టం. మీ నీచబుద్ధి తెలుసుకునే లోపలే - "

"నీ నోరు మూయించాలంటే ఇహ ఒకటేమార్గం." శేఖరం జయంతిని గబుక్కున దగ్గరకు లాక్కున్నాడు.

"ఛీ - వదులు. వదలమంటుంటే" జయంతి చెయ్యి మరోసారి శేఖరం చెంపని బలంగా తాకబోయింది. కాని ముందుగానే శేఖరం చెయ్యి జయంతి చేతిని అందుకుని తనతో గట్టిగా పెనవేసుకుంది. ఇంకో చెయ్యి వుక్కులా మారి భుజాలచుట్టునీ, పెనుగులాడకుండా బంధించింది.

"వదులు నీకొక్కడు చెప్పే-" జయంతి పెదవుల్లో మాటలు సరీగ్గా పూర్తికాకముందే శేఖరం పెదవులు నొక్కేశాయి.

మొదట మాటలు ఆపేయటానికి వెళ్ళిన శేఖరం పెదవులు అక్కడ హఠాత్తుగా మధురిమ లాటిది దొరకటంతో దాన్ని చవిచూస్తూ చాలాసేపు అలాగేవుండిపోయినాయి.

అనుకోకుండా జరిగిన ఈ సంఘటనతో జయంతికి మతిపోయినట్టయింది. సడెన్‌గా షాక్ తిన్న మనసు క్షణంసేపు దిమ్మెరపోయి ఆ వెంటనే మూగపోయింది. దాన్నుంచి కోలుకునేసరికి ఒంట్లోవున్న బలం అంతా హరించుకుపోయినట్టు, కనీసం నిలబడటానికి కూడా శక్తి మిగలనట్టు అన్పించింది. కళ్ళమీదకి మత్తులాటిది వచ్చి మంచుతెరలా ఆవరించుకుంది.

ఉన్నట్టుండి తన చేతుల్లో వదిలిపోయి వేళ్ళాడిపోతున్న జయంతినిచూసి కంగారుపడిన శేఖరం.

"జయంతీ-జయంతీ" అని ఆదుర్దాగా పిలిచాడు.

"కూర్చుంటాను" యెలాగో అంది జయంతి.

శేఖరం పెదవులు మరోసారి మన్నితంగా జయంతి పెదవుల్ని తాకి వదిలేశాయి.

" రా ! " అంటూ జయంతిని నడిపించుకొచ్చి కుర్చీలో కూర్చోపెట్టి ''మంచినీళ్ళు తాగుతావా " అని అడిగాడు.

వద్దన్నట్టు తలూపింది.

" నీకు తెలియని విషయాలని గురించి వూహించి యెదటివాళ్ళని రెచ్చగొట్టటం మంచిదిగాదు జయంతీ ఎన్నాళ్ళనుంచో కాపాడుకుంటూ వచ్చిన నిగ్రహాన్ని పాడుచేశావు." అతని కంఠం హఠాత్తుగా మృదువుగా మారిపోయింది. జేబులోంచి చేతిరుమాలు తీసి నుదుటమీద పట్టిన చెమటని తుడుస్తూ అన్నాడు.

'' ఈ గదిలో నేనిలా యెన్నోదాన్ని-" జయంతి హఠాత్తుగా చేతులమధ్య మొహం దాచుకుని వెక్కి వెక్కి యేడవసాగింది.

"జయంతీ" క్షణంసేపు అప్రతిభుడైపోయినట్టు ఆగిపోయిన శేఖరం వెంటనే మామూలుగా మారిపోయి జయంతి జుట్టుని సరిచేస్తూ "కొద్దిరోజులుపోతే నీకే తెలుస్తుంది. నే నిప్పుడు యేది చెప్పినా నీ చెవులకి అబద్ధంగా, మనసుకి వికృతంగా తోస్తుంది. వుండు-నాయర్‌ని కాఫీ తెమ్మని చెబుతాను."

"వద్దు-వద్దు. వెళ్ళిపోతాను ప్లీజ్" వెక్కిళ్ళమధ్య యెలాగో అంది.

"సరే ! నేను కారు బైటకు తీస్తాను." శేఖరం బైటకి వెళ్ళిపోయాడు.

జయంతి యేడుపు ఆపుకుని కొద్దిగా మామూలు మనిషిఅయి బైటకొచ్చేసరికి శేఖరం కారుతెచ్చి వరండాముందు ఆపాడు. పూర్తి చీకటిపడింది. లైట్లు వెలిగాయి.

"ప్యాకెట్ యేదీ ?" వట్టి చేతులతో వచ్చిన జయంతివైపు చూస్తూ అడిగాడు.

"లోపలుంది" జయంతి వచ్చి కారులో కూర్చుంది.

శేఖరం వెంటనే బలంగా హారన్ నొక్కాడు.

లోపలనుంచి వాసు, నాయరూ యిద్దరూ పరుగెత్తుకొచ్చారు.

"లోపల అమ్మాయి యేదో పెట్టి మర్చిపోయి వచ్చింది. తీసుకురా వాసూ." శేఖరం వాక్యం పూర్తికాకుండానే లోపలకి పరుగెత్తిన వాసు మరో నిమిషంలో పెట్టె, దానిమీదున్న కవరు తెచ్చి భద్రంగా యిచ్చాడు. జయంతి వాటిని చూడనట్టు అందుకోకుండా యెటో చూస్తూ కూర్చుని ఉంటే శేఖరం తనే అందుకుని కారులో పెట్టాడు.

కారు బయలుదేరి బయటికొచ్చిం తర్వాత " అవి మళ్ళీ మీతోపాటే వెనక్కి వస్తాయి" అంది జయంతి.

"నాతో పోట్లాడితే ఫలితం యేమిటో యిప్పుడేగా చూసింది. అప్పుడే మర్చిపోతే యింకోసారి గుర్తుచెయ్యటానికి నా కభ్యంతరం లేదు."

జయంతి నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది. కొద్దిసేపయిన తర్వాత శేఖరం తనే "అందమైన సంఘటనల్ని మీ ఆడవాళ్ళు అసహ్యంగా మార్చటంలో ఆరితేరినవాళ్ళు. ప్రమాణపూర్తిగా చెబుతున్నాను. నీకు పుట్టినరోజునాడు చీర

● ఒక విద్యార్థిని : నాకు ఇరవై ఏళ్ళు దాటితేనేగాని పెళ్ళి చేసుకోను."

మరొక విద్యార్థిని : "నాకు పెళ్ళయితేగాని ఇరవై దాటవు."

పంపేటప్పుడు నా మనసులో నిజంగా యేవుద్దేశ్యం లేదు. చీర అందంగా కన్పించింది. అది నువ్వు కట్టుకుంటే బాగుంటుంది అనిపించింది. అంతే.''

జయంతి సమాధాన మివ్వలేదు.

"పోనీ నీకంతగా ఆచీర తిప్పి యివ్వాలని వుంటే ఖరీదు యిచ్చెయ్యి " అన్నాడు.

"ఎంతో నాకెలా తెలుస్తుంది."

"అడ్రస్ యిస్తాను. బొంబాయివెళ్ళి చీర చూపించి షాపులో అడుగు. బొంబాయి వెళ్ళటానికి రాను. పోను. ప్లేన్ ఛార్జీలుగూడా యిస్తాను. కాని ఒక్క-షరతు. ఈ అప్పంతా నువ్వు నాదగ్గర వుద్యోగం చేసి తీర్చుకోవాలి."

శేఖరం సీరియస్‌గా మాట్లాడటం లేదని గ్రహించిన జయంతి మొహం తిప్పేసుకుంది.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం యేర్పడింది.

ఉన్నట్టుండి శేఖరం మెల్లగా జయంతి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "సారీ, జయంతీ ఈ రోజు జరిగింది. అంతే యిందాక నువ్వు రాగానే చూసిన విషయం పీడకలలా మర్చిపో। నే ననుకున్నట్టు. ఆశిస్తున్నట్టు భగవంతుడు మనల్ని ఆశీర్వదిస్తే ఓ రోజు తప్పకుండా నీకు నేను వివరించి చెప్తాను."

అతని చేతిలోవున్న తన చేతిని లాక్కోవాలని బలంగా అనిపించినా జయంతి వూరుకుంది. లాక్కు-వే ప్రయత్నంచేస్తే అతను మరింత బలంగా పట్టుకుంటాడు.

"ఈ రోజు నా ప్రవర్తన వరుషంగా వున్నమాట నిజమే. ప్రస్తుతం నే నెలాటి సమస్యల్లో చిక్కు-కున్నానో నీకు తెలియదు. అసలే చికాకుగావున్న నన్ను అనవసరంగా నీ పిచ్చిపిచ్చి మాటలతో రెచ్చగొట్టావు. నీ మనసు నొప్పించినట్టయితే క్షమించు. మాట్లాడవేం?"

"ఏం మాట్లాడను" అంది నీరసంగా. ఆ ఒక్క-నిమిషంలో అనుకోకుండా చేసిన అపనితో శేఖరం తనలో శక్తినంతా లాగేసుకున్నట్టు అనిపిస్తోంది.

"ఇది చెప్పు జరిగిందంతా మర్చిపోయి రాజీకొచ్చినట్టేగా" అన్నాడు. జయంతి సమాధానం చెప్పలేదు. కొద్దిసేపయిన తర్వాత శేఖరం తనే "వనితావిహార్ వాళ్ళకి సెక్రటరీగా తీసుకున్నట్టు యింతవరకూ తెలియనే తెలియదు. నే నీమధ్య అసలు వూళ్లో వుండనే వుండటంలేదు. నీకు తెలుసుగదా! ఒకసారి. రెండుసార్లు వాళ్ళతో కలిసినా, యేదో నలుగురిమధ్య కలవటం జరిగింది. ఈ సంగతి యెవరికి చెప్పాలో, యెలా చెప్పాలో అర్థంగాలేదు. అందుకే మొన్న గోకుల్ విహార్‌లో నిన్ను విడిగా స్పష్టంగా కన్పించేటట్టు వచ్చి పూల గుత్తుల దగ్గర వచ్చి నిలబడమంది."

"వాళ్ళేమన్నారు?"

"ఏమీ అనలేదు. అనే ధైర్యం లేదనలు. నువ్వు చాలా గడుసుదానివని - మాటకారివని చెప్పారు."

"రిజైన్ యెందుకు చేశానో కారణం అడగలా?"

"ఊహూ నేను అడగలేదు. వాళ్ళు చెప్పలేదు".

జయంతి ముందుకు వంగి కూర్చుండిపోయింది.

"నువ్విప్పు డిలా హఠాత్తుగా మానేస్తే నేను వాళ్ళ మాటలకి విలువయిచ్చి నిన్ను తీసేశాననుకుంటారు. చెప్పు. రాజీ కొచ్చి నట్టేగా - యెందు కలా వంగిపోతావు? లేచి సరిగ్గా కూర్చో-'' శేఖరం జయంతి భుజంపట్టి సరిగ్గా లేవదీయడానికి ప్రయత్నించాడు.

"వద్దు. ఇలా బాగుంది-నొప్పిగా వుంది.''


"ఎక్కడ? ఏది?" కారు స్లో చేస్తూ అదుర్దాగా అడిగాడు.

"కుడివైపు పొట్టలో. ఒకటే నొప్పి. ఇప్పు డెక్కు-వగా వుంది " డొక్క- దిగువగా పట్టుకుంటూ అంది.

ఏది చూడనీ అనబోయిన శేఖరం అంతలోనే ఆగి -

"మందు వేసుకోలా?" అని అడిగాడు.

"వేసుకున్నాను.''



"యేమే మందు ?"

"వేడి నీళ్ళలో నెయ్యి కలిపి తాగాను. వేడివల్లనేమో అంది బామ్మ. రాత్రి కాపు కూడావేసి మర్దన చేసింది. ఈ పూట యిప్పుడు వెళ్ళగానే మళ్ళీ చూడాలి.''

ఇంతలో కారు యింటిదగ్గరకు వచ్చి ఆగింది.

"రాజీకొచ్చానని ఒప్పుకున్నట్టేగా!" అంటూ శేఖరం కవర్లోవున్న కాగితం తీసి చించేస్తూ "ఇలాటి పిచ్చిపనులు యింకెప్పుడు చెయ్యకేం?" అన్నాడు చీరపెట్టె జయంతి చేతి కందిస్తూ. అది చూడనట్టు క్రిందకు దిగబోయింది. శేఖరం వెంటనే చెయ్యిపట్టి ఆపి,

"నువ్వీ చీర తీసుకెళ్ళకపోతే నేను దిగివచ్చి మీ బామ్మతో జరిగిందంతా చెప్పి కట్టుకున్న చీర యివ్వటం మర్యాద అవునేమో చెప్పమని అడుగుతాను" అన్నాడు.

జయంతి క్షణంసేపు శేఖరం కళ్ళలోకి చూసి వెంటనే గభాల్న పెట్టె గుంజుకుని దిగేసి యింటివైపు పరుగెత్తింది. వెళ్ళే ముందు వెళుతున్నాననిగూడా చెప్పలేదు. ఇంటివైపు పరుగెత్తుతుండగా మధ్యలో ఆగి కడుపు పట్టుకుని వంగి నడవటం కనిపించింది శేఖరానికి. "ఏం నొప్పి అది?" అతని కనుబొమలు ప్రశ్నార్థకంగా ముడుచుకున్నాయి.

క్షణంసేపు దిగి జయంతి యింటికి వెళ్ళి చూడాలనిపించినా మరుక్షణంలోనే ఆ ప్రయత్నం మానుకుని వెళ్ళిపోయాడు.

లోపలికి వస్తూనే జయంతి మంచంమీద పడి మూడు అంకెలా ముడుచుకుపోయింది. ఎంత నీరసంగా వుంది! ఈరోజు యెంత అసహ్యమైన పరిస్థితులు చూసింది. మధ్య మధ్య ప్రాణం పోతున్నట్టు అన్పించే యీ బాధ ఒకటి. శేఖరం మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటున్నాయి.

"అలా పడుకున్నావేమే!" బామ్మగారు దగ్గరగావచ్చి అడిగింది.

"ఏం లేదు వూరికినే. కడుపులో బాధగా వుంది"

"నిన్న కాపువేసిన చోటనేనా? మళ్ళీ వేస్తాను. కొంచెం కాఫీ తెస్తాను. తాగు."

"వద్దు బామ్మా! నాకు తాగాలనిలేదు." మంచంమీద మరింత ముడుచుకుపోతూ అంది.

"ఏదీ ఒళ్ళు చూడనీ! మొహం అలా వాడిపోయి వుందెందుకు?" అంటూ జయంతిని పట్టిచూసి "అయ్యొ రాతా! జ్వరంగా వుందే. వేడిగా వుంది.'' అంది.

"ఏం లేదని చెప్పటంలా? ఎండలో తిరిగాను. అంతకు తప్ప యేంలేదు.'' గోడవైపు తిరుగుతూ అంది.

ఎందుకో యెప్పుడూ లేంది ఈ రోజు బామ్మ మాటలుగూడా విసుగొస్తున్నాయి.

"లేదంటే పరిపోతుందా? అయినా యేం వుద్యోగమో. ఏం తిరుగుడో-" బామ్మగారు కాఫీ తీసుకురావటానికి వెళ్ళింది.

ఆ రాత్రి జయంతికి నొప్పి తగ్గలేదు. బామ్మగారు నొప్పివున్నచోట జయంతి గిలగిలలాడుతున్నా వినక బలంగా తోమి వేడినీళ్ళతో కాపింది.

వాళ్ళనుకున్నట్టు అది వేడి చేసిగాదు. ఎండ తగిలి అలిసిపోవటమూ గాదు. మర్నాడు వెన్నెముకలోంచి చలిరావటం



మొదలుపెట్టింది. మంచం మీదనుంచి లేవలేకపోయింది. బాధకూడా అపరిమితమైంది.

"అమ్మాయీ! కారు వచ్చిందమ్మా" అంది బామ్మగారు.

"ఒంట్లో బాగాలేదు. రాలేనని చెప్పు. కాదు-కాదు. రానని చెప్పు. నాకు తెలుసు. నాకీ బాధ తగ్గదు బామ్మా-" మెత్తగా పడుకుని మగతగా యెక్కడో ఆలోచిస్తూ అంది జయంతి. ఒకవేళ తనకేదయినా అయితే బామ్మకి దిక్కెవరు? తను చచ్చిపోయినందుకు బాధపడదు. కాని వంటరిగా బామ్మ యీ లోకంలో యేమౌతుంది? జయంతికి యేడుపొచ్చేసింది.

"ఎందుకే పిచ్చిదానా. ఎందుకు?" ఏడుస్తున్న శబ్దంవిని-దగ్గరగావచ్చి మంచం మీద కూర్చుని మనమరాలి తలని ఒళ్ళోకి తీసుకుంటూ ఓదార్చింది బామ్మగారు.

"నే నీ వుద్యోగం చెయ్యలేను బామ్మా! నాకు చేతకావటంలేదు. చెయ్యకపోతే జరగదు."

"జర క్షేమం చేస్తుందిలే! నువ్వేవలు వెయ్యద్దు." బామ్మగారు జయంతి బుగ్గలు నిమురుతూ అంది.

"లేదు బామ్మా - లేదు. ఈ నొప్పి భయంకరంగావుంది. నాకు ఒకవేళ తగ్గకపోతే-"హఠాత్తుగా వెక్కివెక్కి యేడవటం మొదలుపెట్టింది. అలా యేడుస్తుండగానే

మంచుతెరలా మత్తువచ్చి ఆవరించుకుంది. జయంతి కళ్ళు మూతపడిపోయినాయి.

● ● ●

కళ్ళముందు అంతా చీకటి. నల్లగా వల యాలుగా తనముందున్న చీకటిలో యేం చేస్తోందో, అసలెక్కడుందో, యెంత ప్రయత్నం చేసినా జయంతికి అర్థంగావటం లేదు. ఉండి ఉండి వెన్నెముకలోనుంచి వస్తున్న చలితో ఒళ్ళంతా జలదరిస్తోంది. అంత బాధలోనూ జయంతి బామ్మకోసం అరుస్తోంది. వెతుక్కుంటోంది. తనలా, చాలామంది చీకటిలో యెవరివాళ్ళకోసం వాళ్ళు వెతుక్కుంటున్నారు.

"సూర్యుడు వెలుగు కోల్పోయాడు. వెధవసైన్సు. వెధవ ప్రయోగాలు. మరో విధంగా యెవరైనా కృత్రిమమైన వెలుగు కనిపెట్టేవరకూ మనుష్యులంతా ఇలాచీకట్లో కొట్టుమిట్టాడవలసిందేనా" ఎవరో బాధతో భయంతో గొణుక్కుంటున్నారు. జయంతి కిదేదో ప్రపంచం అంతం అయిపోవటానికే వచ్చిందనిపించింది. నడవకుండా తేలి తేలి పోతూనే చేతులు చాచి తడుముకుంటూ వెళ్ళిపోతున్న జయంతికి ఎవరిదో చెయ్యి తగిలింది. ఆ చెయ్యి తగిలీ తగలగానే జయంతిని గట్టిగా బలంగా పట్టుకుంది. భయంతో కెవ్వుమంది జయంతి.

"జయంతీ! భయపడకు. నేను." అన్నాడు చెయ్యితాలూకు మనిషి.

"బామ్మా! కాదు. కాదు. బామ్మేది? భగవాన్!" జయంతి యేడవటం మొదలు పెట్టింది.

"ఫర్వాలేదు. నేనున్నాగా. ఇద్దరం కలిసి వెతుకుదాం భయపడకు." ధైర్యం చెబుతున్నట్టు అన్నాడతను.

"మీ రెవరు?"

"గుర్తుపట్టలా?"

"మీరు- మీరు-"

నీరసంగా యెలాగో వుండి తూలిపోతూ అతి తేలికగా వున్న జయంతి వేగంగా కదిలిపోతుంది. అతను జయంతిని అలా వెళ్ళిపోకుండా వుండడంకోసం యెత్తి భుజాన వేసుకున్నాడు.

"వెలుతురు యింక రానేరాదా?"

"ఎవరన్నారు?"

"ఎవరో అనుకొంటున్నారు."

"నువ్వ నమ్మేశావు. అంతేనా?" అతని నవ్వునిబట్టి శేఖరం అని తెలిసింది.

జయంతిని ఆ భుజంమీదనుంచి యీ భుజంమీదకి మార్చుకుంటూ

"మనం చాలా లోతైన లోయలోవున్నాం. కొంత దూరంపోయి ఒక కొండ యెక్కి వెడితే వెలుగు కనిపిస్తుంది."

"బరువుగా లేనూ నేను?"

"పావురాయి యీకలా వున్నావు"

జయంతి మొహంలోకి ఆవిరిలాటిది వచ్చింది. కొద్దిసేపయిం తర్వాత నిట్టూర్పు విడుస్తూ "ఎన్ని మాటలు అన్నాను మిమ్మల్ని. అయినా, యీ చీకటిలో నాకు సాయం చేస్తున్నారు. మీకు నామీద కోపం రాకపోవటం కేవలం నా అదృష్టం కదూ!"

"నీమీద నా కెప్పుడూ కోపంలేదు."

జయంతి మాట్లాడలేదు. మాట్లాడేందుకు కూడా ఓపికలేనంత నీరసంగా వుంది.

అతను జయంతి నెత్తుకుని అలసటనేది లేకుండా నడుస్తున్నాడు.

"అదుగో! నాకు వెలుగు కన్పిస్తోంది." హఠాత్తుగా అతని మెడచుట్టు చేయివేసి తన బరువు ఆపుకుంటూ అరిచింది జయంతి.

"ఊష్! ఆ వెలుగుని చేరుకోవాలంటే మనం యింకా చాలాదూరం నడవాలి."

"అలాగా!" జయంతి నిరాశగా చూస్తూ అంది. మళ్ళీ వున్నట్టుండి లేవబోయి వాలి పోతూ "బామ్మేది? మీరు బామ్మని వెతకరేం." అంది.

"వెతుకుతాను."అన్నాడు అతనుత్సాహంగా.

"నాకు నిద్రవస్తోంది."

"నేను కోరుకునేదికూడా అదే. నిద్రపో."

"నిద్రపోయిన మనుష్యులు, చచ్చిపోయిన మనుష్యులు బరువు యెక్కువ అంటారు."

"నిద్రపొమ్మని చెప్పలా? నువ్వు నాకు బరువేం కాదని యిందాకే చెప్పానుగా." జయంతి తలమీద చేయివేసి జుట్టు నిమురుతూ అన్నాడు. అతనలా నడుస్తూనే వున్నాడు. జయంతిని నిద్రలాటిది ఆవరించు కుంది. అది పూర్తి నిద్రకూడా కాదు. ఉన్నట్టుండి యెక్కడినుంచో చల్లటిగాలి వీచసాగింది. ఆ గాలి పీలుస్తుంటేనే నరాల్లోకి కొత్తశక్తి వస్తోంది. అమృతం తాగినట్టు అనిపిస్తోంది. గాలి పీల్చటంలో అంత అద్భుతమైన అనుభవం యింతవరకు తనెప్పుడూ చూడలేదు. గుండెలనిండా గాలి పీల్చుకుంది. రాజశేఖరం ఏడీ? తన నింతవరకూ భుజంమీద వేసుకొని నడిచాడు. అంతా వెలుగు. ఆ వెలుగులో యేదీ స్పష్టంగా కన్పించటంలేదు. రాజశేఖరం లేడు. అదంతా కల! భ్రమ! వట్టిపూహ! మరి తనెక్కడున్నట్టు పోనీ? అదీ తెలియటం లేదు. ఈ గాలి యెక్కడినుంచి వస్తోందసలు? స్వర్గంలోనుంచేమో! అంతే అయివుంటాలి. భూమిమీద గాలి యింత హాయిగా ప్రాణం పోస్తున్నట్టు వుంటుందా?

జయంతి మెల్లగా కళ్ళుతెరిచేసరికి ప్రక్కన కూర్చున్న బామ్మగారు "యెలావుంది?" అని మీదకువంగి అడుగుతోంది.

"బామ్మా!" జయంతి చేతికోసం తడుముకుంటూ పిలిచింది. అమ్మయ్య! ఆదంతా కలన్నమాట! ఎంత భయపడింది తను!

"జయంతీ!" బలంగావున్న చెయ్యి వచ్చి జయంతి చేతిని పెనవేసుకుంది. ఆ చెయ్యి బామ్మది కాదు. ఇంకెవరిదో.

"జయంతీ!" ఈసారి ఆ కంఠం గుర్తు తెలిసింది. అది రాజశేఖరానిదే. ఎందుకిలా అతని అనుభూతి తనని పీడలా వెంటాడుతుంది. ప్చ! లాభంలేదు. తన కసలు మెలకువ రాలేదు. ఎక్కడుందో, యేంచేస్తోందో, అదీ అర్థం గావటం లేదు.

"మెలకువ రాలా?"

"ఉహూ! యెంత పెనుగులాడినా నాకు మెలకువ రావటంలేదు." నీరసంగా అంది జయంతి.

● "సెన్సార్ ఆఫీసర్లు చేసేపని ఏమిటండీ?"

"ఆ, ఏముందీ! సినిమాల్లో ప్రతిమాటకి రెండర్థాలు వెదకడం."

"పోనీలే! నిద్రపో."

"నాకెందుకు మెలకువ రాదు? అసలు నే నెక్కడున్నాను? బ్రతికున్నానో చచ్చిపోయానో యేదీ తెలియటం లేదు." జయంతి యేడవటం మొదలు పెట్టింది.

"హుష్! యేడవకు. నిద్రపోటానికి ప్రయత్నం చెయ్యి. నీకు నిద్ర సరిగ్గా మెలకువ రాలేదు. అంది." జయంతి తలని యెవరో ఒళ్ళోకి తీసుకున్నారు.

"మీరు- మీరు-" కళ్ళు మూసుకునే అంది జయంతి.

"నే నెవరో తెలుస్తోందా? నా కంఠం గుర్తు పట్టావా?" ఆదుర్దాగా అడిగింది ఆ స్వరం.

"శేఖరం- రాజశేఖరం అనుకుంటా-" అస్పష్టంగా అంది జయంతి.

"అవును. రాజాని." జయంతికి దగ్గరగా మెల్లగా అంటున్న ఆ స్వరంలో రిలీఫ్ కన్పించింది.

"నిద్ర వస్తోంది. ఇది నిద్రేనా? నాకు మళ్ళీ మెలకువ వస్తుందా?" శేఖరం చేతిని పెనవేసుకుంటూ నీరసంగా అస్పష్టంగా అడిగింది జయంతి. అప్పటికీ కళ్ళు బరువుగా మూతలు పడిపోతున్నాయి.

"అవును, నిద్రపో-" జయంతి నుదుటిని యెవరో పెదవులతో సున్నితంగా తాకారు. జయంతి కళ్ళు మళ్ళీ మత్తులాటిది ఆవరించుకోవటంతో, మూతలు పడిపోయినాయి. ఈసారి బాధగాని, భయంగాని లేదు. నిశ్చింతగా హాయిగా వుంది.

● ● ●

జయంతికి మళ్ళీ మెలకువ వచ్చేసరికి బామ్మగారు ప్రక్కనున్నారు. జయంతి కళ్ళు తెరిచి 'బామ్మా' అని పిలవగానే "అమ్మా! జయా" అంటూ పలికారు.

"అమ్మయ్య. ఇప్పటికి మెలకువ వచ్చింది. బామ్మా! నా ప్రక్కన వున్నది నువ్వేనా?"

"నేనేనమ్మా- నేనే." బామ్మగారి కంఠం స్పష్టంగా పలకటంతో జయంతి కీసారి పూర్తిగా ధైర్యం వచ్చింది.

"అబ్బ! వెధవ కల. పీడకల. ఎన్ని సార్లు మెలకువ తెచ్చుకోవాలని పెనుగులాడానని. ఎంతసేపయింది నేనిలా పడుకుని. రెండు గంటలపైనే అయిందిలావుంది- అవునా?"

"రెండు గంటలా! అయ్యో పిచ్చితల్లీ!"

"రెండు రోజులా? అవును. అయివుండచ్చు. అందుకే అంత దీర్ఘంగా అనిపించింది."

"రెండు రోజులు కాదే అమ్మా! రెండు వారాలు."

"రెండు వారాలా?" జయంతి ఉలికి పడింది.

"అవు నేమ్మా! రెండువారాలు. చచ్చి బ్రతికావు. ఆ వెధవ నొప్పి అదేమిటో అలా గట్టిగా రాయగూడదుటే తల్లీ. ఈ రెండు వారాలు క్షణం యుగంలా గడిపాను నేను" బామ్మగారు ముక్కు చీదుతూ అన్నారు.

"నే నిప్పుడు ఎక్కడున్నాను బామ్మా? హాస్పిటల్లోనా?"

బామ్మగారు దీనికి సమాధానం చెప్పలేదు

జయంతి చెయ్యిచాచి బామ్మగారి చేతిని తీసుకుంటూ- "బామ్మా! నువ్వు అన్ని విధాలా చాలా బాధపడి వుంటావుగదూ!" అంది.

"లేదు. నేను చీమంతగూడా బాధపడలేదే తల్లీ! ఆ భగవంతుడే స్వయంగా నా యింటికివచ్చి ఆదుకున్నట్టయింది."

"మరి నీ పూజలు వృధాపోతాయా? అవసరానికి భగవంతుడు ఆదుకోపోతే మనకి యింకా యెవరున్నారు?" చిక్కిపోయిన జయంతి పెదవులమీద చిరునవ్వు మెరిసింది. ఆ నవ్వు చూడగానే బామ్మగారికి ధైర్యం వచ్చింది.

జయంతికి బాగా స్పృహ వచ్చిన ఆ సాయంత్రమే కామేశ్వరమ్మగారు, డాక్టరుగారు వచ్చారు. ఆవిడ వస్తూనే "అమ్మా! జయంతీ! ఎలావున్నావమ్మా' అంటూ దగ్గరకొచ్చింది.

"బాగానే వుంది. మీరు నన్ను గీతా అని పిలవడం మర్చిపోతున్నారు" అంది నవ్వుతూ.

"వద్దు- తల్లీవద్దు. జన్మలో యెప్పుడూ నిన్ను గీతా అని పిలవను. జయా అనే పిలుస్తాను. ఎంత తల్లడిల్లిపోయాం అని."

"ఎలావుందమ్మా-మమ్మల్నందర్ని ఎంత కంగారుపెట్టేశావో తెలుసా?" సుబ్రహ్మణ్యంగారు వచ్చి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ అన్నారు.

ఆయన్ని చూడగానే బామ్మగారు తలమీదకి ముసుగు మరింత లాక్కుంటూ "బాబుగారూ! నిజంగా మీరంత ధైర్యం చెప్పకపోతే నా గుండె ఏనాడో ఆగిపోయి వుండేది" అన్నారు.

జయంతి కర్థమైంది-అవసరానికి ఆదుకున్న భగవంతుడు డాక్టరుగారన్నమాట.

"అదుగో-సునంద వచ్చింది" అన్నారు కామేశ్వరమ్మగారు.

"వద్దు-లేవకు. కట్టు చెదురుతుందేమో?"

"కట్టా?-నాకా? ఎక్కడ?" జయంతి ఒళ్ళంతా అనుభూతి చెందుతూ అంది. అవును. నిజం! కుడివైపు పొట్ట మీద క్రిందగా కట్టువుంది.

"నా కిక్కడ గాయం యెలాఅయింది?" చేత్తో తడుముకుంటూ తనలో తను అనుకున్నట్టుగా అంది.

"గాయం కాదు. నీకు ఎపెండిసైటిస్ అయింది. అందులో ప్లూ! యెంత కంగారు పడ్డామని." కామేశ్వరమ్మగారు చెప్పింది.

"ఎలావుంది జయంతీ?" సునంద మంచానికి అటువైపుగా వచ్చి తలవైపున కూర్చుంది.

"రా!" జయంతి సునంద చేతిని తన చేతులోకి తీసుకుంది. ప్రపంచంలో ఒక్కసారిగా తనకెంతమంది ఆత్మీయులు! తన గురించి యెంత ఆదుర్దా! జయంతికి ఏదో సంతోషం నరనరంలో కదిలింది.

"రాజశేఖరం యేడి?" సుబ్రహ్మణ్యంగారు అడిగారు- జయంతి వులిక్కిపడింది.

"ఇప్పుడే ఇంతకుమునుపే బయటికి వెళ్ళాడు" బామ్మగారు సమాధానంచెప్పారు.

అయితే తనను చూడటానికి రాజశేఖరం కూడా వచ్చాడన్నమాట. ఎంతచిత్రం! తను అనుభవించిన యీబాధంతటిలో అతను తోడుగా వున్నాడు. ఆ సంగతి అతనికి తెలిస్తే - ఛీ. ఏమాలోచిస్తోంది తను!

ఇంతలో గదిలోకి డాక్టర్ రావటంతో ప్రసంగం మారిపోయింది.

(సశేషం)



చేదునిజాలు

పవని నిర్మల ప్రభావతి

"పార్వతీ! పార్వతీ! పారూ! త్వరగారా! త్వరగా!"
వీధిగుమ్మం మెట్లు ఎక్కుతూనే, కేకలువేశాడు విశ్వం.

''అబ్బబ్బ! ఏమిటా పిలుపులూ? చక్కగావున్న పేరును చిత్రహింస చేసేస్తున్నారు. కాకున్నా ఇదో ఫ్యాషనయిపోయింది. శారదను 'శారూ' అని, సరోజను 'సరూ' అని, నిర్మలను 'నిమ్మీ' అనీ....బంగారంలాటి పేర్లు ముక్కలు ముక్కలుచేసి, పారూ ...చారూ! అంటూ!'' వంటింటివేపునుంచి వస్తున్న వాక్యాల పరంపరను వినేస్థితిలో లేడు విశ్వం.

''పారూ! ఏదండకం అపుదూ....అరె....అరె. వెళ్ళిపోతోంది....రావోయ్ త్వరగా ..."

''ఏమిటా విచిత్రం?''

''అదుగో అటుచూడు...."

భర్త చూపిన వేపు చూచింది పార్వతి. జనసంచారం అట్టేలేని ఆ సందుమలుపులో నుంచి, రెండుజడలూ, నైలాన్‌చీరె తాలూకు అమ్మాయి ఆకారం తటుక్కున మెరిసి మాయమయింది!

"ఓస్ ఇంతేనా? ఇంకా ఏమిటో ననుకున్నాను...." అందులో విశేష మేమీ లేదని తేల్చేసింది పార్వతి.

"నువ్వు సరిగా చూళ్ళేదు కాబట్టి అలా అంటున్నావ్‌గానీ, చూచివుంటే మూర్ఛపోదువు ..."

"అలాగా! అంత బావుంటుందేమిటి? ఇంతకూ ఎవరా అమ్మాయి?" కుతూహలంగా అడిగింది పార్వతి.

"రోజూ నాతోబాటు మా ఆఫీసు వరకూ నడిచి వస్తుంది.... వచ్చేటప్పుడూ వస్తుంది. ఎవరో కాలేజి గర్ల్! అయినా సఖ్యం సాప్తపదీనం" అన్నారు ... ఆమె స్నేహం సంపాదించాలని మహా ఉబలాటంగా వుంది నాకు...."

చురచుర వెనుదిరిగి వెళ్ళిపోతున్న పార్వతిని చూస్తూ నవ్వాడు విశ్వం.

మర్నాడు....

"పారూ! ఓ సారి, పార్వతీ! ఇలారా!"

"ఎందుకూ?"

"మా ఆఫీసులో కొత్త లేడీ టైపిస్టు చేరిం దీరోజు...."

"ఊఁ!"

"ఎలా వుంటుందో తెలుసా?"

"ఏమో నాకేం తెలుసూ?" పార్వతి కనుకొలకుల్లోని ఎరుపుదనం విశ్వాన్ని కవ్విస్తోంది.

"అదే చెబుతున్నా విను ... నవనవలాడే లేత తమలపాకులా, అప్పుడే వికసించిన తెల్ల గులాబీలా, నవయౌవన శోభతో....''

''చాల్లెండి! ఈ కబుర్లు వింటూ కూర్చుంటే అవతల కూర మాడిపోతుంది!''

''ఆడబుద్ధి పోనిచ్చావుగాదు.'' ఇల్లెగిరిపోయేలా నవ్వాడు విశ్వం.

మూడోరోజు....

''పార్వతీ....!''

''.... ....''

''పార్వతీ....!''

''.... ....''

''మై డియర్ పార్వతీదేవీ !"

సమాధానం రాకపోయేసరికి వంటింటి వేపు నడిచాడు విశ్వం. ఉల్లిపాయలు తరుగుతూన్న పార్వతి ముఖం కందగడ్డలా వుంది. సజల నేత్రాలతో తలెత్తి ఓసారి చూచి మళ్ళీ పనిలో మునిగిపోయింది.

"ఆహా, ఎంచక్కా వున్నావ్! 'కాటుక కంటి నీరు....' అంటూ పద్యం చెప్పాలని పిస్తోందిగానీ, మనకూ, కవిత్వానికీ చాలా దూరమని తెలిసి మానేస్తున్నాను.''

''మంచిపని చేశారు'' ముభావంగా అని ఉల్లిపాయ ముక్కల్ని మరుగుతున్న పులుసులో పడేసింది పార్వతి.

''ముఖంచూడు ఎలావుందో....ఇదంతా అలకే ?''

''అవును నా ముఖమెలా బావుంటుందీ? వీధిలో పోయే ఆడాళ్ళ ముఖాలూ, ఆఫీసులో లేడీ టైపిస్టుల ముఖాలూ అయితే బావుంటాయిగానీ....'' పార్వతి ఉక్రోషం విశ్వానికి గిలిగింతలు పెట్టింది.

''అ! ఈ మాటంటే గుర్తుకొచ్చింది సుమా! నిన్న రాత్రి సినిమాకెళ్ళానా? ముందువరసలో కూర్చున్నారో దంపతులు! ఆవిడెంత అందంగా వుందనీ? అతగాడెంత అదృష్టవంతుడో, అంత సౌందర్యరాసిని అర్థాంగిగా పొందగలిగాడు. కాకున్నా, పెళ్ళిచూపుల్లో నిన్నుచూచి నే నెంత భ్రమపడ్డానూ....నీలోనే లోకంలో వున్న అందమంతా వుందని భ్రమించాను కూడా...." క్రీగంట భార్యవేపు చూచిన విశ్వానికి ఆమె కళ్ళల్లో నీళ్ళు ఆనందాన్ని మరింతగా రేకెత్తిస్తున్నాయి.

''అరె - అరె.... ఏమిటా పరుగూ.... వినమంటూంటే....'' విశ్వంచేతిలో పార్వతి చేలాంచలం చిక్కుపడిపోయింది.

''అబ్బబ్బ! ఇక ఆపుతారా లేదా? నే నా నూతిలో దూకేస్తా నింకా మాట్లాడ్తే!''

పార్వతి దుఃఖం కట్టలు తెంచుకుంది.

''ఛ-ఛ ఊరికే చెప్పగానే కష్టమా? ఊరుకో. ఎంత చదువుకున్నా మీ ఆడాళ్ళలో అసూయ దాగే వుంటుంది సుమా! తమాషాగా ఏదో కబుర్లు చెబితే - ఛ - ఛ ఏదీ నవ్వూ....ఒక్కసారి. ఆ! అలా.''

రోజు కొకసారేనా ఇలాటి సన్నివేశం మామూలయిపోయింది. అతడికి సరదా ఎక్కువౌతోంది. ఆమెకు కోపం బింగి పొర్లుతోంది.

• • •

ఆదివారం మధ్యాహ్నం....

ఏం కథనం కల్పించి పార్వతి నేడిపించాలా ? అనే ఆలోచనతో సతమతమౌతున్నాడు విశ్వం. పార్వతి చేతే ఆడవాళ్ళకు గల అసూయా ద్వేషాలని నిరూపిస్తూంటే, తనను పార్వతి మింగేలా చూస్తుంటే, ఆ అందమైన కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతుంటే, తర్వాత తను ఓదార్పటం ప్రాకెట్టులో విషయమయినా, ఎంత తమాషాగా వుంటుందీ....

"ఏమండీ! ఏమండోయ్. ఇలా రండొక్కసారి."

వీధి వేపునుంచి పార్వతి కేక, ఆలోచనల కంతరాయం కల్గించింది.

''ఏమిటీ ?''

''ఓసారి త్వరగా వద్దురూ....''



పార్వతి వరండాలో మునివ్రేళ్ళమీద నిల్చుని వీధివేపు చూస్తోంది....

"ఎవరు?" పార్వతి వెనకగా నిల్చుని తనూ అటువేపు చూశాడు విశ్వం.

"ప్చ్! వెళ్ళిపోయాడు...."

"ఎవరు?" విశ్వం కంఠస్వరంలో మార్పుకు పార్వతి ఆనందిస్తోంది.

"ఎంత అందంగా వున్నాడనీ? మగాళ్ళలో అంత అందమైనవాళ్లుండటం అరుదే మరి!"

"ఇంతకూ ఎవరు వాడంటూంటే?" విశ్వం పిడికిళ్ళు చూస్తుంటే పార్వతికి నవ్వు ముంచుకు వస్తోంది.

"బావుంది! నాకుమాత్ర మేం తెలుసు ఎవరో...."

"ఇలా వీధిలో నిల్చుని, దారేపోయే మగాళ్ళను వర్ణించే పనేనా?" విశ్వం కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"ఇది మరీబావుంది! అందమైన వస్తువు కన్పిస్తే, ఆదమరచి చూడటం కళ్ళకున్న స్వభావం..."

'చాల్లే మాటలు నేర్చావ్!' విశ్వం చిర చిర లాడిపోతున్నాడు....

'ఏం మగాళ్ళే! ఏం మాట్లాడినా తప్పే!' పార్వతి పొంగి వస్తున్న నవ్వును పెదాల చాటునే అణిచివేస్తోంది.

కలతబారిన మనస్సుతో పడక కుర్చీలో వాలివున్న విశ్వానికి తమలపాకులు చీల్చి ఇస్తోంది పార్వతి....

'రాత్రి నాకో కల వచ్చిందండీ!'

'ఏమిటి?' నిర్లిప్తంగా అడిగాడు విశ్వం.

'చెప్పనా?'

'చెప్పమనేగా?'

'మీకు కోపం రాదంటే చెబుతాను....'

'సర్లే! చెప్పుదూ....'

'మనిద్దరం చెట్టాపట్టాలేసుకుని షికారుకు వెళ్లామట.... చుట్టూ సీనరీ యెంత ఆహ్లాదకరంగా వుందనీ....! ఇల్లాగే ఇద్దరం సరదాగా మాట్లాడుకుంటున్నాం దగ్గరగా కూర్చుని....'

విశ్వం ఒక్కసారిగా ముందుకు వంగి కూర్చున్నాడు....'తర్వాత....?'

'అబ్బ ఎంత తియ్యటి కలండీ....' పార్వతి మైమరచిపోతోంది.

'చంపక త్వరగా చెప్పు పార్వతీ! పార్వతీ! నేనూ ఆ తియ్యదనం పంచుకుంటాను...' కుతూహలంగాఅడిగాడువిశ్వం.

"ఇంతలో ఓ యువతీ, బహుశా ఆవిడ అన్నయ్య కాబోలు, యువకుడూ వచ్చారు మనదగ్గరికి. మీరేమో ఆ అమ్మాయివేపు వెర్రిగా చూస్తున్నారు....నేనూ వాళ్ళవేపు చూశాను.... అతగాడికోపం వచ్చేసింది.

"ఏయ్ మిస్టర్! ఏమిటావిచ్చిచూపూ?" అన్నాడు కోపంగా!

మీరు నమ్మండి మానండి....కోపంలో గూడా అతడెంత బావున్నాడనుకున్నారూ?"

పార్వతి కనుకొలకుల్లోనుంచి విశ్వంవేపు చూస్తోంది.

మరుగుతున్న నీళ్ళలో ఉడుకుతున్న బంగాళాదుంపలా కుతకుతలాడిపోతున్నాడు విశ్వం.

"మీరూ అతగాడూ ఘర్షణపడ్డారు.... ఫెడేల్ ఫెడేల్‌మని మీచెంపలు పగలగొట్టేస్తున్నాడతను....''పరాయి ఆడాళ్ళని.... అందులోనూ నా చెల్లెల్ని, నా ఎదురుగానే అలా నీచంగా చూడటమా?'' అంటూ రెచ్చిపోతున్నాడతను...."

"ఛాల్లే పెదవకలా...." విశ్వం ఛర్రుమన్నాడు....

"అరె పూర్తిగాచెప్పనీండి. నన్ను...." పార్వతి ఆపటంలేదు. నిస్సహాయుడై కూర్చుండిపోయాడు విశ్వం.

"ఇక నేను చూస్తూ వూరుకోలేక పోయాను. ఎంత చెడ్డా మీరు నా భర్తకదా? ఒకవేళ తప్పుచేస్తేమాత్రం. నా ఎదురుగానే అలాశిక్షిస్తుంటే నాహృదయంభరించగలదా? పరుగెత్తుకు వచ్చాను మీ ఇద్దరిమధ్యకూ.

"చూడండీ....మా వారు చిన్న కవి. అందుకే ప్రతి ఆడదాన్నీ అలా పరీక్షగా చూస్తుంటారు. అది కేవలం కళాత్మక దృష్టితోనే...." ఏదో నోటికొచ్చిన అబద్ధం చెప్పాను. అతడు క్షణకాలం నావేపు చూసి ఆగాడు. కానీ ఇంకా అతనిలో కోపచ్ఛాయలు తగ్గలేదు. అలాగే రొప్పుతున్నాడు

"ప్లీజ్! వారిని వదిలెయ్యండి నాకోసం" అన్నాను.

"అలా అన్నారు బావుంది. మీ లాటి అందమైన ఆడది కోరితే....మిష్టర్! ఇకనేనా బుద్ధిగా వుండు" అని అతడు నావేపు చూచి నవ్వాడు.

"అబ్బ! ఆ నవ్వెంత మధురంగా వుందనీ!"

"ఛీ! నోర్ముయ్! అధ్వమైన వాడి నవ్వూ మధురంగా వుంటుంది నీకు. హద్దూ పద్దూలేకుంటే సరి" విశ్వం కోపంతో చిందులు తొక్కుతున్నాడు.

"అదేమిటండీ-అంత కోపం! కలను గురించి చెప్పినా తప్పే!" పార్వతి నవ్వు తెర ఆపుకోలేక పొరమార్చుకుంది.

"పెదవకలా - నువ్వూను. మన ఆలోచనల ప్రతిబింబాలే కలలు" విశ్వం పళ్ళు పిండి చేసేస్తున్నాడు.

'హుఁ మగబుద్ధి పోనిచ్చారు కాదు.... ఎంత చదువుకున్నా, ఎంత ఆదర్శాలు వల్లించినా, భార్య పరాయి మగాణ్ణి కన్నెత్తి చూస్తే చాలు, కుత కుత ఉడికిపోతారు....'

విశ్వం గబుక్కున పార్వతికి దగ్గరగా వచ్చాడు....

'నిజం చెప్పు పార్వతీ! నీకి కల నిజంగా వచ్చిందా లేక....?' అతడి బాధ చూస్తుంటే పార్వతికి నవ్వాగలేదు.

'ఏం? ఎందుకు రాకూడదూ? చూచిన ప్రతి ఆడదాన్నిగురించీ మీ కేవేవో ఆలోచనలు కలుగుతూంటాయని చెబుతూంటారే.... నా కలాటి కలలు వస్తే ఏం?'

మరింత పరీక్షగా చూస్తూ అడిగాడు విశ్వం.... 'నీకే కల రాలేదు.... అవునా? నా మాటలు నాకే అప్పజెప్పటానికి కల్పించావు కదూ?' దీనంగా అడుగుతున్న భర్తను ఇంకా ఏడిపించటం భావ్యం కాదనిపించింది పార్వతికి.

'శ్రీవారూ! ఎంత భార్యానిర్తలయినా, ఎంత సంస్కారపూరితులయినా, ఎంతటి విశాల హృదయులైనా, మనసులో రేగే ప్రతి భావమూ, అస్తమానూ, ప్రక్కవారికి చెప్పుకుంటే ఇలాగే వుంటుందండీ! కాబట్టే ఇద్దరికీ మధ్య ఎంత కాదన్నా సన్నని తెర వుండాలి కొన్ని విషయాల్లో.... నిజంగా ఒక వేళ అలాటి ఆలోచనలే వచ్చినా, అవి పదే పదే వ్యక్తం చేసుకోడం ఇరువురికీ క్షేమకరం కాదు....'

'హియర్.... హియర్.... ఇక చాలు పార్వతీ! దేవీ! నా హృదయరాణీ! ఇక చాలు! ఇకనుంచీ అలా నేను నీముందు నిన్నేడిపించటానికి పరాయి ఆడాళ్ళను వర్ణించను.... కానీ నాకు మాత్రం నీకలల్లో కన్పించే అందమైన మగాళ్ళను గురించి చెప్పకేం! నాకు నిజంగానే ఏడుపొస్తుంది...' చిన్నపిల్లాడిలా, పమిటి చెంగులో ముఖం దాచుకుంటూ చెబుతున్న విశ్వాన్నిచూస్తూ నిండుగా నవ్వింది పార్వతి! ○○○

మీ సంబంధం మాకు నచ్చలేదు...



భమిడిపాటి రామగోపాలం

రాత్రి తొమ్మిదిన్నరై పోయింది, ఇంటికి చేరేసరికి.

విశాలి తలుపుతీస్తూనే 'బాగా జరిగిందిటుగా, సన్మానసభ?' అంది.

'ఆ. కాని అప్పుడే నీదాకా యెలా వొచ్చింది?'

'మీరు చెప్పకపోతే తెలీదనుకున్నారా?'

'ఎవరు చెప్పేరయితే?'

'ఇంటివాళ్ళమ్మాయి, వరం! - పాటలు పాడిన అమ్మాయీ తనూ క్లాసుమేట్సట....'

'సరేలే-ఎవో ఉంటాయి. బీరకాయ పీచులు.'

కాళ్ళూ చేతులూ కడుక్కొని భోజనానికి కూచున్నాను. విశాలి ప్రసంగం మార్చలేదు. కూరా పచ్చడీ నే నడగడానికి వో నిమిషం ముందుగానే ఒడ్డించేస్తూ నేను భోజనం సంగతి మాట్లాడకుండా జాగర్త పడింది.

'అది కాదండీ, ఎన్నాళ్ళయింది-అతను వూరొచ్చి?'

'అయిదు రోజులు దాటింది ఇవాళ్టికి.'

'మకాం కూడా మన వీధిలోనేట? చెప్పేరే కారు.'

'ఏదో అలా అయిపోయింది-ఇంతకీ నీ ఆతిథ్యం కనీసం నీ చేత్తో వో కప్పు కాఫీ అతనికి ప్రాప్తం లేదేమోలే!'

'అయ్యో పాపం! అలా ఎందుకైపోవాలి?....అర్థమైన మొహాల్ని ఇంట్లో పెట్టి మేపినప్పుడీ మాట లెక్కెడి కెళతాయండీ?'

'అబ్బ. అలాక్కాదు విశాలా. అతను, వాళ్ళ స్కూలు తరపున ప్రతినిధిగా వొచ్చేడు అన్ని జిల్లాల్లోని అన్ని హైస్కూళ్ళు తలో ప్రతినిధిని పంపేరు. భోజనాలూ, కాఫీలూ అన్నీ స్కూల్లోనే ఏర్పాటు చేసుకున్నారు. కాదని ఇంకో చోటికి వెళ్ళడం సంఘ గౌరవం కాదని ముందే కట్టుగిట్టం చేసుకున్నారుట. అసలు మకామే స్కూల్లో ఉండవలిసింది. ఈ వూళ్ళో కొందరికి అతను నా ఫ్రెండని తెలిసి కథలూ, పాటలూ వాట్లగురించి ఏదో నాలుగు ముక్కలేనా మాట్లాడుకోడానికక్కడ వీలుండదని, ఈ వీధిలోనే ఆ ఖాళీ ఇంట్లో అతనొక్కడికీ మకాం ఏర్పాటు చేసేరు. అంతకన్నా మరేం లేదు."

'సభలో మిమ్మల్ని కూడా పొగిడేరుట!'

'పొగడ్డానికి నాలో ఏముంది!- ఇం-గొప్ప రచయితకి బాల్యమిత్రుడైనందుకు ఫలానావారి అదృష్టానికి మా అభినందనలుత అని ఏదో అన్నారు; సభల్లో అలా అనడం మామూలేగా!'

'మీకు బాల్యమిత్రుడన్నారూ?'

'అంతేగా మరి! ఇప్పుడు నాకు ముప్ఫయి మూడు వెళ్ళేయి. పదహారో ఏట, అతనికీ నాకూ మొట్టమొదట స్నేహం కలిసింది. ఆ వయస్సువేపు ఇప్పుడుచూస్తే బాల్యం లాగే కనిపిస్తోంది....'

'మరి మనింటి కొక్కసారి - బోవీ భోజనాని క్కాకపోతే ఉపాకైనా తీసుకురాలేదేం?'

'చెప్పేనుగా, ఏదో అలా అయిపోయిందని!'

"ఇంకా వుందా, వాళ్ళ మీటింగు?"

"ఇవ్వాళ్టితో సరి."


"అయితే రేపు అతన్ని మనింటికి భోజనానికి పిలవండి."

"అబ్బో-ఏం చెప్మా!"

నేను కంచంలో చెయ్యి వదిలేసి, విశాలి వేపు ఎగతాళిగా చూస్తూ నవ్వేను.

"నా యిష్టం."

"అదిగాదు. అంత ఇంట్రెస్టు ఏమిటా నా ఫ్రెండుమీద అని!"



"ఇంట్రెస్టు ఉండదా?—అన్ని పుస్తకాలు రాసిన మనిషి. స్వయంగా మనిటి పక్కనే కేంప్ ఒచ్చి ఉన్నాడంటే. అందులోనూ మీకు బాల్యమిత్రుడంటే. ఓమారు దగ్గిరిసా చూడాలని-అతను మాట్లాడితే వినాలని. కుతూహలంగా ఉండదా?—మీ యింట్లో అన్నం ముట్టనని అతవేం శపథంచేసేడా?"

"అయ్యబాబోయ్-కొంపదకు. రేపతన్ని తీసుకొస్తాగా!"

● ● ●

వంటయిపోయింది-భోజనానికి లెమ్మని చెప్పడానికి నే వెళ్ళేసరికి మురళి ఎవరితోనో ఏదో పిట్టకథ చెబుతున్నాడు. ముగ్గురు శ్రోతల మధ్య అతని కంఠం ఉల్లాసంగా, ప్రముఖంగా వినబడుతోంది.

"ఏమి టేమిటి-నేను లేకుండా ఏదో చెప్పేస్తున్నావే" అన్నాను మళ్ళీ మొదలు పెట్టమని అడగడానికి యిష్టంలేక.

"ఆఁ ఏముందీ. మీ రింకా పెళ్ళిచేసుకోలేదేమని అడుగుతున్నారీయన. దానికి నా ఎడ్వెంచర్ ఒకటి చెబుతున్నాను...."

"ఎడ్వెంచరా?"

"ఆఁ, ఎడ్వెంచరే. పెళ్ళికూతుర్ని చూడ్డానికి వెళ్ళడం అనేది కుర్రాళ్ళకి అంతేగా."

"కాకేం- ఇప్పుడు మరీనూ. ఆడపిల్లలు కూడా ప్రశ్నలడిగేస్తున్నారుట; మీకు చదరంగం వొచ్చా, సైకిలు తొక్కడం వొచ్చా- ఆఫీసర్ ఎదుటబడి ప్రొమోషన్ అడగ్గలరా- అంటూనూ. అంతెందుకు. మొన్నీమధ్య ఈ వూళ్ళోనే. వాళ్ళిల్లు మంచి బజార్లో అన్నమాట;- పెళ్ళికొడుకు ఏదో కొంత నాసిరకంగా కనిపిస్తేనూ. ఈ ట్రాఫిక్‌లో రోడ్డు దాటటానికి మీ కెంతసేపు పడుతుందని అడిగిందిట ఓ అమ్మాయి....!" అన్నాను.

అందరూ నవ్వారు.

"నాకు జరిగింది అలాటిది కాదులే. అయితే చాలా రోజులైందనుకో; అప్పటికింకా మొగపిల్లల్ని ప్రశ్న లడగడందాకా రాలేదు. నేనూ మా చిన్నక్కయ్యా కలిసి వెళ్ళేం. పిల్లని చూడ్డానికి. వాళ్ళసలు మా బంధువులే. అయితే చాలా పీనాసివాళ్ళు వాళ్ళ ఫేమిలీహిస్టరీకూడా అంతమంచిదిగాదు. ఆ పిల్ల అక్కగా రొకావిడ భర్తతోపోట్లాడి పుట్టింటికి మకాం వొచ్చేసింది. ఇంకొకావిడ. ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్న భర్తగార్ని అవూరికి ట్రాన్స్ఫర్ చేయించింది. అందుకేదో కారణం వుంది. అవిడ కేరక్టర్ మంచిది గాదని చెప్పుకునేవారు. అదంతా ఇప్పుడు మన కెందుకులెండి—

"చెప్పేదేమిటంటే. మాకు మీ పిల్ల అక్కల్లేదు మొర్రో అంటున్నా కూడా లక్ష్య పెట్టలేదు వాళ్ళు. ఓసారి పిల్లని చూడకూడదా అని కబురూ....వాళ్ళ పిల్లని చూసీ చూడగానే మొహం తిరిగిపోయి బాబోయ్ నాకు కట్నంవొద్దు కానుకలూ ఒద్దు' ముందీ అప్సరసనిచ్చి పెళ్ళంటూ చెయ్యండి చాలు. అంటామని వాళ్ళ ఉద్దేశం!"

అని అందరి మొహాలవేపూ చూసేడు. మురళి. అందరూ చిరునవ్వులు విసిరి అతన్ని ప్రోత్సహించేరు.

"ఏదోపరి; కాకిపిల్ల కాకిక్కముద్దూ."

"ఎవళ్ళ ఆశలు వాళ్ళవి."

"సరే వెళ్ళాం. మేం వెళ్ళేసరికి స్సాయంత్రం నాలుగైంది. పొద్దుట ఏ తొమ్మిదింటికో చేసేసి ఫ్లాస్కులో పోసేసిన బాపతు కాఫీ చెరో కప్పు ఇచ్చేరు. మేం ఒస్తామని రాసిన ఉత్తరం అందిననాడు చేసిన పకోడీలూ. అవి తింటేనే గాని పిల్లని చూపించం అన్నట్టు ఓ పట్టాన పిల్లని ఇవతలికే తీసుకురాలేదు—"

"పాపం ఏదో శక్తికొద్దీ మస్తాబు చేస్తున్నారేమో" అన్నా దొక శ్రోత.



"అదీ కాదోయ్. ఈ పకోడీలూ-కాఫీ అరగించిన మీదట-చావు రాలేదన్న ఆశ్చర్యంలో ఎలాంటి ఆకారం కళ్ళబడ్డా ప్రాణానికి హాయిగా తగిలి, సరే కానివ్వండి! అనకపోతారా అని" అన్నాడు రెండో ఆయన.

"సరే అదృష్టవశాత్తూ - పెళ్ళిచూపుల టిఫిన్ అంతా తినక్కర్లేదన్న అనవాయితీ ఒక టుందిగా. దానిమూలంగా మాకు డాక్టరు ఖర్చు తగ్గిందనుకోండి-ఆనక ఊడిపడ్డాది భామ వేషం! సరిగ్గా నాలుగ్గజాల దూరంలో కూచోబెట్టారు. అక్కణ్ణించే లక్షణాలన్నీ కనబడ్డాయి....చేతులకీ, మొహానికి సరిగ్గా అంగుళం పొడుగు రోమాలు!.... రామరామ! వేషం చూదామా అంటే ఇంట్లోఉన్నవాళ్ళందరివీ తలోటి తొడిగే శారు. నెక్లెస్ ఒకరిదీ, గాజులు మరొకరిదీ చెవుల కమ్మ లింకొకరివీ, జెడలో నాగరం బహుశా పొరుగింటి వాళ్ళదీ. జాకెట్టూ చీరా సరే, వాళ్ళమ్మ పెళ్ళినాటి వనుకోండి - ఆ విగ్రహం చూడాల్సిందే. వర్ణించడం కష్టం...."

"పాపం ఎంతసేపు కూర్చున్నారో అలా ఆవిడ కెదురుగా ఆ దృశ్యంచూస్తూ?"

"ఎడ్వెంచర్ అని ఊరికే అన్నారామరి!"

"—సరే. అయింది కాదూ. మా చిన్నక్కయ్య సరసాలమారి. కాసేపు అదీఇదీ అడిగి యథాశక్తి ఏడిపించుకు తింది. కాస్తలో కాస్త ఎంటర్ టెయిన్ మెంటనుకోండి."

అందరూ కళ్ళూ చెవులూ అప్పచెప్పి వింటున్నారు. చెప్పవలసిన మాటలు నోట్లోనే ఉండిపోయి. నాకొంచెం కష్టంగానే ఉంది.

"ఇహ అప్పుడు పాటకచేరీ; నా సామి రంగ!" అన్నాడు మురళి; అసలు తతంగం అంతా ఇందులో ఉంది. చూస్కో. అన్నట్టు.

ఆ సంగతి గ్రహించిన వొకశ్రోత "చేతులారా చేసుకున్న పాపం; అనుభవించక తప్పుతుందా?- మిమ్మల్నెవరు అడగమన్నారు. పాటొచ్చా? - ఏదీ ఒకటి విందాం!- అంటూను?" అని గడుసుగా నవ్వుతున్నాడు.

"అబ్బెబ్బే- మావల్ల ఏం తప్పులేదు. కాకపోతే అది మా పూర్వులెవరో చేసుకున్న పాపం అయివుండాలి. అంతే- పాట మొదలుపెట్టకముందే- మా చిన్నక్కయ్యా నేనూ పోదాం అంటే పోదాం అని గిల్లుకున్నాం. మధ్యవర్తివేపు తిరిగి గొంతుక సవరించుకొనే లోపలే ఆ పిల్ల తల్లిగారు ఉండే. మా తప్పిపోయిన అత్తగారు— "అమ్మాయికి పాటకూడా ఒచ్చు." అంది మొహం చేటంత చేసుకుని. అక్కడికి మా చిన్నక్కయ్య తెంచేసి "ఒస్తే ఏం లెండి; మరోసారి వినొచ్చు." అనేసి సహం లేచింది. ఇంతట్లో మళ్ళీ అందుకుని "మరోసారీ విందురుగాని. ఎప్పుడు వింటే మాత్రం ఈ సొంపొస్తుందా?" అని ఆతల్లి బలవంతాన ఆర్మణీపెట్టి తెచ్చి కూతురు ముందర కుదేసి; "సిగ్గుపడకమ్మా. ఒక్కటేదేనా పాడు" అని బెత్తాయించింది...."

"పాపం!" అన్నాడొక శ్రోత.

"—ఇహ ఎత్తుకుందండీ ఆఅమ్మాయి. అది హిందీ పాటో, మరాటీయో, లేకపోతే నేపాలీ భాషో తెలీదు. సిరి రామచెంద్ర కృపాళు భజమన హరణ భవ భయ దారుణం - ఆ ముక్కలు మాత్రం అలా జ్ఞాపకం ఉండిపోయాయి. ఇప్పటికీ జ్ఞాపకం— దారుణం, దారుణం!"

"నిజంగా దారుణమేనండీ" అన్నా డొక శ్రోత.

"అసలది మంచి కీర్తనేనండీ _ మొదట్నించీ మా ఫ్రెండుకి హిందూస్తానీ సంగీతం అన్నా హిందీ కీర్తనలన్నా నచ్చవు ....కవి, స్వార్థపరుడు కదా! అవి తెలుగే అయివుండాలి; తనే వ్రాసుంటే ఇంకా మంచిది!" అన్నాను నేను.

"ఇది మరీ బాగుందోయ్. నేను రాసిన పాటలు నా పెళ్ళిచూపులకే ఎవరు పాడగలరు?'

"అదే మంత అసాధ్యమా? ఇప్పటికీ నీకు పెళ్ళికాలేదు. నువ్వు రాసిన పాటలు దాదాపు పాతిక ముప్ఫయి వరకూ దేశంలో మంచి ప్రచారంలో ఉన్నాయి. ఇవాళ నీ పాటలు రాని ఆడపిల్లలు లేనేలేరని నువ్వు అనలేవు. మాటవరసకి నిన్నరాత్రి గోవింద రావు గారమ్మాయి....అన్నీ నీ పాటలే పాడింది కద!"

"అయితే మాత్రం-మనం ఆ దృష్టితో?"

అన్నాడు మురళి కంగారుగా.

"—అయింది కద! పబోజ్ గోవింద రావుగారు ఇవాళ సాయంకాలం నిన్ను టీకి ఇన్వయిట్ చేసినట్టే చేసి-అయ్యా, మీ కింకా పెళ్ళికాలేదని విన్నాను. మరి మా అమ్మాయిని చూసేరు కదా! మీ అభిప్రాయం ఏమిటని అడిగేరనుకో-"ఏమోనండీ - ఆ దృష్టితో చూడలేదు" అంటావా? నన్నడిగితే-ఈ పెళ్ళిచూపులనే సిస్టమ్‌లోనే ఏదో మిస్టరీ ఉంది. ఎక్కువమంది ప్రిజుడిస్ అయిపోతున్నారు. ఏదో బావుందని వెళ్ళి అన్నీ బావున్నాయనుకొని తీర్మానించుకోడం, లేకపోతే ఏదో నచ్చలేదనుకొని అన్నిటికీ వంకలు పెట్టుకోడం - పది నిముషాలు మొదలు అరగంట వరకూ జరిగే యీ తతంగంలో, ఆ మధ్య, నిజం తెలుసుకొందుకు అవకాశం చాలా తక్కువ!"

అన్నాను.

"అదీ నిజమే లెండి." అన్నాడొక శ్రోత లేని నవ్వుతెచ్చుకుంటూ.

"మొత్తానికి అలా ముగిసిందన్నమాట, మీ ఎడ్వెంచర్!" అని రెండో ఆయన నవ్వాడు.

మూడో ఆయన ఏదీ అనకముందే నేను మురళి వీపుమీద తట్టి "సరే. చెప్ప మరిచాను! _ వంటయిపోయింది. భోంచేసొద్దాం పద." అన్నాను.

'ఓ. ఎస్. ఆయామ్ రెడి."

● ● ●


భోజనాలయిపోయి ఇవతల పడ్డాం.

"ఏమిటో నువ్వు సరిగ్గా సహజంగా భోంచేసినట్టు లేదు." అన్నాను.

"అబ్బెబ్బే లేదు— నాకు మీ యింట్లో మొహమాటమా?"

"మొహమాటం అనిగాదు. ఏదో పరధ్యానంగా ఉన్నావు" అన్నాను. అతను భోంచేస్తున్నంతసేపుకూడా అంతే. మాటలు సమయోచితంగా రాలేదు. ఒకదాని కొకటి చెప్పడం, మళ్ళీ అది సర్దుకుందికి ఇంకోటేదో చెప్పడం— ఇలా అయింది.

మేం విజయనగరంలో చదువుకున్నాం. కృష్ణమూర్తి హోటల్లో భోంచేసి, పక్కనే ఉన్న పంతులుగారి కిళ్ళీకొట్లో ఉప్పుచెక్క, ఏలక్కాయ కిళ్ళీ వేసుకోడం ఆనాటి జీవిత మాధుర్యాలలో ఒకటి. దొరకాలేగాని ఉప్పు చెక్క మజా ఎప్పటికీ నాకు చాలా అనుభవనీయంగా ఉండిపోతుంది. ఈ వూళ్ళో దొరకవుగాని, మొన్నీమధ్య వెంకట్రాజు



గజపతి నగరం వెళితే అతనిద్వారా తెప్పించినవి కొద్దిగా ఉన్నాయి.

"ఇవి తెక్కడ సంపాదించావోయ్" అంటూ మురళి సర్వం మరిచి తాంబూల చర్వణంలో పడ్డాను.

ఆ నిషా దిగిపోతుండా నే అందుకున్నాడు. "నీ పెళ్ళయి ఎన్నాళ్లయిందీ?"

"ఆఁ, కాన్నాళ్ళయింది. ఐదారేళ్ళయింది."

"అత్తారేవూరు?"

"పిఠాపురం. సుబ్బరామయ్యగారని, ఎప్పట్లో దివాన్‌గా ఉండే వారు మా మామగారు!"

తక్కువ మనిషి ముందుకి వంగాడు మురళి. చిన్నదగ్గు దగ్గాడు.

"దిక్కట్టిందా? ఈ ఉప్పు చెక్క అలవాటైకపోతే ఇంతే. అలాగే ఉండు. మంచినీళ్లు తెస్తాను!" అని వంటింట్లో కెళ్లాను.

గ్లాసులు ఖాళీ లేవు. అయిదు గ్లాసులు పాయసంతోనూ నీళ్ళతోనూ మా కంచాల దగ్గర ఎంగిలివి ఉండిపోయేయి. విశాల మూడు గ్లాసులు తన భోజనం దగ్గర

పెట్టేసుకుంది. చేసేదిలేక నా పీటదగ్గిర మంచినీళ్ళ గ్లాసుతీసి, వరండాలో కెళ్ళి కడుక్కొచ్చి, బిందెలో ముంచాను.

"ఏమి టంటున్నాడు మీ ఫ్రెండు?" అంది విశాల.

"అబ్బే! ఏం లేదు. నీ గురించే భోగట్టా చేస్తున్నాడు. ఏ వూరు, ఏం కథా అంటూను' ఇంతలో ఉప్పుచెక్క గొంతుక్కి అడ్డం పడినట్టుంది" అని చిలిపిగా నవ్వేసి, నీళ్ళు పట్టుకొని హాల్లోకొచ్చేను.

మురళి, హాల్లో ఫోటోలవేపు చూస్తున్నాడు. మా పెళ్ళి ఫోటో ఒక మంచి ఎన్లార్జిమెంటు. దాని కిటూ అటూ నాదీ విశాలిదీ పెద్ద పెద్ద బస్ట్ ఫోటోలూ. అన్నిట్లోకీ ఈ మూడే ఆకర్షణీయంగా ఉంటాయి! వాటివేపే చూస్తున్నా డతను.

'పిఠాపురంలో ఇంత మంచి ఫోటోగ్రాఫర్లున్నారుటోయ్?' అని పలకరించాడు మురళి; తను ఇంతసేపూ ఫొటోగ్రఫీనే పరిశీలించి చూస్తున్నాడని నే ననుకోవాలని కాబోలు.

"మంచినీళ్ళు తాగు." అన్నాను; సమాధానం చెప్పకుండా.

"అక్కర్లేదు; నువ్వలా వెళ్ళగానే సర్దుకుంది." అంటూనే నీళ్ళు తాగేశాడు; చిరునవ్వు తెచ్చుకుంటూ.

అతను ఇందాక హఠాత్తుగా వొంగి, దగ్గడం ఎందుకో, ఇప్పుడు నీళ్ళు తాగుతూ నవ్వడం ఎందుకో, నాకు తెలుస్తున్నట్టుంది.

అతను ఇంకా నవ్వుతూనే ;' — అది సరేకాని, నీళ్ళకి నువ్వెలా చిక్కడ్డావు?' అన్నాడు.

అంటే? — నీళ్ళు నీ కెలా తగులుకున్నారు—అనా? 'పాపం. మోసపోయావు మిత్రమా! అన్న జాలి ధ్వనించింది.

నాకు తెలిసిపోయింది. నా మిత్రుడు ఎడ్వెంచర్ చేసిన పెళ్ళి చూపుల్లోని కన్య ప్రస్తుతం మా 'విశాలి'గా, మా యింట్లో ఉంది!

దారుణం, దారుణం!

• • •

"సారీ! ఇలా అవుతుందనుకోలేదోయ్" అన్నాడు మురళి.

"అరె! నువ్వలా ఎందుకంటున్నావో నా కర్థం కావడం లేదు. ఇందులో ఎవరైనా విచారించవలసింది ఏముంది అసలు?" అన్నాను.

ఓ నిముషం ఊరుకొని "నేనేం అన్నానో నాకు గుర్తు రావడంలేదు...." అని తడుముకోసాగాడు మురళి.

ఇందాక ఆ సిగ్గుమాలిన ఉపాఖ్యాన క్రమంలో, తను పొరపాటున ఏదైనా అనరాని మాట అన్నాడా అని అతనిప్పుడు బాధ పడుతున్నట్టుంది.

"నాకూ గుర్తులేదు...." అని నవ్వేసి "గనక నువ్వేదీ గుర్తు తెచ్చుకోడం మంచిది గాదని నా ఉద్దేశం!...." అన్నాను.

మళ్ళీ కాసేపు ఆగాడు మురళి. "—ఎటొ ఆల్, కొంత విచారించవలసింది కూడా ఉందేమో అని" అన్నాడు.

"నా కలా అనిపించడం లేదు."

"బాగా కట్నం యిచ్చేరా?"

"నథింగ్ డూయింగ్."

"మరి-ఎలా జరిగింది? ఎక్కడో ఏదో పొరబాటు జరిగింది!"

"నేను పొరపాటనుకో లేదన్నానుగా!"

"ఆ విషయంలో నిన్ను నే నభినందించక తప్పదు."

"నేనుకూడా నన్ను చాలాసార్లు అభినందించుకున్నాను-ఈ విషయంలో."

"ఆఫ్ కోర్స్, కొంతమంది జీవితంలో ఏదెలా దొరికితే ఆలా తీసుకుని ఆనందించగలుగుతారు....అదృష్టవంతులు."

నేను నవ్వాను. 'అలాకూడా అవలేదు .... నువ్వు తెలుసుకోజూడ్డం నాకు చాలా సంతోషంగా ఉంది.... నేనామెని చాలా పరీక్షలకి గురిచేసేను. అన్నిటికీ నిలబడిందని నీకు చెప్పడానికి గర్విస్తున్నాను.'

మురళి మాట్లాడలేదు.

చాలా సున్నితమైన విషయం. విచిత్రమైన సంఘటన. ఇన్ని సంవత్సరాల తరవాత వాళ్ళ గురించి తన కప్పుడేర్పడిన భావం చెప్పడం పెద్దమనిషితరహా కాదు. మిత్రు డింటికి వెళ్ళి మిత్రుడి భార్యమీదా అత్తారిమీదా అభాండాలు వెయ్యడం నాగరికతా కాదు. మిత్రుడి శ్రేయస్సు కోరి అతని చుట్టూ ఏదేనా కీడు వున్నప్పుడు చెప్పగోరడం సహజం. అన్నిటికీ మించి పొద్దుటే తను చేసిన వ్యాఖ్యానాలు సమర్థించుకోవడం బహుశా అవసరమేమో; ప్రఖ్యాతిగల మనిషికి, అన్న మాట నిలబెట్టుకోడమే ముఖ్యావసరం కద!

అతని స్థితి అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ నేనూ మాట్లాడలేదు.

నేను బి. కెక్. ఆయిన తర్వాత, ఎవరో పిఠాపురం షుగర్ ఫేక్టరీలో వేయించేరు, నా కుద్యోగం. వీళ్ళ యింటికి ఎదురుగా ఉండేవాణ్ణి. ఆ యింట్లో ఒక సంగీత విద్వాంసురాలు ఉండేది; ఆమె శిష్యురాలీమె. హిందూస్థానీ సంగీతమే ఈమె అభ్యసించేది. కర్ణాటకం అంతకుమునుపే కొద్దిగా వచ్చునట. అంతకంటె హిందూస్థానీ సంగీతమే తన కిష్టమట. సూర్‌దాస్, భక్త మీరా, కబీర్ భజన్లు, టుమ్రీలు, ఇంకా కొద్దిగా - పారశీక కవులు రచించిన ఘజల్‌లు, నేర్చుకుంది. మరీ మరీ పాడించి వినిపించేది, ఆ టీచరు.

నిష్‌దిన్ బర్‌సత్ నైన్ హమారే. జకోరే మన్ రామ్‌నామ్ సుఖ్‌దాయీ. తోతుమ్ తోడో పియా- చలో మన్ గంగా జమునా తీర్- కోయీ కహియొరె. ఇలాటివి కొన్ని. లాస్ట్ బట్ నాట్ లీస్ట్— శ్రీరామచంద్ర కృపాళ్ భజమన్ హరణ— నాకు కూడా పట్టుబడ్డాయి ......అద్భుతంగా పాడుతుంది విశాలి.

అన్నీ చెప్పాను మురళికి.... 'పెళ్లైపోయిన వెంటనే సంగీతం మరిచిపోకుండా, సాధన చేసి, కృషి చేసి, మంచి అనుభవం సంపాదించింది...... నువ్వు చెప్పిన రోమాలూ, ఆ అనాకారితనం- అవన్నీ నీ బేడ్ ఇమాజినేషనో, లేక మీ చిన్నక్కయ్య ప్రభావమో అయివుండవచ్చు. ద్వేషించడంలో ఒకరి సహాయం చాలా సులువుగా అంగీకరిస్తాం........ ఏదెలా వున్నా, నువ్వు అరగంటసేపు చూసి నిర్ణయించుకున్నావు; నేను ఆరునెల్ల కాలం చూసి నిశ్చయించుకున్నాను ....' అని కూడా చెప్పేను.

'వాళ్ళు చాలా పీనాసివాళ్ళోయ్."

'నాకు వాళ్ళ డబ్బు కావలసొస్తేకద. ఆ సంగతి నన్ను బాధించడం!'

విశాలిచేత ఓ కచేరీ చేయించితే, 'చాలా బావుంది; ఆనాడు నేనే పొరపాటు పడ్డాను.' అంటాడు మురళి, ఇప్పుడు. కాని అది నాకు అనవసరం.... అసలావుంచి, నే నామెని పెళ్ళాడ్డం వల్ల కొంతైనా నష్టపోయానని. కనీసం యింతకన్నా అభివృద్ధిలోకొచ్చే ఛాన్సులు పోగొట్టుకున్నానని చెప్పడానికి కొంచెంసేపు తాపత్రయపడ్డాను; మురళి. అతనికి నామీదున్న ప్రేమవల్లో, లేక మరేదైనా కారణం వుందో—

"వెళ్ళేడా మీ ఫ్రెండు?"

"ఆఁ. నిన్ను చాలా థేంక్స్ చేసేనని చెప్పమన్నాడు. వంటలు చాలా బావున్నాయట" అని నవ్వాను.

"ఈమాత్రంవాటికి మీతోటి చెప్పివంపడం ఒకటా. మొహం ఎదట థాంక్సయినా చెప్ప లేడా? మళ్ళీ అంత గొప్పవాడు!"

"చెప్పలేక పోడానికో కారణం వుందిలే."

"ఏమిటో?"

"నీకు తెలీదా-విశాలా?"

"నా కెలా తెలుస్తుందండీ?"

"సువ్రతన్ని గుర్తుపట్టలేదా?"

"ఏమో-ఎక్కడో ఓసారి చూసినట్టుంది."

"ఎక్కడో సువ్రతన్ని చూడ్డంకాదు. మీ ఇంట్లోనే, పెళ్ళిచూపుల కొచ్చేడు-మీకు దూరపు బంధువేలగా!....వెంకట నరసయ్యగారని, వీళ్ళ నాన్నగారు రాజమండ్రిలో లాయరు...."

"ఆఁ. అతనా - ఇతను? అరెరె!" అంటూ విశాల కుర్చీలోంచి సగం లేచింది. "వెళ్ళిపోయాడా-ఇంకా ఉన్నాడా?"

"వెళ్ళిపోయాడు బండెక్కించి కదా వచ్చేను!"

"అర్రెర్రె. ఎంతపని జరిగిపోయిందండీ! నాలుగూ మొహాన దులిపేసేదాన్ని కదా! మీరైనా చెప్పేరు కారేమండీ?"

"నా కైనా ముందుగా తెలీదు. భోంచేసి లేచేక కొన్నిసంగతులు అరాతీసి మరీ చెప్పేడు."

అని అతను పొద్దుట కాకతాళీయంగా వాళ్ళపెళ్ళిచూపుల వృత్తాంతం చెప్పడం గురించి తెలియజేశాను

"—ఔనౌను! ఆవేళ, ఇతనూ, వీళ్ళక్కగారూ వచ్చేరు. నన్ను పాటపాడమని, హిందీ బోధపడక నేను సినిమాపాట పాడలేదని వేళాకోళం చేసేరు. సంసారంలోదో-పాతాళభైరవిలోదో పాడమని. కూడా వొచ్చిన మధ్యవర్తి సలహాయిచ్చేడు.... వీళ్ళక్కగారూ లేదూ, ఆవిడ ఎన్నిషోకులు పోయిందనుకున్నారు! భజన పాటలేనా, తత్వాలూ ఆవీ వొచ్చా అంది. "పాట మ్యాశం దివ్యంగావుంది. ఈ పాటికి గ్రామఫోన్లు కొనడం మానెయ్యొచ్చు.' అంటూ ఏమిటేమిటో వాగింది...."

"వీళ్ళింటో జరిగినన్ని ఘోరాలు మా బంధువుల్లో ఎక్కడా ఎరగం. పెద్ద కోడల్ని - బయటుంటే తాటాకుపాకలో పడుకోబెట్టి అర్ధరాత్రిపూట నిప్పుపెట్టేశారు. ఆ మానవుడికి మళ్ళీ ఎవరూ పిల్లనివ్వలేదు. ఇప్పటికీ అలా సన్యాసి బ్రతుకే అఘోరిస్తున్నాడు. రెండో కోడలు వీళ్ళ బాధ భరించలేక కిరసనాయిలు పోసుకొని అంటించేసుకుంది. స్టవ్ పేలిందని కమ్మేశున్నారు. మెడ్రాస్‌లో పనిచేస్తూ ఎవరో ఒక అరవామెని రెండో పెళ్ళి చేసుకున్నాడు....ఆ తరవాత వాళ్ళింటికి పిల్లనిస్తాం అంటూ బంధువుల్లోగాని, తెలిసిన వాళ్ళలోగాని ఎవరైనా వెళ్ళగా ఎవరూ చూడలేదు, వినలేదు.... చూతరాదూ, అయ్యో! ఇప్పటికీ ఘోటక బ్రహ్మచారిగా ఉన్నాడు. మీ కంటే ఓ యాడాది పెద్దేమో మళ్ళీను! అంతా అడపెత్తనం. మంగలి బాజా....మళ్ళీ అందరికీ వొంకలు పెట్టడమే!

'నాకు "దారుణం" అని నిక్‌నేమ్ పెట్టేరండీ; వీళ్ళక్కయ్యా ఇతనూ కలిసి! నేనా రోజున పాడిన కీర్తనలో - దారుణం - అని ఓ ముక్క వొచ్చిందట; ఆ పేరు బంధువుల్లో ప్రచారం చేసేరు. నేను సంగీతాన్ని ఖూనీ చేస్తున్నానుట; దారుణంగానుట!— అయ్యయ్యో, ఎంత పని జరిగిపోయిందండీ ఛాన్సుపోయింది!—'

'ఏమిటది?'

'ఇతనికి సన్మానం చేస్తారంటూ నాలుగు రోజులనాడు గోవిందరావుగా రమ్మాయి ఇతను రాసిన పాటలు పట్టుకొచ్చి వరసలు కట్టమంది. చాలా బావున్నాయని మెచ్చుకున్నాట్టగా. సభలో! - పది నిమిషాలు ముందుగా చెప్పేరుకాదు, ఆయనే యీయనని! - తేల్చి పారేద్దును; సంగీతాన్ని ఖూనీ చేస్తున్నానో ఇంకేం చేస్తున్నానో!'

'నువ్వా, ఆ వరసలు కట్టింది; నాతో చెప్పనేలేదే!'

'ఏం పెద్ద చెప్పేదుండి? - అరెరె; చెయ్యిదాటి పోయిందండి!'

"ఏమీ దాటిపోలేదు - గోవిందరావుగారు ఆ అమ్మాయిని అతనికిచ్చి పెళ్ళి చేస్తారట; అప్పుడెలాగా నిన్ను పిలుస్తారు; అప్పుడు చెబుదువుగాని!'

విశాలి నా జోక్‌కి నవ్వలేదు......

"ఛీ ఛీ - యితనికా? ఎత్తెత్తి కాలు ఎంగిలాకుమీద వేసినట్టు ఇతని కివ్వడమేమిటండీ, బంగారంలాంటి పిల్లని!"

"అబ్బబ్బా, ఇది బాగులేదు విశాలా, మీరిద్దరూ వొకర్నొకరు చిన్నపిల్లల కంటె సిల్లీగా ద్వేషించుకుంటున్నారు; అలగా జనం కంటె దారుణంగా దూషించుకుంటున్నారు. మీరే ఒకర్నొకరు పెళ్ళాడితే ఇద్దరూ ఇద్దరి తప్పుల్నీ క్షమించి-"

"ఛీ! నేనా?"

"అబ్బే, అలాక్కాదు. అనుకోడానికేం- పెళ్ళిచూపులదాకా వచ్చింది కదా. పెళ్ళి చేసుకున్నారే, అనుకో, ఇలా మాట్లాడుతారా, ఒకర్ని గురించొకరు?"

"ఏమో; నేనతన్ని పెళ్లాడి ఉండేదాన్ని కాదు!"

"అది ఇప్పటి మాట! - వాళ్ళ దౌష్ట్యాన్ని ఎత్తిపొడుస్తున్న నీకు, వాటికి కారణాలు కూడా తెలిసుండేవి; అప్పుడు -"

"ఛీ ఛీ - వాళ్ళందరూ......" విశాలి పళ్ళు బిగించింది.

"ఆ మాత్రం అతను కూడా అన్నాడులే. మీరు పీనాసి వాళ్ళట; మీ పెద్దక్క అలాగట; చిన్నక్క ఇలాగట! - ఇలా చెప్పుకుంటూ పోతే కాలం చాలదు! - మీరిద్దరూ నాకు కావాల్సిన వాళ్ళే. అయితే నేనెవర్ని సమర్థించడం?"

"నిజమైన విలువ ఎవరిదైతే వార్ని!"


"నిజమైన విలువ యిద్దర్లోనూ ఉంది-అదంతా ఇప్పుడెందుకుగానీ, ఏదీ ఎక్కసారి ఆ కీర్తన-దారుణం!"

"మీరు మీ ఫ్రెండూ ఎగతాళి చేస్తే మాత్రం ఆ కీర్తన విలువ మాసిపోతుందనుకుంటున్నారా? దానికేమండీ, రత్నంలాటి కీర్తన! శబ్దం, అర్థంకూడా మంచివి!" అని లేచింది విశాల.

శ్రీ రామచంద్ర కృపాళ్ భజమన్
హరణ భవభయ దారుణం
నవకంజలోచన కంజ మృగకర
కంజపద కంజాననం

అని మెత్తగా, కమ్మగా గానం చేస్తూ విశాలి ఇంట్లో ఏదో పని చూసుకోసాగింది.

□□□



రాగ ప్రస్తారం

రివ్వుమంటూ వచ్చి సుళ్ళు తిరిగిన గాలికెరటం బజారులో నడిచేవాళ్ళ మొహాన ఇంత దుమ్మును కొట్టింది.

క్రొత్తవూరు. క్రొత్త బజారు. క్రొత్త మొహాలు కావటంతో కళ్ళింత చేసుకుని బజారు నంతా పరికిస్తూ పరీక్షిస్తూ నడుస్తున్న సారంగపాణి కళ్ళలో సన్నని దుమ్ము చిలకరించినట్లయింది. ఎక్కడి వాడక్కడే క్షణంసే పాగి చేత్తో కళ్ళు నలుపుకుని మళ్ళీ నడక సాగించాడు. అతని నడకతోపాటు మనసుకూడా సాగింది.

కొన్ని యేళ్ళుగా బానిసత్వానికి అలవాటు పడ్డ వ్యక్తికి అయాచితంగా, అకస్మాత్తుగా సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తే దానికి తట్టుకోలే డతను. నీటనుంచి బయటికి విసరివేయబడిన చేపలాగా గిలగిల్లాడుతాడు. సారంగపాణి పత్తు అలాంటి కోవకు చెందినవాడు. రోజూ ఐదు గంటలకల్లా నిద్రలేచి కాలకృత్యాల్ని నిర్వర్తించుకుని వీణని ముందు పెట్టుకుని సాధన ప్రారంభించేవాడు. మంచి వైణి

కుడిగా పేరు ప్రఖ్యాతులు గడించినా, ఏ రాగమైనా ఎంతసేపైనా తడుముకోకుండా వాయించగలిగినా, ప్రతి నిత్యమూ ఆ సాధన మాత్రం మానడు. మరువడు సారంగపాణి. అతి కష్టమైన సున్నితమైన వాద్యం వీణ. ఏ రోజు కారోజు క్రొత్తగానే వుంటుంది. ఎప్పటి కప్పుడు క్రొత్త మెళకువలు ఆకళింపుకు వస్తూనే వుంటా యంటాడు సారంగపాణి. అతని వయసు ముప్ఫయి వుంటుందంటారు అతనెరిగిన వాళ్ళు. కాని పాతికేళ్ళవాడిలాగా కన్పిస్తాడు. చెప్పొచ్చే దేమంటే అలా వైణిక సాధనతో మొదలైన దినచర్య ఆ వైణిక సాధనతోనే అంతమౌతుంది. ఈ మధ్య కాలంలో నాలుగైదు పాఠాల్ని చెప్పుకుని కాలం వెళ్ళబుచ్చుతాడు. అవే అతని జీవనాధారం. తీరిక అనే పదం అతని నిఘంటువులో కనిపించదు. యాంత్రికమైన అలాంటి దినచర్యకు అలవడ్డ సారంగపాణి ఈ రోజు వైణికసాధన, చెప్పవలసిన పాఠాలుమాని క్రొత్తవూరిలో వీధులవెంట తిరుగుతూ ప్రొద్దుపుచ్చటం కష్టంగానేవుంది.


అవతలివేపున వున్న హోటల్లోనుంచి చక్కని కర్ణాటక సంగీతాన్ని ప్రసారం చేస్తోంది రేడియో. మోహనరాగంలోని కృతి అప్పుడే ముగిసింది. గాయకుడు స్వరం వేస్తున్నాడు. స్వరం అవగానే ప్రక్క వాద్యాలు ఆ స్వరాన్ని పలికిస్తున్నాయి.

నాగస్వరానికి మంత్ర ముగ్ధమై తల వూపుతూ ఎక్కడిదక్కడ ఆగిపోయే జాతి సర్పంలా క్షణంసేపు నిల్చుండి పోయాడు సారంగపాణి. అది అతనికి ప్రియతమమైన రాగం. కొన్ని సంవత్సరాలు ప్రత్యేకంగా ఆ రాగంపై పరిశోధనజరిపి క్రొత్తసంగతులతో క్రొత్త పోకడలతో ఆ రాగాన్ని తీర్చి దిద్దాడు. తనవాద్యకచ్చేరిలో ఆ రాగాలాపన ఒక ప్రత్యేకాకర్షణ. తనవద్ద నేర్చుకునే శిష్యులకు సైతం ఆ రాగాన్ని ప్రత్యేకమైన శ్రద్ధతో ఆసక్తితో నేర్పేవాడు....అనుకోకుండానే అతను-రోడ్డుకడ్డంగా-ఆ హోటలు వేపు నడిచాడు.

చిన్నకారొకటి సర్రున మూలిగి సడెన్‌గా ఆగింది. మోహనరాగంపైపు పరుగులెత్తే మనసుకు కళ్ళె బిగించినట్లయింది. ఎదురుగా చిన్నకారు కళ్ళకు కన్పించింది సారంగపాణికి. మొదట్లో తానా కారుకు అడ్డం పోయానేమోననిపించింది. కాని అలా జరుగలేదు. అకారే తనకు అడ్డంవచ్చింది. తనకు కారు అడ్డంరావటమేమిటి? తన భావన తనకే అబద్ధంగా తోచింది. అందుకని మరోవిధంగా సమాధ పర్చుకున్నాడు మనసును. ఆ కారుకూడా మోహనరాగం కోసం ఆగిందేమోనని.

అలా అనుకోటంలో సారంగపాణి పూర్తిగా పొరబడలేదనేచెప్పాలి. ఏమంటే అందులోంచి అంటే ఆనల్ల చిన్నకారులోంచి దిగిన ఆసామీ సంగీతాభిమాని అనీ, మోహనరాగ ప్రియుడని సారంగపాణికి తెలుసు. ఆయన పేరే బంగారయ్య. ఆయన చేతివ్రేళ్ళలో ఎనిమిదింటికి రంగురంగుల రాళ్ళుగల్గ ఉంగరాలున్నై. బొగ్గులోంచే మాణిక్యాలూ, మరకతాలూ పుట్టాయనే సత్యాన్ని రుజువు పరుస్తున్నాయా అన్నట్లుగా నల్లని దేహచ్ఛాయ కలిగిన బంగారయ్య చేతివ్రేళ్ళకు. చెవులకువున్న బంగారపు వస్తువులలోని విలువగలరాళ్ళు వింత కాంతుల్ని వెదజల్లుతున్నాయి.

విహారి & శాలివాహన



బంగారయ్య పేరుమోసిన బట్టలవ్యాపారి. ఆయనకు రెండువేపులా రెండు లకారా లున్నవనే వదంతికూడా లేకపోలేదు. తాను రెండు లకారాలతో వున్నానని బంగారయ్య నమ్మడు. ఎందుకంటే తా నింకా గడిద్దామన్నే చూస్తున్నాడు. అంత కాంక్ష ఆయనకు. కాని ఒక్క సుగుణం. ఏ మాట కా మాటే చెప్పుకోవాలి మరి. కాం తా కనకాలపైన కాంక్ష ఎవరి కుండదు గనుక ; అయితే ఆ కాంక్ష లున్న వాళ్ళందరూ బంగారయ్యలు కాలేరు. బంగారయ్యలో త్యాగబుద్ధి వుంది. లలితకళలను ఆదరించి అవందించే గుణ సంపన్నతవుంది. ఉన్నదనే విషయాన్ని తెలుసుకుని నలుగురికి చాటిచెప్పిన ఘనత సారంగపాణికే దక్కుతుంది.

సంగీతమన్నా, అందునా మోహనరాగ మన్నా చెవి కోసుకునే బంగారయ్యకు సారంగపాణితో స్నేహం కుదరటంలో ఆశ్చర్యంలేదు. వ్యాపారం నిమిత్తం ఏదో వూరు పోయిన బంగారయ్య అక్కడ కచ్చేరీ చేస్తున్న సారంగపాణిని, అతను ఆలపించిన మోహనరాగాన్నిచూసి, విని వర్ణించనలవికాని ఆలౌకి కానందాబ్ధిలో గ్రుంకులిడి, సారంగపాణిని సమీపించి. "మీ కుటుంబ భారాన్ని నా భుజాలమీద వేసుకుంటాను. మా వూరు వచ్చి, మాతోనే వుంటూ రోజూ మాకు మోహనరాగాన్ని విన్పించాల్సింది" అని ప్రాధేయపడ్డాడు.

వెనుకటి రాజులు - సంస్థానాధీశ్వరులు కవులను, గాయకులను తమ ఆస్థానాల్లో వుంచుకుని పోషిస్తూ రసాస్వాదన చేసేవారని, ఈ రోజుల్లో ఆ కళలను ఆదరించే వాళ్ళుంచి, ఆలకించేవాళ్ళుకూడ కరువైనారని మనసులోనే గ్రిగ్గుళ్ళే సారంగ పాణికి బంగారయ్య అభ్యర్ధన తా నివ్వ డెక్కడున్నాడనే సందేహం కల్గించింది. బంగారయ్య చూడకుండా చేతిని గిల్లి చూసు కుని, జరుగుతున్నది వాస్తవమేనని నిర్ధా రించుకుని ఎంతో వినయంతో ఆనందంతో "సరే"నని ఒప్పుకున్నాడు.

అయితే ఒక్క సవరణను ప్రతిపాదిం చాడు సారంగపాణి. అతి సర్వత్రవర్జయేత్ అన్నారు శాస్త్రకారులు. పాత్ర అంచుల్ని పొంగిపొరలే అమృతమైనా, చెలియలికట్టను దాటే ప్రేమ సాగరాలైనా ఎప్పటికైనా ప్రమాదజనకాలేనని సారంగపాణికి తెలుసు. "నా కుటుంబ భారం అంతటినీ మీరు మోయటం బదులుగా మీకు ఒక్క మోహనరాగమే విన్పించటం ఏమంత సమంజసంగా లేదు. అందుకని మీ వూరి లోనే నాలు గైదు పాఠాలు కుదుర్చితే వాటితో పొట్టపోసుకుంటూ మీకు కావలసి నప్పుడల్లా నాకు చేతనైన ఈ వీణావాద్యాన్ని మీకు విన్పిస్తూ మీ అండను బ్రతుకుతాను" అని అన్నాడు. బంగారయ్య పరమానంద భరితుడై సారంగపాణితో యిల్లుచేరాడు.

సారంగపాణికి బంగారయ్యతోడి పరి చయం అలాంటిది.

బంగారయ్య నల్లనివాడే అయినా ఈరోజు ఆయన మొహం మరీ నల్లగా కనిపించింది సారంగపాణికి. బంగారయ్య ప్రక్కనే వున్న వ్యక్తి - ఎక్కడో చూచినట్లే గుర్తు. పోలికల్నిబట్టి చూస్తే బంగారయ్య బావ మరిదిలావుంది. బంగారయ్య ఒకసారి పరి చయం చేసినట్లుగా కూడ గుర్తు - ఆవ్యక్తి మొహం కందగడ్డలా కందివుంది. కళ్ళలో కోపమూ, క్రౌర్యమూ ఉట్టిపడుతున్నై. ఎందుకో ! ఎవరిమీదో ! !

సారంగపాణి చిరునవ్వుతో పలుకరిం చాడు బంగారయ్యనూ ఆ మరోవ్యక్తినీ.

'ఇక్కడున్నారేం మేష్టారూ ?' బంగా రయ్య దీన స్వరంతో పలుకరించా' గుంటూరు నూతిలో నుండి వచ్చినట్లుగా వుంది ఆస్వరం.

'నిన్న ఉదయమే వచ్చానండీ ఈవూరు, కొంచెం పనివుంది....'

'మీరు ఎప్పుడొచ్చిందీ మాకు తెలుసు. ఎందుకొచ్చిందీ తెలుసు మేష్టారూ !'. కోపాన్ని దిగమ్రింగుతున్న ధోరణిలో అన్నాడా మరోవ్యక్తి సారంగపాణిని మధ్యలో ఆపి.

సారంగపాణికి అంతా అయోమయంగా వుంది. తను ఎప్పుడు వచ్చిందీ, యెందుకు వచ్చిందీ ఆతగాడికి తెలియడమేమిటో, తన మీద ఈ అకారణకోప మేమిటో అంతుబట్ట లేదు. కాని ఇలా అన్నీ తెలుసునని దాంబి కాలు పలికేవాళ్ళే చివరికి ఏమీ తెలియని వాళ్ళుగా నిరూపింపబడ్తారని అతని దృఢ మైన నమ్మకమూ, అనుభవమూనూ. ఒక సారి ఎక్కడో జరిగిన చిన్న సంఘటన జ్ఞప్తికొచ్చింది.

తను వాద్యకచ్చేరీ చేస్తున్నాడు. పండితులూ, పామరులూ అందరూ విని ఆనందించే సంగీతం. వీణలాంటి సున్నితమైన వాద్యంమీద ఆ సంగీతం యింకా మనోహరంగానూ, శ్రావ్యంగానూ విన్పిస్తోంది. అందరూ వింటున్నారు. తలలు వూపుతున్నారు. తన వాద్యాన్ని అంతమంది విని ఆనందిస్తున్నారంటే అంతకంటేకావలసిందేముంది కళాకారునికి! మనసు పారవశ్యంతో నిండుతుంది. కించిత్తు గర్వంకూడా పొడసూపటం అపహాణంకాదేమో. అలాగే అనుభూతిని చెందాడు సారంగపాణి ఆనాడు. ఇంతలో శ్రోతలలో ఒకరివద్దనుండి ఒక చిన్నచీటీ వచ్చింది. ఆ చీటీని యెవరు పంపిందీ, అంచెలంచెలుగా యెలా వచ్చిందీ అంతా గమనిస్తూనే వున్నాడు సారంగపాణి. ఆ చీటీలో 'ఆనందభైరవి' రాగం వాయించమనే కోరిక వ్యక్తం చేయబడ్డది. ఆచీటీ పంపినవ్యక్తి మంచి డబ్బూ, పలుకుబడి వున్నవాడిలా వుంది. వాటికితోడు సంగీత పరిజ్ఞానమేమైనా వుందా, లేక ఏమీ తెలియకపోయినా, తెలిసినట్లుగా నటిస్తూ, తల వూపుతూ, తన పరిజ్ఞానాన్ని గమనించండోయ్! అన్నట్లుగా ఈరాగం వాయించు, ఆపాట వాయించు అని చీటీ పంపాడా తెలుసుకోవా లనిపించింది సారంగపాణికి. చిన్న వుపాయం తట్టింది, వెంటనే ఆనందభైరవి కాకుండా మరోరాగం వాయించాడు. వైణికుడు తను కోరినరాగమే వాయిస్తున్నాడనుకున్న ఆశ్రోత మహానందభరితుడై తలవూపి చప్పట్లు చరిచాడు. సారంగపాణికి నవ్వు వచ్చింది.

సన్నని నవ్వు పెదాలపై తళుక్కుమంది సారంగపాణికి.

"నవ్వేదువుగానిలే" అన్నాడు, బంగారయ్య ప్రక్కనున్న వ్యక్తి కోపంగాచూస్తూ.

"గోపాలం!" బంగారయ్య మందలింపుగా పిలిచాడా వ్యక్తిని.

అప్పు డనుకున్నాడు సారంగపాణి నిజంగానే ఏదో జరిగి వుంటుందని.

సారంగపాణి భుజంపై చేయి వేస్తూ "రండి మేష్టారూ!" అని కారువైపు దారితీశాడు బంగారయ్య. సారంగపాణి ఆలోచనా మనస్కుడై బంగారయ్యను అనుసరించి వెళ్ళి కారులో కూర్చున్నాడు మోహనరాగాన్ని మరచిపోయి. కారు కదిలింది మెల్లగా.

"ఎటు పోనీమంటారు?" డ్రైవరు ప్రశ్నించాడు బంగారయ్య నుద్దేశించి.

"ఎటువెళ్ళాలి మేష్టారూ!" బంగారయ్య సారంగపాణిని ప్రశ్నించాడు.

సారంగపాణి తడబడ్డాడు. ఎటువెళ్ళాలని తనని అడుగుతాడేమిటి? మాటా - మంతీ, మంచీ చెడ్డా చెప్పకుండానే తనని కారులోకి ఎందుకు ఎక్కించినట్లు? ఎక్కడికి వెళ్లాలి- ఎటు వెళ్లాలని తననే అడగట మేమిటి? సమాధానం దొరకలేదు.

బంగారయ్యకు సారంగపాణినుంచి సమాధానం రాలేదు. మళ్ళీ ప్రశ్నించాడాయన 'ఎక్కడ దిగారు?'

'దిగడమేమిటి?' అయోమయంగా ప్రశ్నించాడు సారంగపాణి.

'అదే బసచేయటం'

"నే నెక్కడా బస చేయలేదు. నా మిత్రుని కొడుకు ఒకడు కాలేజీలో చదువుతుంటే సంచీ అక్కడ పడేసి తిరుగు

తున్నాను. అనుకున్న పని ఒక్కటీ కాలేదు."

ఆశించిన సమాధానం సారంగపాణి నుండి రాకపోవటంతో బంగారయ్యకు విసుగు పుట్టింది. తాను పొరపడ్తున్నానేమో ననే అనుమానమూ వేసింది. అందుకనే అసలు విషయాన్ని కదిలించాడు. 'అమ్మాయి ఎక్కడుంది?'

'ఏ అమ్మాయి?' సారంగపాణి ఎదురు ప్రశ్న వేశాడు.

'నీవుతీసుకొచ్చిన అమ్మాయి' గోపాలం ఆక్కసుగా అన్నాడు.

'మా సుబ్బులు' బంగారయ్య విశదపరిచాడు.

'మీ సుబ్బులా?' అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడేగాని సారంగపాణికి అసలు సంగతి కొంత అవగాహన అయింది. సుబ్బులు యింటిదగ్గర, లేదన్నమాట. ఎక్కడికి వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది? తను పంపిన ఉత్తరం సుబ్బులుకు అందలేదా? శరీరంలోంచి ఒక ప్రాణం లేచిపోయి నట్లైంది.

సుబ్బులు బంగారయ్య కుమార్తె.

సారంగపాణి బరువుగా నిట్టూరుస్తూ 'అయితే సుబ్బులు యింటిదగ్గరలేదా?' అన్నాడు.

ఈసారి బంగారయ్య కస్సుమన్నాడు. కారులో టాపు కొట్టుకునేంతగా యెగిరిపడ్డాడు. కళ్ళలో సాధ్యమైనంత కోపాన్ని నిలుపుకుని చూపుల్లో కురిపించాడు. 'మే మంత వెర్రివాళ్ళమనుకోకు మేష్టారూ! చేసినపని చేసినట్లు ఒప్పుకోక సంగనాచిలా మాట్లాడ్తావేం? నీ నాటకాలు నాదగ్గరకాదు. నిన్ను నమ్మి, అభిమానించి, దగ్గరకుతీసి, ఆదరించినందుకు తలేపనిచేశావయ్యా. పాలు త్రాగినా పాముకోరల్నే పెంచుకుంటుందిట. నిన్నేంచేస్తేమటుకు పాపముంది?'

'బంగారయ్యగారూ! మీరనేదేమిటో బోధపడటంలేదు. ఇందులో నా నేరమేం వుందని?'

సారంగపాణి సమాధానాన్ని వినిపించుకోకుండానే బంగారయ్య తిరిగి అన్నాడు. 'పెళ్ళి అయినవాడివి. పెద్దమనిషివి. నీకిదేం పొయ్యేకాలం? పెళ్ళికాని పిల్లను, పరువుగల కుటుంబాన్ని అల్లరిపాలుచేసి నీవు బావుకునేదేమిటి? ఇప్పటికైనా చెప్తావా అమ్మాయిని ఎక్కడుంచావో?'

'అయితే నన్ను అనుమానిస్తున్నారన్నమాట'

'పిచ్చివాడా! నీ సంగతి అంతా తెలిసింది. ఇంకా ఎందుకు ముసుగు? నీకూ అమ్మాయికీ మధ్య ఉత్తరాలు మోసిన అక్కమ్మ అంతా చెప్పింది.'

అక్కమ్మ బంగారయ్య యింట్లో పనిమనిషి. అక్కమ్మ సుబ్బులుదగ్గర్నుండి ఉత్తరాలు మోసుకొచ్చినమాట వాస్తవమే. వాటికి తగినసమాధానాల్ని తాను అక్కమ్మ ద్వారా పంపటంకూడా నిజమే. అయితే తను దోషిమాత్రంకాదు. అది నిప్పులాంటి నిజమే అయినా ఒక పట్టాన బయటపడదు. తను చెప్పినా నమ్మరు. నిదర్శనం చూపటానికి తను అసమర్థుడిప్పుడు పరిస్థితు లను కూలించి నిప్పులాంటి నిజం గుప్పుమనే వరకూ తనీ నిందను మోయావలసిందే.

'బంగారయ్యగారూ! మీరు అపోహపడ్తున్నారు. నేనేపాపం ఎరుగను. మీసుబ్బులు

మాయమవటానికి నేను కారకుణ్ణిగాదు. విశాల! మీరిది నమ్మరు. దోషిని నేనేనని మీరు అనుమానిస్తున్నారు గనుక మీ కుమార్తెను వెతికి మీ కప్పగించే బాధ్యత నాకున్నది. అలా వప్పగిస్తాను. అవకాశ మివ్వండండి'

గోపాలం గలగలా నవ్వాడు. అంతలోనే కోరగా చూస్తూ 'ఈ గోపాలం చేయి కబంధహస్తం. ఈ చేతిలో పడ్డవాడెవడూ తప్పించుకుపోలేడు. తప్పించుకోటానికి వ్యర్థ ప్రయత్నాల్ని చేసి మమ్మల్ని విసిగించకండి మేష్టారూ!' అన్నాడు హెచ్చరికగా వేలుచూపిస్తూ.

బంగారయ్య మాట్లాడలేదు. గోపాలం మాటల్ని సమర్థిస్తున్నట్లు మౌనంగా కూర్చున్నాడు.

సారంగపాణి అన్నాడు "నన్ను మీరు విడిచిపెట్టనవసరంలేదు. మన మంతా కలిసే వెతుకుదాం. సుబ్బులు కనపడేవరకూ నేను నిద్రాహారాల్ని విసర్జిస్తాను. కారు పోనీయండి" కారు వేగాన్ని అందుకుంది.

• • •

"మాధవీ! మాధవీ!"

తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా నిలిచిన వ్యక్తినిచూసేసరికి మాధవి ఆశ్చర్య పోయింది. వంటినిండా నగలతో. రేగిన జుట్టుతో. చేతిలో సంచీకూడ లేకుండా వచ్చిన సుబ్బులు మాధవినిచూసి చిరునవ్వు నవ్వింది.

"సుబ్బూ! నీవా! రా లోపలికి. ఏమిటీ ప్రత్యక్షం? ఎప్పుడొచ్చావు వూరునుంచి?" ప్రశ్నలవర్షం కురిపించింది మాధవి.

"ఇప్పుడే రావటం. నిన్నటినుండీ గమ్యం లేకుండా ప్రయాణం చేస్తూనే వున్నాను. వివరాలు తర్వాత చెప్తా. ముందు నన్ను విశ్రాంతి తీసుకోనీ." మాధవి మాట్లాడలేదు. ఎందుకో ఆమె గుండెలు గుబగుబలాడినాయి. స్నేహితురాలు ఏవో సాహసమే చేసిందనిపించింది. వెంటనే స్నానానికి, భోజనానికి కావలసిన ఏర్పాట్లన్నీ స్వయంగా చూసింది.

సుబ్బులు విశ్రాంతిగా మేను వాల్చింది "మళ్ళీ సాయంత్రం నాలుగ్గంటలదాకా నిన్ను డిస్టర్బు చేయనులే. కరువు తీరేవరకూ విశ్రాంతితీసుకో" అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది మాధవి. సుబ్బులు తలుపు గడియపెట్టి వచ్చి పడుకుంది.

నిద్రపోదామని కళ్ళు మూసుకుందో లేదో మేష్టారు ప్రత్యక్షం. ఆశ, ఆనందమూ, ఆశ్చర్యమూ ఒకదానివెంట ఒకటి మనసులో ఉద్భవించి కళ్ళు తెరవమని బలవంతం చేశాయి. కళ్ళు తెరిస్తే అంతా కల్ల. భారంగా నిట్టూర్చింది సుబ్బులు. మేష్టారి మీద కోపం వరదలా ముంచుకొచ్చింది. మనసు బుసలుకొట్టింది. బుద్ధి హెచ్చరించింది. "పాపం మేష్టారేం చేశాడు నిన్ను?"


మనసు జవాబు చెప్పింది. 'ఏంచేశాడా! ఏం చేయాలో అదే చేశాడు. శివశ్రీలేని మొగవాడిహృదయం పిరికితనపు జన్మస్థలం. దుర్బలత్వాన్ని, చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోటానికే నీతి, గౌరవం అనే ముసుగులు ఉపయోగిస్తాయి. ఛీ! అలాంటి మగవాడి మీద ఆశలు పెంచుకున్న ఏ స్త్రీ బాగుపడింది?'

మందు వేసవిలో మలయానిలంలాగా జాలికెరటం ఒకటి అటువేపుగా వచ్చింది. 'పాపం. మేష్టారు అమాయకుడు. తప్పంతా నాదే. నాదికూడాగాదు. ఈ మాధవిది' అనిపించింది సుబ్బులుకి.

'నాదా?' కలగా ప్రశ్నించింది టేబులు మీద మాధవి ఫొటో.

'ఆ నీదే! ఆరోజు నీవామాట అనకుండా ఉన్నట్లయితే యింతకథ జరిగేదేనా?'

ఆరోజు అంటే మేష్టారు సుబ్బులుకి సంగీతపాఠం మొదలెట్టేరోజు. మాధవి అక్కడేవుంది. 'శ్రీ గణనాథా' అంటూ పిళ్ళారిగీతాలు మొదలెట్టి చెప్తుంటే తను సరిగా పలుకలేకపోయింది. మనసుఎక్కడో సంచరిస్తుంటే దానిసేవకులైన నయనాలు మేష్టారి చుట్టూ ప్రదక్షిణాలు చేశాయి. ఫలితంగా పల్లవికూడ ఆ రోజు పూర్తిచేయలేకపోయారు మేష్టారు. ఆనాటికి పాఠం చాలించి "రేపట్నుంచి రెగ్యులర్‌గా చెప్తుంటాం లే"మ్మని వెళ్ళిపోయా రాయన. తను మాత్రం బొమ్మలాగా అలాగే కూర్చుండిపోయింది. ఎందుకో లేవాలనిపించలేదు. మేష్టారు అటు వెళ్ళటం - మాధవి యిటు రావటం ఒకేసారి జరిగాయి. మాధవి భుజంతట్టి పలకరించేసరికి ఉలిక్కిపడింది తాను. అప్పుడంది మాధవి "మేష్టారు యిక్కడికొచ్చిందెందుకో తెలుసా? నీకు



పాఠం చెప్పటానికి. పెళ్ళిచూపులకి గాదు. ఆయనవేపు అలా పిచ్చిగా చూడటమే కాకుండా ఆయన నీలాగా నీ వైపు చూడ లేదని బాధపడుతున్నట్లుగా వున్నావ్!"

తను సురసురాచూసి "మేష్టారి గొంతు బావుంటుంది కదూ!" అంది మాటమారుస్తూ.

"కలర్ కూడా. కదూ!" మాధవి నవ్వి మళ్ళీ అంది-"ఇదుగో పిల్లా! ఎర్రగా బొద్దుగా ఉన్నాడుగదా అని వెర్రిమొర్రిగా ప్రవర్తించకు. సంగీత విద్వాంసులు సహజంగా సరసులూ, రసికులూ అయివుంటారు" పరిహాసాని కన్న మాధవి హెచ్చరిక తనకు నిజంగానే మేలుకొలుపైంది. వసంతుడి రాజ్యం ప్రారంభమైంది. పల్లవకి గళంవిప్పి పాడింది. నెమలి పురివిప్పింది.

రాలని సెకం కరిగించే శక్తి సంగీతానికి వుందిట. అదేమోకాని. స్త్రీహృదయాన్ని మాత్రం వెన్నలా కరిగిస్తుంది. సంగీతం దీపపు కళిక ఐతే ఆ జ్వాలకి కరగి తనను కరిగించిన జ్వాలకే ఇంధనంగా ఉపయోగపడే మైనపు ముద్ద స్త్రీ. ముఖ్యంగా సుబ్బులు లాంటి స్త్రీ. మేష్టారు తంబురా మీటుతూ పాఠం చెపుతుంటే తను వెర్రిగా చూసేది ఆయనవేపు. ఆ కళ్ళతోనే నవ్వేది. పలుకరించేది. మేష్టరుకూడ తన పలుకరింపులకు నవ్వులకు ప్రతిగా పలుకరించేవారు. నవ్వేవారు. లేక అలా నటించారో! సంకల్పానికి సహకారం లభించినప్పుడు మనసు తీగలు సాగక ఏం చేస్తుంది? లతలాగా అల్లుకపోవాలనిపిస్తుంది సుబ్బులుకి. అతని గానంలో తన్మయమై, అతని చూపుల్లోనుంచి అతనిలో అంతర్లీనమైపోవాలనిపిస్తుంది. చివరకు ధైర్యంచేసి లేఖద్వారా తన బాధను వ్యక్తంచేసుకుంది. మేష్టరు దానికి సమాధానమే యివ్వలేదు. మళ్లా వ్రాసింది. మేష్టరు జవాబువ్రాస్తూ "నీవు వ్రాసిన ఉత్తరం చేరింది. ఉత్తరం వ్రాయవలసిన అవసరమేం వచ్చిందో అర్థంకాలేదు. నేను రోజూ పాఠం చెప్పటానికి వస్తుంటినిగదా! ఏమైనా చెప్పదలిస్తే అప్పుడే చెప్పవచ్చును గదా. సముఖంలో రాయటారాలా? సముఖంలో మాట్లాడటానికి భయమా సిగ్గా? భయం తండ్రిదగ్గర. సిగ్గు భర్త దగ్గర. నేను నీకు గురువును. నీ శ్రేయస్సును, మంచిని కాంక్షించేవాడిని. అందుకే నీ వుత్తరం చదవకుండానే నీకు సమాధానం వ్రాయకలుగుతున్నాను. అర్థంచేసుకుంటావనుకుంటాను" అని వ్రాశాడు.

తన ఉత్తరం చదవకుండానే సమాధానం వ్రాయట మేమిటో అర్థంకాలేదు సుబ్బులుకి. తన ఉత్తరం చదివితే మేష్టరు యిలా వ్రాయవే వ్రాయరు అనిపించింది. అందుకని మళ్ళా ఉత్తరంరాసి పనిమనిషి అక్కమ్మ చేత పంపుతూ 'దీన్ని చదవకపోతే చచ్చిపోతానంది' అని చెప్పమంది.

మేష్టారి రెండో సమాధానం సుబ్బులి ఆశలమీద చన్నీళ్ళు చల్లింది. దాన్నిచదువుతున్న సుబ్బులు కుప్పలా కూలింది. 'సుబ్బులూ! నీ ఉత్తరం చదివాను. ఎండలో నడుస్తూ పచ్చద్దాల చలువకళ్ళజోడు పెట్టుకుంటే ప్రపంచమంతా పచ్చగా కనిపిస్తుంది. అంతమాత్రంచేత ప్రపంచం పచ్చగా ఉంటుందని అనుకోము. అలాగే కాముకత ఆవరించిన నీకళ్ళకి నాకళ్ళలో, కదలికలో చపలత్వం గోచరించిందంటే అందుకు నే నా బాధ్యుడ్ని? తెలిసీ తెలియని వయసులో పిల్లలకు చెడు అలవాట్లు పట్టుబడుతుంటాయి. కొన్నిటిని ఆదిలోనే త్రుంచివేయాలి. కొన్నిటిని మాత్రం సమయం వచ్చేవరకూ ఆపాలి. ఈలోగా ఆ అలవాటుద్వారా కొంత మంచిని సాధించాల్సి ఉంటుంది. నీ విషయంలోకూడా అలాగే జరిగింది. నీ మనసును నేను మొదట్లోనే కనిపెట్టాను. అయితే అప్పుడే నేను బయటపడితే నీకు పాఠాలు ఆగిపోవటమే గాకుండా నా జీవనోపాధి పోతుంది. అందుకని యిన్నాళ్ళు నీ మనసుకు అనుగుణంగా నడుస్తున్నట్లు నటిస్తూ కాలం గడిపాను. నీకు శిక్షణ పూర్తి అయింది. నాబాధ్యత కొంత తీరింది. నాకు భార్యావియోగం కలిగి సంవత్సరం కావస్తున్నా మీ నాన్నగారు రెండోవివాహం చేసుకోమని వత్తిడి చేస్తున్నా నాకా తలంపు కలుగనేలేదు. ఇక కలుగదుకూడా. అందుచేత నీ అభ్యర్థనను అంగీకరించలేనని తెలుపుటకు చింతిస్తున్నాను. నా యీ వుత్తరం నీ ఆశలకు అఘాతమే కావచ్చు. కాని గత్యంతరం లేదు. పరిస్థితులు ఇంతగా విషమించినప్పుడు నేనింకా ఈవూళ్ళో వుండటం నీకూ నాకూ క్షేమదాయకం కాదనుకుంటాను. అందుకే నేను త్వరలోనే ఈవూరువదలివెళ్తున్నాను. మరోచోట ఉపాధి కల్పించుకునేందుకు ఈరోజే వెళ్ళి ప్రయత్నిస్తాను. ఈవుత్తరం నీకందేసరికి నే నీవూళ్ళో ఉండనుగాబట్టి నా ప్రయాణాన్ని ఆపే ప్రయత్నం పెట్టుకోకు. నన్ను మర్చిపో!.

గబగబా లేచి స్టేషనుకు పరుగెత్తింది సుబ్బులు అప్పటికే రైలు వెళ్లిపోయింది. మేష్టరు అంత హఠాత్తుగా వెళ్ళిపోవటానికి కారణం తనేనా అనిపించింది సుబ్బులుకి. తనుమాత్రం ఏం తప్పుచేసింది? రెండు సంవత్సరాల పరిచయంలో మేష్టరి హావభావాల్ని వేరొకవిధంగా అర్థంచేసుకుని, తనతో వివాహానికి సుముఖుడుగా ఉన్నాడని అపోహపడింది. తన అభిమతాన్ని వ్యక్తంచేస్తూ అలా వుత్తరం రాయటంలో తొందరపడింది. ఏ స్త్రీకూడా అలా ముందడుగు వేయదేమో. అందుకు కారణంకూడ లేకపోలేదు. భార్యావియోగానంతరం మేష్టర్ని నాన్నగారు 'మళ్ళీ వివాహం చేసుకోండి' అని రెండుమూడుసార్లు చెప్పినపుడు 'చూద్దాంలెండి బంగారయ్యగారూ!' అని మేష్టరు సమాధానం చెప్పటం తను విన్నది. అందుకే మేష్టరు మళ్ళీ పెళ్ళి చేసుకోటానికి సుముఖుడుగా వున్నాడని తలచి అంత చొరవ తీసుకుంది.

స్టేషన్లో ఇటు వెళ్ళేబండి కదలబోతోంది. ఇంటికి పోవటానికి మనసొప్పని సుబ్బులు అప్రయత్నంగా రైలు ఎక్కింది.

మాధవి అంతా విన్నది. విని "ఎంత పొరపాటుచేశావు సుబ్బులూ!" అంది.

"ఏం?"

"నీ విలా రాకుండా ఉండవలసింది."

"..................."

"మేష్టరు ఎక్కడికో వెళ్ళారు. నీ విటు వచ్చావు. ఇప్పుడు మీ వూళ్ళో అందరూ ఏమనుకుంటారో తెలుసా! సుబ్బులు మేష్టరితో లేచిపోయిందనుకుంటారు. పోలీసు రిపోర్టు యిస్తారు. వెతికి వెతికి మేష్టర్ని పట్టుకుని "మా అమ్మాయిని ఎక్కడదాచావో చెప్పమని బాధిస్తారు. పాపం ఆయన ఎంతగా బాధపడ్తారో! అవమానం ఒకవేపు. బాధ మరోవేపు-ప్ప."

మాధవి ఊహా అసమంజసంగా తోచ లేదు సుబ్బులుకి. కాని తానుగా చొరవ తీసుకుని తన హృదయాన్ని అర్పణ చేస్తానని ముందుకు వచ్చినా, తనేదో తప్పుగా ప్రవర్తించినట్లు అర్థంచేసుకుని, ఇలా తనను తిరస్కరించి అవమానించినందుకు ఆయన కూడ ఇలా అవమానం పొందాల్సిందే నని పించింది. అంతలోనే, తనకోసం మేష్టరు పడిన శ్రమ, యిష్టమున్నా లేకపోయినా, తనమీద ప్రేమ వున్నట్లు నటిస్తూ, తన సంగీతాభ్యాసం పూర్తిచేసిన మేష్టర్పై గురు భావం ఉదయించి నిజంగానే ఆయన అనవసరంగా అపోహలకు, అవమానానికి గురి యౌతారేమోనని నొచ్చుకుంది. తానిక ఉపేక్ష చేయకూడదని, ఆకారణంగా ముంచుకువచ్చిన మంచుతెరల్లాంటి అపోహానుమానాల్ని చెదరగొట్టాలని అనుకుంది. కర్తవ్యం బోధపడినా అందుకు అవలంబించ వలసిన మార్గంకోసం గాఢంగా ఆలోచించింది.

స్నేహితురాలిలో వచ్చిన పరివర్తనను మాధవి అర్థం చేసుకుంది. గాఢంగా నిట్టూరుస్తూ "అయితే పద" అంది.

• • •

తిరిగి తిరిగి యిల్లు చేరిన బంగారయ్య, గోపాలం, సారంగపాణి ఇంట్లో సుబ్బులు కనిపించేసరికి ఆశ్చర్యపోయారు. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. సుబ్బులు తల దించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఉసురుసురుమంటూ కుర్చీలో కూలబడిన బంగారయ్య నుద్దేశించి మాధవి అంది

"ఏమిటండీ బాబాయిగారూ! ఏదో హడావిడి చేశారుట?"

బంగారయ్యకు ఏం మాట్లాడాలో తోచ లేదు.

మాధవే మళ్ళీ అంది. "సుబ్బులూ నేనూ ఉదయం వచ్చేసరికి ఊరు ఊరంతా కాకిగోలగావుంది. మనిషి కనపడక పోయినంతమాత్రంచేత యిష్టమొచ్చినట్లు ఊహాగానాలు చేసుకుని అభాండాలు వేయటమేనా? లోకం గ్రుడ్డిదై కారుకూతలుకూస్తే సరిదిద్దవలసిన మీలాంటివారే యిలాచేస్తే వేరే అనుకోవలసిన పనేముంది? ఛీ-ఛీ సిగ్గుచేటు."

"అయితే నిజంగా సుబ్బులు నీ దగ్గర కొచ్చిందా" అనుమానంగా ప్రశ్నించాడు బంగారయ్య.


"అయితే నేను అబద్ధాలు చెపుతున్నానంటారా? కావలిస్తే మా ఇంట్లో విచారించి రండి విజయవాడ వెళ్ళి."

"ఇంట్లో చెప్పకుండా ఎందుకు వచ్చిందిట?"

"ఇదుగో ఇలా రాద్ధాంతం చేదామని" వ్యంగ్యంగా అంది మాధవి.

తను వేసిన ప్రశ్నకు సమాధానం సరిగా రాలేదని గమనించలేదు బంగారయ్య. మరో అనుమానం అయన్ను పీడిస్తూండటవల్ల. అదీ అడిగేశారు "మరి అక్కమ్మ అలా చెప్పిందేం?"

'అక్కమ్మ కాదది. తల తిక్కమ్మ. "రేపు ఊరికెళ్తున్నాము కాబట్టి రేపు పాఠం చెప్పటానికి రావొద్దు" అని చీటీ వ్రాసి



పంపింది సుబ్బులు మేష్టరుకు. అంతకు ముందే మేష్టరు కూడా ఏదో పనిమీద వూరికి వెళ్ళే ప్రయత్నంలో ఉండటంవల్ల ఆసంగతే జవాబుగా వ్రాసి, తాను రెండు మూడురోజుల వరకూ రానని కూడా తెలియజేస్తూ చీటీ వ్రాసి పంపారు మేష్టరు. ఈ చీటీలని చూసి అనుకోవలసిన విధంగా అనుకుని మీతో చెప్పింది అక్కమ్మ' మాధవి చెప్పటం ముగించింది.

అల్పలోహంతో మేలిమి బంగారానికి వన్నె, గట్టిదనం వచ్చినట్లుగా సత్యం, అసత్యం సమపాళ్ళలో కలిసిన అసత్యం సత్యంకంటే యెక్కువగా భాసిస్తుంది.

'బంగారయ్యగారూ! నా కిక శెలవిప్పించండి' అంటూ చేతులు జోడించాడు సారంగపాణి. సారంగపాణి వైపొకసారి తీక్షణంగా చూసి మేడమీదకి వెళ్ళాడు గోపాలం. సారంగపాణి బరువుగా వీధి వాకిలివైపు కదిలాడు.

"మేష్టరూ! మేష్టరూ!!' బంగారయ్య పిలుపు సారంగపాణికి వినిపించకపోలేదు.

మేడపైన రేడియోలో వినిపించే మోహన రాగం మెట్లుదిగుతూవచ్చి పంచమస్వరంలో ఆగిపోయింది.

□□□

చిత్రరథుని

చైత్రయాత్ర

కొత్త బృహన్నల: పాత భీముడు

రాజలక్ష్మీ ప్రొడక్షన్స్‌వారు "వీరాభిమన్య" తెలుగు చిత్ర నిర్మాణం శరవేగంతో సాగిస్తున్నారు. ద్రౌపదీ సమేతంగా పంచ పాండవులు విరాటరాజు కొలువులో వున్నప్పుడు ఘటోత్కచుడు కొంత ప్రతాపం చూపగా అజ్ఞాత రహస్యాలు బైటపడిపోతవేమోనని సోదరపంచకం ఆందోళన చెందుతారు. మహీపతులూ, మహాయోధులూ అయిన ఆ అన్నదమ్ములు, సైరంధ్రి గోళాలలో గోప్యంగా సమాలోచనలు జరుపుతారు. సెప్టెంబర్ మొదటివారంలో ఆ ఘట్టాన్ని వాహినిలో చిత్రీకరించారు. "నర్తనశాల"లో బృహన్నలగా రామారావు ఒక నూతనత్వం చూపి వున్నారు. "వీరాభిమన్య"లో బృహన్నలగా కాంతారావు నటిస్తున్నారు. మేకప్‌లో బృహన్నలల మధ్య వ్యత్యాసం వున్నది.

కాంతారావుతో బృహన్నలపాత్ర విషయమై ప్రస్తావించగా తన నటనలో ఇది వరకు చూడని కొత్తదనం చూప ప్రయత్నిస్తున్నానన్నారు. వేషధారణలో విపరీత వ్యత్యాసం లేకపోయినా సంభాషణోచ్చారణలో, చలనంలో సంచలనం కలిగించగలననే ధైర్యం వున్నదని "పేడి" పాత్రధారి మీసం మెలేసి అన్నారు.

పోతే భీముని సంగతి. "నర్తనశాల" భీముడు విజయవాడ దండమూడి రాజగోపాల్ "వీరాభిమన్య"లో కూడా భీముని-వురఫ్ వలలుడు భూమిక ధరిస్తున్నారు. సెప్టెంబర్ ఏడవ తేదీన మొదటి కాల్‌షీట్ జరిగింది. ఒక్క టేక్ తోటే సంభాషణలన్నీ ఓ. కె. అయినవి. జి. వరలక్ష్మి, కాంతారావు కంఠంలో ఇంత పెండుతనం అరుదన్నారు. రాజలక్ష్మి ముఖ్యులు భీముడు పాత్రకు ఎవర్ని తీసుకోవాలి అన్న విషయమై ఆలోచించినప్పుడు "నర్తనశాల" విడుదలయ్యాక ఆకారంలో దండమూడి తప్ప ఎవ్వరూ కంటికి ఆనరనుకొన్నారు. ఈ చిత్రంలో భీమునికి స్పెషల్ లెన్సులు వినియోగించడానికి, స్పెషల్ ఆంగిల్స్‌లో తీయడానికి ఛాయాగ్రహణ దర్శకుడు రవికాంత్ నగాయిచ్ ప్రత్యేకపు ఏర్పాట్లు చేశారు.

శ్రీ రాజగోపాల్ "జ్యోతి" ప్రతినిధితో మాట్లాడుతూ తన దేహాన్ని యింకా పెంచుకొనేందుకు పరిశ్రమ చేస్తున్నానని, ఛాతీ, దండ మెండుగా వుండేందుకు కసరత్తులూ, ఇంత దేహానికి 'ఎజిలిటీ' వుండేందుకూ నవయువకులతో పోటీపరుగులు చేస్తున్నానన్నారు.



"ఇండియన్ హెర్క్యులిస్"
డి. రాజగోపాల్

నేడు "హెర్క్యులిస్"గా విశ్వవిఖ్యాతి గడించిన స్టీవ్‌రీవ్స్‌తోపాటు లండన్ ఒలింపిక్స్ సందర్భంగా శరీర సౌష్ఠవ పోటీలలో పాల్గొన్న "ఇండియన్ హెర్క్యులిస్", "ఇండియన్ టార్జాన్" బిరుదాంకితులు శ్రీ దండమూడి చాలా 'చిన్నమనిషి'. 220 పౌనులు సాధారణ బరువు. ఛాతీ సాధారణ చుట్టుకొలత 48-50 అంగుళాల మధ్య ఊగిసలాడుతుంది. "వీరాభిమన్య" నిమిత్తం శరీరం బరువు 230 కి. ఛాతీ 52 కు పెంచి కండల కట్‌లకు ప్రయత్నిస్తూవున్నారు. ఇంత 'చిన్న మనిషి' తెల్లవారుజామున యువకులతో పరుగులు తీస్తున్నారూ అంటే ఇక ఆ దృశ్యం ఊహించుకోవచ్చు. హెర్క్యులిస్ టైప్‌లో వీరాభిమన్య భీమునికి నన్ని వేళాలు నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

సామాన్య రైతుకుటుంబంలో పుట్టి, బర్మా, ఫ్రాన్సు, స్విట్జర్లెండు, ఇటలీ, ఈజిప్టు, బ్రిటన్, ఫిన్లెండు, ఆస్ట్రేలియాలలో ప్రజ్ఞా ప్రదర్శనం చేసిన ఈ హెవీ వెయిట్ వెయిట్ లిఫ్టర్, తెలుగు వారికి వ్యాయామాభిమానం ఉగ్గుపాలతోనే వచ్చిందని, వీరరసమంతగా మరేదీ వారిని ఉర్రూతలూగించదని, వీరుల చరితలు వెండితెరకు సక్రమ పద్ధతిలో ఎక్కాలని అంటున్నారు. ఎవరు వీరుల భూమికలు ధరించినా, ఎవరు ఆ చరితలు చలన చిత్రంగా తీసినా సర్వసమగ్ర సంపూర్ణ సౌందర్యమే ధ్యేయంగా యెంచుకోవాలన్నారు. తనదీ ఇదే ధ్యేయమని పేర్కొన్నారు కూడా.

"వీరాభిమన్య" తారాగణం వివరమిది :

కృష్ణుడు - రామారావు, అభిమన్యుడు - శోభన్ బాబు, ద్రౌపది - జి. వరలక్ష్మి, సుభద్ర - ఎస్. వరలక్ష్మి, ఉత్తర-కాంచన్, ఉత్తరకుమారుడు - పద్మనాభం, ఘటోత్కచుడు - నెల్లూరు కాంతారావు, శకుని - ముక్కామల, ధర్మరాజు - ధూళిపాళ, దుర్యోధనుడు - రాజనాల, దర్శకుడు - వి. మధు, నిర్మాతలు - సహతా, దూండీ.

"లవంగి-పండితరాయలు"

షాజహాన్ కాలంనాటి అమర ప్రేమ గాథ "లవంగి-పండితరాయలు"ను బోళ్ళ సుబ్బారావు శ్రీరామా పిక్చర్స్ బ్యానర్‌లో వెండి తెర కెర్పించనున్నారు. ఆరుద్ర సెప్టెంబర్ మూడవ వారంలో స్క్రిప్టు తొలి ప్రతి సిద్ధంచేశారు. మల్లాది రామకృష్ణశాస్త్రి పాటలు వ్రాస్తున్నారు. ఎస్. రాజేశ్వరరావు సంగీతదర్శకత్వం వహిస్తారు. చారిత్రక,

సాంఘిక, పౌరాణిక కాంశాలు సందర్భోచితంగా ఈ చిత్రంలో చొప్పించబడగలవని తెలుస్తున్నది.

షాజహాన్‌కు-ముంతాజ్‌మహల్‌కు కలిగిన సంతతి నిలవకపోవడంవల్ల ఒక బిడ్డను గోదావరి మండలం ముంగొండ గ్రామంలో ఒక్క సద్బ్రాహ్మణుడి కిస్తారు. అప్పటి షాజహాన్ 'ఆడ కూతురు' పెరుగుతుంది. ఆ బ్రాహ్మణుడికీ సరిగా అదే యీడు కుమార్తె వుంటుంది. ఇద్దరూ ఒకే 'మాతృదేవత' అమృతంతో పెరుగుతారు. కాని షాజహాన్ కుమార్తె మృతిచెందుతుంది. చక్రవర్తికి యిచ్చిన మాట నిలుపుకోడానికి ఆ ముంగొండ దంపతులు తమ కుమార్తెనే షాజహాన్ కుమార్తెగా అప్పగించుతారు. అయితే ఆ రహస్యం అన్యులకు తెలియదు. ఆ లవంగిని తన కుమార్తెగా ముస్లింగా షాజహాన్, ముంతాజ్‌మహల్ పెంచుతారు. యుక్తవయస్సు వచ్చిన మీదట పండితరాయలు-లవంగి ఒకరి లలితకళను మరొకరు అభిమానించి ప్రేమ జీవిత భాగస్వాములు కాదలుస్తారు. ఆ హిందూ-ముస్లిం వివాహానికి షాజహాన్ అంగీకరిస్తారా? రాకుమార్తెకు సామాన్య పండిత బాలునికి వైవాహికబంధానికి మొగలాయి చక్రవర్తి ఏమంటాడు?

ఈ ప్రశ్నలకు సమాధానాలకై ప్రేక్షకులు ఉక్కిరిబిక్కిరి అయ్యేటట్లుగా సినీకథను ఆరుద్ర, బొల్ల సుబ్బారావు అనేక గ్రంథ పరిశోధనలు జరిపి తయారుచేశారు.

"షాజహాన్ అంటున్నారు; మరి ఉత్తర ప్రదేశ్‌లో షూటింగ్ జరుపుతారా?" అని 'జ్యోతి' ప్రతినిధి ప్రశ్నించగా ఆగ్రా, ఫతేపూర్, కాశీలలో తెలుగు చిత్రం షూటింగ్ జరపడానికి శీఘ్రగతిని సన్నాహాలు చేస్తున్నట్లు దర్శక నిర్మాత. ఛాయాగ్రాహకుడు శ్రీ బొల్ల సుబ్బారావు తెలియజేశారు. కాశీ విశ్వేశ్వరాలయంలో కొన్ని ముఖ్య సన్నివేశాలు జరుగుతవని, అప్పటి విశ్వేశ్వరాలయంతో తీసినన్ని ఘట్టాలు తీసి, మరికొన్ని మద్రాసులో షూట్ చెయ్యబోతున్నామన్నారు. విశ్వేశ్వరాలయం 'ఇంటీరియర్'ను మద్రాసులో యథాతథంగా సెట్‌వేసి ఆ పవిత్రతను కాపాడుతామని. లొకేషన్ల నిర్ణయానికి కళాదర్శకుడు ఎస్. వి. ఎస్. రామారావుతో సహా తమ యూనిట్ ఉత్తరదేశయాత్రకు కొలది వారాలలో వెళుతుందని చెప్పారు. తాజ్‌మహల్ దృశ్యాలను రంగులలో తీయవచ్చునని తెలుస్తున్నది. తారాగణం యింకా నిర్ణయం కాలేదు.

దాదాపు 16 సంవత్సరాలక్రితం వై. వి. రావు "లవంగి" పేరిట తమిళ, హిందీ భాషలలో చిత్రాలు తీశారు. తెలుగులో ఈ ప్రేమగాథ వెలుగుచూడడం ఇదే మొదటిసారి.

జయభేరివారి చిత్రం

జయభేరి ప్రొడక్షన్స్‌వారి కొత్తతరహా జానపద చిత్రానికి సెప్టెంబర్‌మధ్యలో స్క్రిప్టు ఫైనలైజ్ చేశారు. దర్శకుడు సి. ఎస్. రావు. రచయిత ఆరుద్ర. సెప్టెంబర్ మూడవ వారంలో నెప్ట్యూన్ స్టుడియోస్‌లో షూటింగ్ ప్రారంభించారు. రాజసులోచన, కాంతారావు, బాలయ్య, సత్యనారాయణ, శ్యామలరావు, బాలకృష్ణ మున్నగువారు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు పెండ్యాల. ఛాయాగ్రహణం దత్తు కళ - వాలి; నిర్మాతలు టి. రంగారావు, టి. త్రివిక్రమరావు.



"భక్తరామదాసు"లో నాగయ్య, కన్నాంబ

"ఆంధ్ర మహావిష్ణువు"కు రాజస్థాన్ శ్వేతాశ్వం

జో దెద్దులలో "నమ్మిన బంటు"లో నవీనత తెచ్చిన శంభూ ఫిలిమ్స్‌వారు "ఆంధ్ర మహావిష్ణువు"లో ఒక శ్వేతాశ్వంతో అద్భుత కృత్యాలు చేయించనున్నట్లు తెలుస్తున్నది. కళ్ళు జిగేలుమనిపించే అశ్వరాజమును రాజస్థాన్‌నుంచి తెప్పిస్తున్నారు. ఆంధ్రవిష్ణువు ఆ అశ్వమునకు రౌతు రాజై స్వైర విజయ విహారం సాగిస్తారు. స్క్రిప్టును శ్రీ పింగళి నాగేంద్రరావు సిద్ధం చేశారు. తారల నిర్ణయం జరుగుతున్నది. దర్శకుడు ఏ. కె. శేఖర్ నిర్మాత శ్రీ దగ్గుబాటి లక్ష్మీనారాయణ.

హైదరాబాద్‌లో తొలివర్ణచిత్రం

బాబూమూవీస్‌వారు "తేనె మనసులు"ను హైదరాబాద్ శ్రీ సారథి స్టుడియోస్‌లో రంగులలో తీస్తున్నారు. సెప్టెంబర్ 12 వ

తేదీ నుంచి 18 వ తేదీవరకు ఒక సెట్‌పై షూటింగ్ జరిగింది. ట్రయల్ నిమిత్తమేమి. అసలు షూటింగ్ నిమిత్తమేమి మొత్తం ఐదువేలం అడుగులవరకు నెగిటివ్ ఎక్స్‌పోజ్ చేసినట్లు తెలుస్తున్నది. హైదరాబాద్‌లో తయారౌతున్న ఈ మొట్టమొదటి తెలుగు వర్ణ చిత్రానికి దర్శకుడు ఆదుర్తి. నిర్మాత సుందరం. ఆర్వో కలర్‌ఫిలిం సులభంగా లభ్యమౌతూ వుండడంవల్ల కొత్త నటీనటులతో రంగుల లోనే చిత్రం తీయాలనే ముఖ్య నిర్ణయాన్ని బాబూమూవీస్‌వారు తీసుకొన్నారు.


కథ: ఆదుర్తి, ఆత్రేయ, ముళ్ళపూడి వెంకటరమణ. ఈస్ట్‌మన్ కలర్‌లో షూట్ చేసి, ఆర్వోలో ప్రింట్‌చేసి వర్ణశోభను ఇనుమడింపచేయడం జూబిలీ యూనిట్ తాజా నిర్ణయమై వున్నట్లుకూడా తెలియ వచ్చింది. మద్రాసులోని జెమిని స్టుడియోస్ లేబరేటరీలో డెవలపింగ్, ప్రాసెసింగ్ జరుగుతుంది. సుకన్య, సంధ్యారాణి, రామమోహన్, కృష్ణ ముఖ్య భూమికలు నిర్వహిస్తున్న ఈ చిత్రానికి కె. వి. మహదేవన్ సంగీత దర్శకుడు.

"సుమంగళి" ఇన్‌డోర్ షూటింగ్ పూర్తి

వీనస్-అశోకావారి "సుమంగళి" నిర్మాణంలో సెప్టెంబర్ ప్రథమార్ధంలో మరొక ముఖ్యదశ పూర్తిఅయింది. ఇన్‌డోర్ షూటింగ్ పూర్తిఅయింది. ఇంకొక్కపాటను (అప్పటికి) రికార్డు చేసి ఔట్‌డోర్‌లో షూట్ చెయ్యవలసి వున్నది. ఈ సంచిక వెలువడేసరికి నాగేశ్వరరావు, సావిత్రిలపై ఆ పాట చిత్రీకరణ పూర్తయివుంటుంది. ఆదుర్తి దర్శకత్వాన సుమంగళి సౌభాగ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం స్త్రీ ఔన్నత్యాన్ని నిరూపిస్తుంది. ఈ చిత్రంలో ఇంకా గుమ్మడి, జగ్గయ్య, శోభన్‌బాబు, రేలంగి, జి. వరలక్ష్మి, వాసంతి, గిరిజ, జయంతి నటిస్తున్నారు. సాంకేతిక నాయక వివరమిది: కవి ఆత్రేయ, సంగీత దర్శకుడు కె వి. మహదేవన్, ఛాయాగ్రహణ దర్శకుడు పి ఎల్. రాయ్, కళాదర్శకుడు జి వి. సుబ్బారావు, కూర్పరి టి. కృష్ణ, సంయుక్త నిర్మాత టి. వి ఎస్. శాస్త్రి, నిర్మాత టి. గోవిందరాజన్.

ప్రసాద్ వర్ణచిత్రం

ఎల్. వి. ప్రసాద్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో రంగులలో తలపెట్టిన సస్పెన్స్ చిత్రం మొదటిపాట రికార్డింగ్ ఈ సంచిక వెలువడేసరికి జరిగివుంటుంది. అక్టోబర్ లోనే షూటింగ్ ప్రారంభమౌతోంది ఈస్ట్‌మన్ కలర్‌లో షూట్‌చేసి ఆగ్రాలో ప్రింట్ చెయ్యడం కాని, పూర్తిగా ఈస్ట్‌మన్ కలర్‌లో తీయడం కాని జరగవచ్చు. ఛాయాగ్రహణ దర్శకుడు కె. యస్. ప్రసాద్. ఖరగ్‌పూర్‌లో రైల్వేలో ఉద్యోగంచేస్తున్న కె. నాగేశ్వరరావును హీరోగా బుక్‌చేశారు. ఈ చిత్రంలో యింకా గీతాంజలి, నిర్మల, ప్రభాకరరెడ్డి, చలం, రామకృష్ణ, ధూళిపాళ, అల్లు రామలింగయ్య, చదలవాడ నటించగలరు. పాటలు ఆత్రేయ రచించారు సంగీతం: కె. వి మహదేవన్, కళా దర్శకుడు తోట వెంకటేశ్వరరావు. ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణలు సమకూర్చుతున్నారు. దర్శకులు: అక్కినేని సంజీవి, శ్రీకాంత్.



జయభేరి ప్రొడక్షన్స్‌వారు తమ ప్రథమ చిత్రానికి ఒకపాటను ఇటీవల రికార్డు చేసిన సందర్భంలో సంగీతదర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, ప్లేబ్యాక్ ఆర్టిస్టు పి. సుశీల.

"నిత్యకళ్యాణం పచ్చతోరణం" ఆధారంగా హిందీలో ఎల్. వి. ప్రసాద్ ఒక చిత్రం తీయదలచినట్లు తెలుస్తున్నది.

ఆలయవారి చిత్ర నిర్మాణం ప్రారంభం

ఆలయావారి "ఆల్ ద్రిల్" చిత్రం షూటింగ్ మద్రాసు న్యూటోన్ స్టుడియోస్‌లో సెప్టెంబర్ 16 వ తేదీన ప్రారంభమైంది. ఒకేరోజు రెండు సెట్లపై పని జరగడం ఇంకొక విశేషం. ఎమ్. కె. రెడ్డి (పూర్వపు మంజీరా ఫిలిమ్‌ఫేమ్) హేమాంబరధరరావు దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈచిత్రంలో కృష్ణకుమారి, జగ్గయ్య, సి. హెచ్. నారాయణరావు, బాలయ్య, ప్రభాకరరెడ్డి, గీతాంజలి, పద్మనాభం మున్నగువారు నటిస్తున్నారు. ఉదయం డిటెక్టివ్ గదిలో షూటింగ్ ప్రారంభమైంది. డిటెక్టివ్‌గా జగ్గయ్య నటిస్తున్నారు. మధ్యాహ్నం లాయర్ సలహాశాలలో షూటింగ్ జరిగింది. లాయర్‌గా సి. హెచ్. నారాయణరావు నటిస్తున్నారు. దాశరథి, సినారె, కొసరాజు వ్రాసిన పాటలకు అశ్వత్థామ సంగీతం సమకూర్చుతున్నారు. ఛాయాగ్రహణ దర్శకుడు ఎమ్. జి. సింగ్.

సులోచనారాణి కథ

పి.ఏ.పి. వారు మరి కొలది వారాలలో సెట్‌కు వెళ్ళనున్న చిత్రానికి కథ సమకూర్చినది యద్దనపూడి సులోచనారాణి. నాగేశ్వరరావు, సావిత్రి, కృష్ణకుమారి ముఖ్యభూమికలు నిర్వహిస్తారు. నిర్మాత ఏ. వి. సుబ్బారావు. దర్శకుడు కె. ప్రత్యగాత్మ. ఈచిత్రం తర్వాత పి. ఏ. పి. వారు

శీసే: తెలుగుచిత్రానికి పి. ఏ. పి. ప్రస్తుత అసోసియేట్ డైరెక్టర్ తాతినేని రామారావు సంపూర్ణ దర్శకులుగా వ్యవహరించగలరని తెలుస్తున్నది.

రవీంద్ర ఆర్ట్స్‌వారి సాంఘికం

"లక్షాధికారి" నిర్మాతలు రవీంద్ర ఆర్ట్స్ వారు కొంగ్రొత్తరీతులలో ఒక సాంఘిక చిత్రం నిర్మించబోతున్నారు. నాగేశ్వరరావు, కృష్ణకుమారి ప్రధాన పాత్రలు ధరించే ఈ చిత్రానికి ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణలు సమకూర్చుతున్నారు. సంగీతం టి. చలపతిరావు. దర్శకుడు వి. మధుసూదనరావు. నిర్మాతలు తమ్మారెడ్డి కృష్ణమూర్తి, బి. వి. రెడ్డి.


● ● ●

చందమామావారి "దొరికితే దొంగలు"లో తెలుగులో అపూర్వమైన ట్రిక్ ఫొటోగ్రఫీ ఉండగలదు. వాల్ట్ డిస్నీ "పరాకు ప్రొఫెసర్"లో చేసిన ఎక్స్‌పెరిమెంట్స్ చందమామ నిర్మాత డి. ఎల్. నారాయణకూడా చేసినట్లు తెలుస్తున్నది. రామారావు, జమున ముఖ్యభూమికలు ధరించారు.

● ● ●



ఆర్. ఆర్. పిక్చర్స్‌వారి "శభాష్‌సూరి"లో రామారావు, కృష్ణకుమారి



ఎస్. ఎన్. ఎ. పి. వారి "బభ్రువాహన"లో ఒక దృశ్యం

రాజ్యం పిక్చర్సు "శకుంతల"

రాజ్యం పిక్చర్స్‌వారి "శకుంతల"లో (ప్రొడక్షన్ నెంబరు ఆరు) మొదటి పాట రికార్డింగ్ సెప్టెంబర్ చివరివారంలో భరణీ స్టుడియోస్‌లో జరిగింది.

ఈ చిత్రం సాంకేతికగణం వివరమిది: సంభాషణలు సముద్రాల రాఘవాచార్య, ఛాయాగ్రహణం ఎమ్. ఏ రహ్మాన్. కళా దర్శకుడు టి. వి. ఎస్. శర్మ, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎడిటర్ వీరప్ప, అసోసియేట్ డైరెక్టర్ గురుదేవ్, దర్శకుడు కమలాకర కామేశ్వరరావు, నిర్మాతలు-శ్రీధరరావు, లక్ష్మీరాజ్యం.

"ఎడల్ట్ డ్రామా"

ఆంధ్ర ఆర్ట్సువారు రావి కొండలరావు దర్శకత్వాన మద్రాసు వాణీమహల్‌లో సెప్టెంబర్ అరవతేదీ రాత్రి "కాళరాత్రి" అనే నాటకం ప్రదర్శించారు. ప్రఖ్య శ్రీరామమూర్తి ఆ సస్పెన్స్ క్రైమ్ డిటెక్టివ్ నాటకాన్ని రచించారు. నగరంలోని సినీ ప్రముఖులు అనేకమంది ఆ ప్రదర్శనను తిలకించారు.

ఎడల్ట్ సినిమావలె ఇది నిజానికి "ఎడల్ట్ డ్రామా"

సస్పెన్స్, క్రైమ్, డిటెక్షన్ అనగానే, అందులో స్టేజి ప్లే అనగానే, డిటైల్స్ బోలె

దంత వర్క్ఔట్ చెయ్యాలి. కవి. దర్శకుడు వాటిని ఎంతకష్టపడి కూర్చినా ప్రదర్శన సమయంలో టెక్నీషియనులు, నటీనటులు వాటిని పాటించాలి. సర్వ సంపూర్ణ సహకారం వున్నప్పుడే ఇటువంటి నాటకాలు రక్తి కట్టుతవి

ఆంధ్ర ఆర్ట్సువారి నాటకం చూచిన మీదట పై సహకారశక్తి రక్తికట్టించిందనే చెప్పక తప్పదు.

మద్రాసులో తెలుగు నాటకాలంటే "ఇండియన్ పంక్చ్యువాలిటీ కి" అసలు అర్థమన్నమాట. కాని క్రమశిక్షణకల ఆంధ్ర ఆర్ట్సువారు తెలుగు నాటకంతో బ్రిటిష్ పంక్చువాలిటీ చూపారు.

ఈ సంస్థ మరికొన్ని కొత్తవంతాలు కూడా త్రొక్కవలెనని కళాభిమానులు ఆశీస్సులు పలికారు.

విజయవాడలో రామారావు విశేషప్రకటన

అక్టోబర్ 25 వ తేదీ సాయంకాలం విజయవాడలోని ఆంధ్రజింఖానాగ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతను. కేంద్రమంత్రి డాక్టర్ కె ఎల్. రావు సమక్షాన. ఆర్గనైజర్ శ్రీ ఎమ్. ఫణిభూషణరావు ఆధ్వర్యాన అనేకపుర, కళా. సాంస్కృతిక సంస్థలు జరిపే సన్మానంలో ఎన్. టి. రామారావు ఒక చరిత్రాత్మక ప్రకటన చెయ్యబోతున్నారు.

బీద విద్యార్థుల సహాయార్థమూ, ఇతర ఉత్తమకార్యాలకూ తమ సంపాదనలో పదవవంతు ప్రత్యేకిస్తున్నట్లు రామారావు చెప్పబోతున్నారు. అంతేకాదు; ప్రజాహిత కార్యక్రమాలకు తనెప్పుడు అవసరమని పెద్దలు ఎంచినా సినిమారంగానికి "లాంగ్ లీవ్" పెట్టి ముందు ఈసేవ చెయ్యదలచినట్లు కూడా ఆయన చెప్పవచ్చు.

విజయవాడలో రామారావుపేరు శాశ్వతంగా నిలచేందుకు ముఖ్యమంత్రి కొన్ని పనులు తలపెట్టినట్లు "జ్యోతి" మద్రాసు ప్రతినిధికి తెలియవచ్చింది.

అగస్టు 28 వ తేదీనే మద్రాసులో రామారావుగారు "రామారావు ట్రస్ట్" ఏర్పాటుచేసి వున్నారు. ముందు కొంత మొత్తం వేశారు. ఇక జీవితాంతంవరకు తన సంపాదనలో పదవవంతు ట్రస్ట్‌కు తరలిస్తూ వుంటారు.

అక్టోబర్ 25 వ తేదీనే అజిత్‌నగర్‌లో ఒక ఆస్పత్రికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసి రామారావు పేరు దానికి పెట్టవలెనని, ఆవిధంగా ఆయన పేరును శాశ్వతం చెయ్యాలని బ్రహ్మానందరెడ్డిగారు ప్రతిపాదించదలచారట. మునిసిపాలిటీవారు ఇందుకు మహదానందం ప్రకటించగలరని మద్రాసు సినీ వర్గాలలో అనుకొంటున్నారు.

మొత్తం ఆంధ్రప్రదేశలోని 130 సంస్థలు ఆ రోజున రామారావుకు సన్మానపత్రాలు సమర్పించబోతున్నవి.

సినీనటుడుగానే కాక బాధితుల పట్ల రామారావు చూపిన సానుభూతికి చిహ్నంగా పై సన్మానం ఏర్పాటు చేస్తున్న సంఘానికి విజయవాడ మునిసిపల్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్. ఎమ్. ఏ. ఖుద్దూస్ సారథి.



"సింహాచల క్షేత్రమహిమ"లో కృష్ణకుమారి, కాంతరావు, చలం.

సన్మానోత్సవంలో ప్రముఖపాత్ర నిర్వహించవలసిందని కోరినప్పుడు 'నాయకత్రయం' ఏమి చెప్పినదో ప్రత్యేకంగా తెలియవచ్చింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి "విజయవాడ అగ్ని బాధితులకు ఎలా సహాయం చెయ్యడం" అని దీర్ఘాలోచనలోపడి వున్నప్పుడు రామారావు లక్షరూపాయలు యిచ్చి నాకు మనశ్శాంతి యిచ్చారు. సన్మానసభలో సంతోషంగా పాల్గొంటాను" అని చెప్పారు.

డాక్టర్ కె. ఎల్. రావు "విజయవాడ పౌరుడుగా విజయవాడ సన్మానంలో పాల్గొనేందుకు విశేషానందంతో రాగలను" అని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పి. తిమ్మారెడ్డి "అలనాడు రాయలసీమ క్షామ బాధితులకై రామారావు వీధులలో భిక్షాటన చేశారు. ఈ రోజున ఆ లక్షాధికారికి లక్షపదార్చన జరుగుతూ వున్న దంటే ఆ కార్యక్రమాన్ని నేను ప్రారంభించడానికి ఆనందంతో పరవశ్య త్రొక్కుతున్నాను" అని అన్నారు.

శ్రీయుతులు బి. నాగిరెడ్డి, చక్రపాణి, బి. ఎన్. రెడ్డి. సుందరలాల్‌నహతా, విఠలాచార్య, శ్రీధరరావు, లక్ష్మీరాజ్యం, డి. ఎల్. నారాయణ, జగన్మోహనరావు ఇంకా అనేకమంది ఆ పుత్సవానికి విజయవాడ చేరనున్నారు.




"వివాహబంధం"లో భానుమతి.

వి వా హ బ ం ధ ం

భానుమతి, ఎన్. టి. రామారావు చాల కాలం తరవాత భరణీ వారి "వివాహ బంధం"లో ప్రేయసీ ప్రియులుగా, భార్యాభర్తలుగానటించడమే కాక కొత్తరకం పాత్రలను నిర్వహిస్తున్నారు. విద్య సంస్కారం, అభిజాత్యం,ఆత్మసంస్కారం గల నవయువతి భారతిగా భానుమతి, ఉన్న తాదర్శాలు, గంభీరవ్యక్తిత్వం గల 'కళ్ళజోడు' లెక్చరర్‌గా రామారావు అన్నితరగతుల ప్రేక్షకులను అలరించగలరు. ముఖ్యంగా రెండు తరగతులవారికి—పెళ్ళి అయినవారికి, కానివారికి (అంటే మొత్తం అందరికీ) ఈచిత్రం ఆహ్లాదకరం కాగలదు. మిగతా నటీ నటవర్గంలో నాగయ్య, సూర్యకాంతం, పద్మనాభం, బాలయ్య, ప్రభాకర రెడ్డి, వాసంతి, మోహనదాస్, ఎ వి. సుబ్బారావు, డాక్టర్ శివరామకృష్ణయ్య, బొడ్డపాటి మొదలైనవారున్నారు. దర్శకుడు రామకృష్ణ; సంగీత పర్యవేక్షణ భానుమతి; సంభాషణలు ఎం. విశ్వేశ్వరరావు; పాటలు సి. నారాయణ రెడ్డి; ఫొటోగ్రఫీ అన్నయ్య; కళ రాజేంద్ర కుమార్.

ఆంధ్రరాజధానిలో "అమెరికా",

అమెరికా రిటర్న్‌డ్ అక్కినేని నాగేశ్వర రావు న్యూయార్క్ బ్రాడ్వే పద్ధతిలో "నాటకకళ శిక్షణ కేంద్రాన్ని" (యాక్టర్స్ వర్క్‌షాప్) ఈ సంవత్సరాంతంలోగా హైదరాబాద్‌లో నెలకొల్పదలచారు. సినిమా తారలకు సేవ స్థితిలో సహాయపడ గల నిధికూడా ఒకటి 1964 గుడ్ బై చెప్పే లోగా ఏర్పాటుచెయ్యదలచారు. అమెరికా-హాలీవుడ్‌లోని యాక్టర్స్‌గిల్డ్‌ను పోలిన సంస్థ ఒకటి భాగ్యనగర్‌లో ఏర్పాటుచేసి విధి నిర్వహించాలని నాగేశ్వరరావు సంకల్పం.



"వివాహ బంధం"లో భానుమతి, యన్. టి. రామారావు

నాగేశ్వరరావు కొత్త చిత్రాలు

"లవకుశ" నిర్మాత శంకరరెడ్డి జానపద వర్ణ చిత్రంలో నటించేందుకు అక్కినేని నాగేశ్వరరావు అంగీకరించారు.


హైదరాబాద్‌లో బి. ఏ. సుబ్బారావు తీయబోతున్న "నతీ సక్కుబాయి"లో నాగేశ్వరరావు, సావిత్రి, సూర్యకాంతం నటిస్తారు.

"రా మ దా సు" కు అపూర్వ టెక్నిషియన్ బలం

నాగయ్య "రామదాసు"కు ఒక్కొక్క శాఖకు పనిచేసినంతమంది టెక్నిషియనులు మరే చిత్రానికి పనిచెయ్యలేదు. సంగీత దర్శకులు ఐదుగురు; ఛాయాగ్రహణ దర్శకులు ముగ్గురు; సంభాషణల రచయితలు ఇద్దరు. వీరికి ఒకరు పర్యవేక్షకులు. ఇందులో నటించినవారిలో సూర్యకుమారి అమెరికాలో వున్నారు. కన్నాంబ, గోవింద రాజుల సుబ్బారావు, సి. ఎస్. ఆర్. ఆంజనేయులు పరలోక గతులైనారు. మహమ్మద్ రఫీ పాటలతో సహా మొత్తం 40 పాటలున్న ఈచిత్రం బాక్స్ ఆఫీస్ దృష్ట్యా కూడా చరిత్రసృష్టించగలదు. వి. నాగయ్య దర్శకులు. అయితే దీపావళికి, కాకపోతే సంక్రాంతికి ఈచిత్రం విడుదల అవుతుంది.

సెప్టెంబర్ కార్డ్

సెప్టెంబర్‌లో మద్రాసులో "హైదరాబాద్ మూవీస్‌వారి సాంఘికం, మాధవీవారి "పాండవ వనవాసం", భావన్నారాయణగారి "తోటలో పిల్ల - కోటలో రాణి", ఇంకా "బభ్రువాహన", "హరిశ్చంద్ర", "ప్రమీలార్జునీయం", "నాదీ ఆడ జన్మే", "తోడు నీడ", "వివాహబంధం", "రామదాసు" మొదలైన చిత్రాల షూటింగ్ జోరుగా సాగింది. మరికొన్ని చిత్రాల వివరాలు వేరే సందర్భాలలో తెల్పడమైనది.



"రామదాసు"లో లింగమూర్తి.

స్పెయిన్‌లో కట్టిన పెకింగ్ కథ

అమెరికనులు పడమరను తూర్పుచెయ్యగల శక్తిమంతులు; పాశ్చాత్య ప్రాంతాన్ని ప్రాచ్యప్రదేశంగా సినిమాకు సంబంధించినంతవరకు [illegible] ప్రవీణులు.

చైనా ప్రాచ్య రాజ్యం. స్పెయిన్ పాశ్చాత్యరాజ్యం. చైనాకథను స్పెయిన్‌లో అమెరికనులు తీశారు. చిత్రంపేరు" 55 డేస్ ఎట్ పెకింగ్" – పెకింగ్‌లో 55 (దుర్) దినాలు. కాలం 1900. అప్పటికీ ఇప్పటికీ 64 సంవత్సరాల అంతరం వున్నా తరంగ దాడి (వేవ్ ఎటాక్), మూఢచర్య. పిడివాదం. రాజకీయ అమర్యాద. పెడసరితనం మొదలైనవాటిలో చైనీయులలో ఏమాత్రం మార్పురాలేదని ఈ అడంబర చిత్రం చూచినమీదట తోస్తుంది.

"ఎల్‌సిడ్" వంటి మహా ఆడంబరచిత్రం (70 మిల్లిమీటర్) నిర్మించిన, సిసిల్ డిమిలీ శైలి ప్రముఖుడు, శామ్యూల్ బ్రాన్‌స్టన్ "పెకింగ్‌లో 55 (దుర్) దినాలు" తీశారు. "ఆడంబరంలో రెండూ వేటికవే గొప్ప. కథ, నాయక దృష్టిలో పెట్టుకొంటే "ఎల్‌సిడ్" (స్పానిష్ వీరుడు) ఈ రెండింటిలో విశిష్టమైనది. అయితే ఒక ప్రాచ్య దేశం కథను ఒక పాశ్చాత్యుడు ఒక పాశ్చాత్య దేశంలో ససంప్రదాయంగా తీయడం ఎంత కష్టమో అలోచిస్తే "పెకింగ్‌లో 55 (దుర్) దినాలు" ఎంతటి విశిష్ట చిత్రమో వ్యక్తంకాగలదు.

అది 1900 వేసవి కరువు కాటకాలతో చైనా క్రుంగిపోతున్నది. వేరొకచెంప అన్యదేశీయుల పీడనం వుంటున్నది. "ధర్మరక్షకులు" పేరిట యోధులు (వీరిని బాక్సర్లుగా వ్యవహరించినట్లు పై చిత్రం తెల్పుతున్నది) విచ్చలవిడిగా వ్యవహరించి క్రైస్తవ మిషనరీలను, విదేశ దౌత్య రాజకీయ సైనిక ప్రతినిధులను క్రూరంగా హింసించారు. చైనా సామ్రాజ్ఞి, ఆమెకు ముఖ్య సలహాదారు అయిన ఓ రాకుమారుడు "ధర్మరక్షకుల" అధర్మ కాండకు పరోక్ష ప్రోత్సాహమిచ్చారు. పశువును బలియిచ్చినట్లు మిషనరీలవారిని నరకడం. జెయింట్ వీల్‌కు దేహాన్ని విరగగట్టి నీళ్ళలో ముంచడంవంటి ఘోరకృత్యాలు అనేకానేకంగా సాగుతున్నవి.

పెకింగ్‌లో (న్యాయాని కిది పీకింగ్; పీక పీకేసే రాజధాని) అప్పటికి వుంటున్న అమెరికా, బ్రిటన్, ఆస్ట్రియా, ఇటలీ, రష్యా, జర్మనీ, ఫ్రాన్సు, జపాన్ మరి రెండు దేశాల ప్రతినిధులపై "ధర్మ రక్షకులు" కత్తికట్టారు. కారణం అప్పుడే పెకింగ్‌కు వచ్చిన అమెరికన్ మెరైన్ మేజర్ (ఛార్లటన్ హెస్టన్) ఒక ఘోర కృత్యాన్ని నివారించ యత్నించడమూ, దరిమిలా ఆయన బ్రిటిష్ రాయబారితో (డేవిడ్ నివెన్), తదితరులతో మంతనాలు జరపడమూను. జర్మనీ రాయబారిని ధర్మ రక్షకులు వధించడంతో పై రాజ్యాలవారు సమష్టి నిరసన తెల్పారు. ఫలితంగా 24 గంటలలో దేశం వదలి వెళ్ళాలని, వారి రక్షకులు వెంటనే ఆయుధాలు స్వాధీనం చెయ్యాలని చైనా సామ్రాజ్ఞి ఉత్తరువు చేసింది.

పై రాజ్యాలవారికి రక్షణగా కొద్ది వందల మంది సైనికులు మాత్రమేవున్నా, వారికి ఆయుధ సామగ్రి, మందుగుండు పరిమితంగా వున్నా అనతికాలంలో తమ తమ రాజ్యాలనుంచి సహాయం రాగలదనే ఉద్దేశంతోను, రాజకీయ కారణాలవల్లనూ రాతివానికి రాయికొట్టి ఇక్కడే వుండేందుకు తమ కోటను రక్షణ పెంచుకొంటారు. అమెరికా మేజర్ యిచ్చిన ధైర్యంతో బ్రిటిష్ రాయబారి ఆ ప్రమాదకర నిర్ణయానికి వచ్చారు.

చైనా బాక్సర్‌లు ఇంపీరియల్ సైనికులు విదేశీయులకోటను వేలసంఖ్యలో వచ్చి ముట్టారు. కాని విదేశీయులు యుక్తితో ఎదిరించి శక్తితో నిలవగలిగారు. దరిమిలా మెరుపు దాడులనేకం నిలవదొక్కుకొన గలిగారు.

ఈకృషిలో సైన్య, సామగ్రి నష్టం చాలా జరిగింది. బైటినుంచి అనుకొన్న సహాయం రాలేదు. ఒక దళాధిపతి క్షతగాత్రుడయ్యాడు. బ్రిటిష్ రాయబారి ముద్దుల కుమారుడు కూడా తుపాకి గుండుకు బలి కావడంతో స్థయిర్యం సడలింది. అట్టి తరి అమెరికన్ మేజర్ కొద్దిమంది సాయంతో రాత్రివేళ మారువేషాలలో వెళ్ళి చైనీయుల మందుగుండు గిడ్డంగిని పేల్చివేస్తారు. శాంతి ప్రతిపాదనలు సాగవు. చైనీయులు అనేకరెట్ల శక్తి యుక్తులతో ముట్టడి సాగించారు. జయాపజయాలు దైవాధీనంగా వున్న క్షణంలో బైటినుంచి అనుకొన్న సహాయం వచ్చి చైనా సామ్రాజ్యపాలనను అంతమొందిస్తుంది.

చైనాలో కొన్ని ప్రదేశాలు విదేశీయుల పీడనలో వున్నప్పుడు ప్రజలు రెచ్చిపోవడంలో రవ్వంత న్యాయం లేకపోలేదు. అయితే దౌత్య ప్రతినిధులను చంపివేయడం, ముట్టడించడం వంటివి చాలా ఘోరంగాపే కన్పిస్తవి.

"పెకింగ్‌లో 55 (దుర్) దినాలు"కథలో ముట్టడి, ఎదురు ముట్టడి దృశ్యాలు మాత్రమే డామినేట్ చేసినందువల్లను, కుట్రలకు, సెంటిమెంట్‌కు తగినంత ప్రాముఖ్యం లేకపోయినందువల్లను ఈ చిత్రం ఏదో పోరాట చిత్రస్థాయిలోనే వుండకలిగిందేకాని "బెన్‌హర్", "టెన్ కమాండ్‌మెంట్స్", "ఎల్‌సిడ్", తదితర

“టూ వుమెన్” స్థాయికంటినా రాలేకపోయింది. అయితే పోరాటాలు రకరకాలుగా, విశేష సమూహాలతో చిత్రీకరించినందున చైనా చిత్రం కొంత నిలవగలిగింది.

నిర్మాత శామ్యూల్ బ్రాన్‌స్టన్ స్పెయిన్‌లో పెకింగ్‌నగరం సెట్లు నిర్మించి షూటింగ్ జరిపారు. ఆ షూటింగ్‌లకు వెడుతూ వస్తూ తార శ్రీమతి అవాగార్డ్నెవర్ బొంబాయి విమానాశ్రయం చేరారుకూడా. ఆచిత్రంలో ఆమె రష్యనుగా నటించింది. చైనాకు సంబంధించిన చిత్రంలో నటిస్తూ వుండడంవల్ల ఆమె బొంబాయి (శాంతాక్రజ్) విమానాశ్రయంలో బైటకు రావడానికే ఇష్టపడలేదు. విమానంలోనేకూర్చొండిపోయింది. అశేష ప్రేక్షకులు వెళ్ళి చూడబోగా తెరవేసింది. విలేఖరులు వెడితే మాట్లాడనేలేదు. ఈమె వ్యవహారం ఎంత “సంతృప్తికరంగా” వున్నదో చిత్రంలో నటనకూడా అలానే వుంది.

సినిమా కళకు సంబంధించినంతవరకు ఆ చిత్రంలో కొన్ని విశిష్టాంశాలు లేకపోలేదు.

ఒకటి: ఒక నగరం నగరమే పునర్నిర్మించి షూటింగ్ జరపడం. రెండవది టైటిల్ కార్డులో సంగీత ధ్వనితో బీభత్సం ప్రతి ధ్వనింప జేయడం. బహూశా ఇది విదేశ చిత్రాలలో చాలా చాలా అరుదు. “పెకింగ్‌లో 55 రోజులు” అన్న టైటిల్ కార్డు వచ్చేవరకు నేపథ్య సంగీతం వినీ వినిపించకుండా వుంటుంది. పై టైటిల్ కార్డు రాగానే గుండెలకు దడ తెప్పించే “మహా శబ్ద సంగీతం” వినిపిస్తుంది. పెకింగ్‌లో 55 రోజులు ఎంత భయంకరంగా వున్నవి అన్న విషయాన్ని ముందుగా ప్రేక్షకులకు నేపథ్య సంగీతంతో సూచించడమనేది నిజంగా ఒక గొప్ప కళ. ఏ దృశ్యం చూచినా వేలకు వేలు జనాభా వుంటారు. వారు వున్న దృశ్యాలలోనేమి ఇతర సందర్భాలలో నేమి శబ్ద గ్రహణం విశిష్ట స్థాయిలో వుంది. సమూహ దృశ్యాలకు నేపథ్య సంగీతం అమరింది. శబ్దము, సంగీత దర్శకత్వము బీభత్సం వృద్ధి పొందించడానికి బాగా ఉపయోగించుకొన్నారు. దర్శకుడు నికోలస్ రే

1900 నాటి చైనా భవనాలు, మందిరాలు, దుస్తులు, ఆకారాలు, అలంకారాలు, ఇంకా 11 రాజ్యాలవారి దుస్తులు, రీతులు - ఇవన్నింటిని పునస్సృష్టించ కలిగారూ అంటే కళా దర్శకుడు ఎంతటి ప్రతిభావంతుడో ఊహించవచ్చు. ముఖ్యంగా సెట్ డెకొరేషన్‌లో ఈచిత్రంనుంచి నేర్చుకోవలసింది చాలా వుంది.

జాక్ హిల్డ్‌యార్డ్ ఛాయాగ్రహణం హాలీవుడ్ స్థాయిలోవుంది; తప్పితే కొన్ని కంపొజిషన్‌లలో ఆయన ప్రత్యేక ప్రతిభ గోచరించింది

అమెరికనులు విదేశీయ కథావస్తువుతో చిత్రం తీసినప్పుడు విదేశీయులు ఆంగ్లమును దొరలు మాట్లాడినట్లే వినిపింపజేస్తారు. ఈ చిత్రంలో ఆదోషం లేదు. చైనావాళ్ళు ఇంగ్లీషు మాట్లాడితే ఎలా వుంటుందో అలానే ఆయా పాత్రధారులచేత మాట్లాడించారు. అది చాలా సహజంగా తోచింది.

హస్టన్, నివెన్ గొప్ప నటులే అయినా ఇందులో పాడిచేసిందేమీ లేదు.



BHARANI PICTURES
MADRAS 17

భరణీ పిక్చర్స్

వివాహబంధం

నిర్మాత-దర్శకుడు- పి.రామకృష్ణ

నవయుగ విడుదల